ఆదివారం ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

fb.com/vaartha

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

31-1-2025 శుక్రవారం సంపుటి: 30 సంచిక: 363 పేజీలు: 8+16 వెల: 6.50

ప్రొఫెసర్ల రిటైర్మెంట్ 65 యేళ్లకు పెంపు

పాఠశాల స్థాయిలో ఏఐ ఆధారిత డిజిటల్ విద్య

2

# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎంత?





## రూ.1.63 లక్షల కోట్ల భారీ అంచనాలు

రేపు పార్లమెంటుకు పద్దు సమర్పించనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

గ్రాంట్లు, పన్నుల్లో వాటాకై ఎదురు చూపు

నిధుల కేటాయింపుపై సర్కార్ ఆశలు

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో రాష్ట్రం భారీ ఆశలు పెట్టుకుంది. ఈ బడ్జెట్‌లో తెలంగాణకు సరైన వాటా దక్కుతుందా లేదా అనేదానిపై సర్కార్ తర్జనభర్జన పడుతోంది. గత ఏడాది కేటాయింపులు పూర్తిగా కార్యరూపం దాల్చకపోవడం, ఆశించిన మేర నిధులు అందకపోవడంతో ఈసారి కేంద్ర సాయం ఏమేరకు అందుతుందనేది ప్రశ్నార్థకమే అవుతోంది. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ఈసారి రాష్ట్రానికి ఎంత మేరకు నిధులు కేటాయిస్తుందో అనేది ఉత్కంఠగా మారింది. తెలంగాణలో వివిధ ప్రాజెక్టుల కోసం రూ. 1.63 లక్షల కోట్ల మేర నిధులు మంజూరు చేస్తుందనే ఆశతో ప్రభుత్వం ఉంది. ముఖ్యంగా ఫ్యూచర్ సిటీ సహా అనేక అభివృద్ధి ప్రణాళికలు,కార్యక్రమాలకు నిధులు అవసరమవుతున్నాయి. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీల అమలు, పాలమూరు-రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా లాంటి పాత డిమాండ్లతో పాటు, ట్రిపుల్ ఆర్, మెట్రో రైలు విస్తరణ వంటి కొత్త ప్రాజెక్టులకు నిధులు కోరుతోంది. ఇదే సమయంలో గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి ఆశించిన మేర సహాయపడటం లేదని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. రాష్ట్రానికి కేంద్రం నుండి వచ్చే గ్రాంట్లు, పన్నుల్లో వాటాలను పెంచాలని ఇప్పటికే పలుమార్లు విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే రాష్ట్రాలకు కేంద్రం నేరుగా ఇచ్చే నిధుల్లో కోతలు కొనసాగుతూనే ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన పన్నుల్లో వాటా 41 శాతంగా 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదించినా, బడ్జెట్‌లో కేవలం 32 శాతానికి పరిమితం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రానికి రూ.15 వేల కోట్లకు పైగా మాత్రమే వస్తుండగా, పూర్తి స్థాయిలో అందితే మరో రూ.5 వేల కోట్లు అదనంగా రావొచ్చని అంచనా వేస్తోంది. గత మూడేళ్లలో తెలంగాణకు ఇచ్చిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ వివరాలను పరిశీలిస్తే, 2022-23లో రూ.41,001.73 కోట్లు అందుతాయని అంచనా వేయగా, కేవలం రూ.13,179.21 కోట్లు (32.14) మాత్రమే వచ్చాయి. 2023-24లో రూ.41,259.17 కోట్లు ఆశిస్తే, అందులో కేవలం రూ.9,729.91 కోట్లు (23.58) మాత్రమే మంజూరయ్యాయి. కేంద్ర ప్రాయోజిత పథకాలైన ఉపాధి హామీ, ఇళ్లు, స్మార్ట్ సిటీలు, రోడ్లకు తగిన నిధులు అందకపోవడం గమనార్హం. ఇక ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల కోసం నిధులు అత్యవసరం కానున్నాయి. రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల కోసం కేంద్ర సహాయం కోరుతూ ఇప్పటికే వివిధ ప్రతిపాదనలు పంపింది. 2025-26 బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు >>2



బాపు సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్ తదితరులు

# బాపూజీకి ఘన నివాళి

## సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్, మంత్రులు

**హైదరాబాద్ (మెహిదీపట్నం), జనవరి 30, ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు లంగర్ హౌస్ త్రివేణి సంగమం వద్ద ఉన్నటువంటి బాపూ ఘాట్‌లో ఘనంగా జరిగాయి. గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు , పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం >>2

# వచ్చే 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు?

## 5న మంత్రివర్గ భేటీ, కులగణన సర్వేకు ఆమోదం

## మార్చి రెండోవారంలో స్థానిక ఎన్నికలు!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 30:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 7న అసెంబ్లీ సమావేశాలు జరపాలని సిఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించినట్లు సమాచారం. ఫిబ్రవరి 5వ తేదీన సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. ఈ కేబినెట్ సమావేశంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయాలు తీసుకోనుంది. భేటీలో కుల గణన >>2

# భుజంగ, రాధాకిషన్‌కు ఊరట



## ఫోన్‌ట్యాపింగ్ కేసులో అనారోగ్య కారణాల వల్ల వారిద్దరికి బెయిలు మంజూరు చేసిన హైకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి30:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇద్దరికి బెయిల్ మంజూరు అయ్యింది. ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు,అడిషనల్ ఎస్పీ భుజంగరావుకు తెలంగాణ హైకోర్టు గురువారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. లక్ష రూపాయలతో కూడిన 2 షూరిటీలూ సమర్పించాలని న్యాయస్థానం షరతువిధించింది. అలాగే వ్యక్తిగతమైన పాస్ పోర్టులు సమర్పించాలని ఇద్దరికీ ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసులో పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని, ఎక్కడా కూడా సాక్షులను ప్రభావితం చేయవద్దని భుజంగరావు,రాధాకిషన్‌రావుకు తెలంగాణహైకోర్టు స్పష్టం చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని చాలా కీలకమైన అంశాలు బయటపడ్డ విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో రాజకీయ నేతల ఫోన్లు ట్యాపింగ్ చేయడంలో టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావు పాత్ర ఉందని దర్యాప్తు అధికారులు నిర్ధారించారు. నాంపల్లి కోర్టు వీరి బెయిల్ పిటిషన్‌ను రెండు సార్లు తిరస్కరించింది. దీంతో వారిద్దరు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో పదినెలలకు పైగా జైలులో ఉన్నామని, అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా బెయిల్ మంజూరు చేయాలని ఇరువురు హైకోర్టును కోరారు.వారి ఆరోగ్య పరిస్థితిని పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం ఇద్దరికీ బెయిల్ మంజూరు చేసింది. అలాగే ఈకేసులో ఇంకావిచారణ సాగుతోందని, ఎక్కడా కూడా సాక్షులను ప్రభావితం చేయవద్దని, >>2



ఉస్మానియా ఆసుపత్రి కొత్తభవనం నమూనా

# కొత్త 'ఉస్మానియా'కు నేడు శ్రీకారం

## 2 వేల పడకల సామర్థ్యంతో నిర్మాణం

## భూమి పూజ చేయనున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి30:** తెలంగాణ వైద్యారోగ్య చరిత్రలో మరో కొత్తశకం ప్రారంభం కానుంది. వందేళ్లుగా తెలంగాణతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు సేవలందించిన ఉస్మానియా నూతన >>2






గురువారం న్యూఢిల్లీలో రాజ్‌ఘాట్ వద్ద బాపూజీకి నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ

# 2047 నాటికి వికసిత్ భారత్‌గా అభివృద్ధి చేయాలన్నది ప్రధాని లక్ష్యం

## -కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 30 ప్రభాతవార్త:** 2047 నాటికి వికసిత భారత్‌గా అభివృద్ధి చేయాలన్న ప్రధాని నరేంద్ర మోడీ విజన్‌లో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖలో పలు సంస్కరణలు తీసుకొచ్చామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. చెన్నైలో నేవేలీ లిగ్నయిట్ కార్పొరేషన్ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటైన ఎన్ఎల్‌సి ద్వారా జరుగుతున్న పనిని అభినందిస్తున్నాను. లిగ్నయిట్ ఉత్పత్తిని పెంచడంతోపాటుగా దేశంలో పునరుత్పాదక విద్యుత్ (రెన్యూవబుల్ ఎనర్జీ)ను ప్రోత్సహించే దిశగా విలిది ద్వారా జరుగుతున్న ప్రయత్నం ప్రశంసనీయం. దేశవ్యాప్తంగా నెంబర్‌వన్ గిగావాట్ పునరుత్పాదక శక్తి ఉత్పత్తి చేసిన మొట్ట మొదటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎల్‌సి అన్నారు. ఒడిశాలోని తాలాబిరా, మచ్చకట పాత్రపారాల్లో జార్ఖండ్‌లోని సౌత్ ద్వారా, నార్త్ ద్వారా బొగ్గు ఉత్పత్తిని సామర్థ్యాన్ని పెంచేందుకు ఎల్ఎల్‌సి ద్వారా విశేషమైన కృషి జరుగుతోంది. తాలాబీరాలో ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేసిన 3800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణం త్వరితగతిన పూర్తవుతుందన్నారు. అలాగే రాజస్థాన్, అస్సాం, అండమాన్, నికోబార్ దీవుల్లో పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని పెంపొదించేందుకు ఎల్ఎల్‌సి ఆధ్వర్యంలో పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ఎన్ఎల్‌సి సంస్థలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కవర్ స్కీమ్ వర్తించేలా పథకాన్ని రెండు నెలల్లో అమలు చేసే విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించాను. ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్షల మేరకు విద్యుత్ ఉత్పత్తిని గణనీయంగా పెంచడంలో ఎన్ఎల్‌సికు ఎల్లవేళలా బొగ్గు, గనుల శాఖ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఎన్ఎల్‌సి ద్వారా విద్య, వైద్యం, మౌలికవసతుల కల్పనలో జరుగుతున్న కార్యక్రమాలు అభినందనీయం. నెవేలీలో భారీ టౌన్ షిప్ నిర్మిచడం,లక్ష మంది నివసించేలా ఏర్పాట్లు చేయడం, 3 కోట్ల మొక్కలను నాటడం విలిది సామాజిక బాధ్యతకు నిదర్శనం అన్నారు. అనంతరం నేవేలీలో పరంపరియం పేరిట ఎన్ఎల్‌సి ఏర్పాటు చేసిన మ్యూజియంను, ఎన్ఎల్‌సిఐఎల్ వింగ్స్ మొబైల్ యాప్‌ను ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గనుల శాఖ అడిషనల్ సెక్రటరీ విస్మిత తేజ్, ఎన్ఎల్‌సి సిఎండి ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సు 65 యేళ్లకు పెంపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి30:** విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను వినిపించింది. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయో పరిమితిని 60 నుండి 65 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం యూనివర్సిటీల్లో పనిచేస్తూ యుజిసి స్కేల్ పొందుతున్న టీచింగ్ స్టాఫ్‌కు మాత్రమే ఈ నిబంధన అమలవుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించింది.రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా యూనివర్సిటీల్లో టీచింగ్ స్టాఫ్ నియామకాలు నిలిచిపోయాయి. దీంతో యూవనిర్సటీల్లో బోధన సిబ్బంది తీవ్ర కొరత ఉంది. ఈ నేపథ్యంలో క్లాసులు సజావుగా సాగడానికి వయో పరిమితి పెంపు తప్పనిసరిగా మారింది. ఉన్నత విద్యాశాఖ పరిధిలో పన్నెండు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వాటిలో 2,817 ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 757 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 2,060 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రతి నెలా ఉస్మానియా, జేఎన్‌టీయుహెచ్, కాకతీయ విశ్వవిద్యాలయాలలో ఇద్దరు ముగ్గురు చొప్పున ప్రొఫెసర్లు పదవీ విరమణ పొందుతున్నారు. దీంతో ప్రొఫెసర్ల వయో పరిమితిని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## బాపూజీకి ఘన నివాళి

>> ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్ లు బాపు సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం బాపు ఘాట్ రంగనానికి చేరుకొని అక్కడి ధ్యాన మందిరంలో సర్వమత ప్రార్థనలో పాల్గొన్నారు. పాఠశాల చిన్నారులను పలకరించి బాపు ఘాట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఉన్నతాధికారులు మరియు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ సిపి సి వి ఆనంద్, ప్రజా ప్రతినిధులు స్థానిక నేతలు కూరాకుల కృష్ణ, చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త 'ఉస్మానియా'కు నేడు శ్రీకారం

>> ఆసుపత్రికి నూతన భవనం నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉస్మానియా ఆసుపత్రి అఫ్జల్‌గంజ్‌లో ఉండగా.. నూతనఆసుపత్రిని గోషామహల్ స్టేడియంలో నిర్మించనున్నారు. నూతన ఆసుపత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేయనున్నారు. 2 వేల పడకల సామర్థంతో మొత్తం 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆసుపత్రిని నిర్మించనున్నారు. 26ఎకరాల విస్తీర్ణంలో నిర్మిం చనున్న ఈ నూతన ఆసుపత్రిని కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా నిర్మించాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించింది.రాబోయే వందేళ్ల అవసరాలకు తగినట్లు నూతన ఆసుపత్రిని నిర్మించాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులనుఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా.. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు, ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులు, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒకే చోట అన్నిరకాల డయాగ్నసిస్ సేవలు,అత్యాధునిక టెక్నాలజీతో కూడిన మార్చురీ, స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఫెసిలిటీస్ కూడిన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ యూనిట్లకు రూపకల్పన చేశారు. అలాగే అండర్ గ్రౌండ్ రెండు ఫ్లోర్లలో పార్కింగ్, ఆసుపత్రి సమీపంలో ఫైర్‌స్టేషన్, ఆసుపత్రి చుట్టూ విశాలమైన రహదారులు, ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడికైనా ఫైర్ ఇంజిన్లు, అంబులెన్స్‌లు తిరిగే మార్గాలు, దివ్యాంగులు ఆసుపత్రిలోకి రాకపోకలు సాగించేందుకు వీలుగా ర్యాంప్‌లు, ఆసుపత్రిలోని రోగులకు సహాయకులుగా వచ్చే వారు సేద తీరేందుకు డార్మెటరీలు, క్యాంటీన్, మరుగుదొడ్లు నిర్మించనున్నారు.

# అసెంబ్లీ సమావేశాలు?

>> సర్వే రిపోర్టుపై చర్చించి ఆమోద ముద్రం వేయనుంది. అలాగే ఫిబ్రవరి 7న ప్రత్యేక అసెంబ్లీ సెషన్ ఏర్పాటు చేసి కులగణన నివేదికపై సభలో చర్చించి అనంతరం అసెంబ్లీ ఆమోద ముద్ర వేయనుంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కుల గణన సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సర్వే తుది నివేదికను ఇప్పటికే పూర్తిగా సిద్ధం చేశారు. ఈ తుది నివేదికను అధికారులు ఫిబ్రవరి 2వ తారీఖున కేబినెట్ సబ్ కమిటీకి సమర్పించనున్నారు. కులగణ సర్వే నివేదకపై మంత్రి వర్గ సబ్ కమిటీ చర్చించి తుది నివేదకను ఆమోదం కోసం కేబినేట్‌కు సమర్పించనుంది. ఫిబ్రవరి 5న కేబినెట్ ప్రత్యేక భేటీలో దీని గురించి చర్చించనున్నారు. కులగణన నివేదికపై సభలో చర్చించి ఆ తర్వాత అసెంబ్లీ ఆమోదం తెలపనుంది. అలాగే ఈ కేబినెట్ భేటీలోనే పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపైన కేబినెట్ చర్చించనున్నట్లు తెలుస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కేబినెట్ ఆమోద ముద్ర వేసి.. అనంతరం పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్ హోం కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయిన విషయం తెలిసిందే. ప్రత్యేక అసెంబ్లీ ఏర్పాటు సమావేశంపై సీఎం ఇప్పటికి గవర్నర్‌తో చర్చించినట్లు తెలుస్తోంది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతోనే ప్రత్యేక సెషన్ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం. కాగా రాష్ట్రంలో మార్చి 21వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మార్చి 2వ వారంలోపే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయొచ్చా? అని సిఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఆరా తీసినట్లు తెలిసింది. వార్డుల వారీగా బీసీ కులాల డేటాను ఎన్ని రోజుల్లో ఫైనల్ చేయొచ్చు? రిజర్వేషన్ల ఖరారుకు డెడికేటెడ్ కమిషన్‌కు ఎన్ని రోజులు పడుతుంది? కమిషన్ రిపోర్టు ఇచ్చిన తర్వాత ఎలక్షన్ షెడ్యూల్ ప్రకటించి, ఫలితాలు ఇవ్వడానికి ఇంకా ఎన్ని రోజులు పట్టొచ్చు? అని అధికారులను వివరాలు అడిగనట్లు సమాచారం. బుధవారం నిర్వహించిన పంచాయతీరాజ్ సమీక్షా సమావేశంలో పాల్గొన్న సిఎం... టెన్త్ ఎగ్జామ్స్ స్టార్ట్ అయ్యేలోపే ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించినట్లు తెలిసింది. మొత్తంగా కులగణన రిపోర్టు సబ్ కమిటీకి అందిన వెంటనే మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి, ఆ రిపోర్టును ఆమోదించనుంది. ఆ తర్వాతే బీసీ రిజర్వేషన్ ఫైనల్ చేసేందుకు డెడికేటెడ్ కమిషన్ కసరత్తు ప్రారంభించనుంది. రిజర్వేషన్లు ఫైనల్ అయిన తర్వాత ఎన్నికలను పూర్తి చేసేందుకు ఎన్ని రోజుల సమయం పడుతుందని సమీక్ష సమావేశంలో ప్రస్తావనకు వచ్చినప్పుడు గతంలో మూడు వారాల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేశారు. షెడ్యూల్ నుంచి,ఫలితాల వరకు ఈ సమయం సరిపోతుందని అని అధికారులు క్లారిటీ ఇచ్చినట్లు తెలిసింది. అయితే 10వ తరగతి పరీక్షలు ప్రారంభం అయ్యేలోపు ఎన్నికలను పూర్తి చేయొచ్చా? అని సిఎం ప్రశ్నించినప్పుడు అధికారులు పూర్తి చేయొచ్చని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. మార్చి 21 నుంచి 10వ తరగతి పరీక్షలు మొదలు కానున్నాయి. ఈలోపు ఇంటర్ పరీక్షలు ప్రారంభమైనా ఎన్నికల ప్రక్రియకు ఆటంకం ఉండదని అధికారులు స్పష్టం చేసినట్లు తెలిసింది.



గురువారం న్యూఢిల్లీలో హిమాచల్ ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్‌తో భేటీ అయిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

# విద్యుత్ సామర్థ్యంలో మరో ముందడుగు

## హిమాచల్‌ప్రదేశ్‌లో హైడ్రో ప్రాజెక్టులపై ఆసక్తి

## సిఎం సుఖ్‌వీందర్‌తో డిప్యూటీ సిఎం విక్రమార్క భేటీ

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** విద్యుత్ సామర్థ్యం పెంపుదలలో తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. హిమాచల్‌ప్రదేశ్‌లో హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులపై ఆసక్తి కనపరుస్తున్న నేపథ్యంలో గురువారం ఉదయం ఢిల్లీలో హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్ విందర్ సింగ్‌తో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, విద్యుత్ శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో కలిసి భేటీ అయ్యారు. అక్కడి అధికారుల సమక్షంలో, 400 మెగావాట్ల ఎస్ఐఎల్ఐ, 120 మెగావాట్ల ఎమ్ఐవైఎఆర్ ప్రాజెక్టులపై సుముఖత కనపరుస్తూ ఒక లేఖను సమర్పించారు. తదుపరి ఎంఓయూకు సంబంధించిన ముసాయిదాను పంపించాలని కోరారు. ఈ ఒప్పందంలోని అంశాలను పరిశీలించిన తదుపరి అవసరమైన చర్యలు చేపడుతుందని తెలిపారు.

ఈ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే హైడ్రో ఎలక్ట్రిక్ విద్యుత్ తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేయబడుతుందని ఈ సందర్భంగా విక్రమార్క తెలిపారు. ఫలితంగా ప్రస్తుత రాష్ట్ర అవసరాలు, భవిష్యత్ విద్యుత్ డిమాండ్లను తీర్చేందుకు విద్యుత్ సరఫరా సామర్థం మరింత బలపడేందుకు ఉపయోగపడుతుందన్నారు. కాగా హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల ఏర్పాటు విషయంలో బిఓటి (బిల్డ్ ఒన్ ఆపరేట్ ట్రాన్స్ఫర్) విధానంలో ప్రతిపాదనలను కోరుతూ హిమాచల్ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర అధికారులు ఆ దిశగా చేసిన ప్రయత్నాలు చేశారు. హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం బిఓటి విధానంలో 22 హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలు ఆహ్వానించగా, రాష్ట్ర విద్యుత్ శాఖ అధికార బృందం ఆ రాష్ట్రంలో సందర్శించింది. వాటిలో 100 మెగావాట్లకు పైబడి సామర్థం గల ప్రాజెక్టులపై ఆసక్తిని వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఈ భేటీ జరిగింది.

# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎంత?

>> కోరుతూ ప్రభుత్వ నివేదికను సమర్పించింది. వాటిలో ముఖ్యమైన ప్రాజెక్టులును చూస్తే రీజనల్ రింగు రోడ్డు, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, మెట్రో ప్రాజెక్టు విస్తరణ, హైదరాబాద్ సీవరేజి మాస్టర్‌ప్లాన్, వరంగల్ భూగర్భ డ్రైనేజీ, రేడియల్ రోడ్లు, గ్రీన్‌ఫీల్డ్ హైవే, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్, రిక్రియేషన్ పార్కులు, ఫ్యూచర్ సిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, కరీంనగర్, జనగామ జిల్లాల్లో లెదర్ పార్కులు. అలాగే, గోదావరి వ్యాలీ బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయింపు, హైదరాబాద్‌ను సెమీకండక్టర్ మిషన్‌గా అభివృద్ధి, కొత్త కేంద్రీయ విద్యాలయాలు, జిల్లాల వారీగా నవోదయ పాఠశాలలు, పాలమూరురంగారెడ్డికి జాతీయ హోదా, ఐఐఎం ఏర్పాటు వంటి ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. వీటితో పాటు తెలంగాణకు గత ఆరేళ్లుగా రాని వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధులు రూ.1,800 కోట్లు, 2014-15లో కేంద్ర ప్రాయోజిత పథకాల బకాయిలు రూ.495 కోట్లు, ఉమ్మడి సంస్థల నిర్వహణలో ఏపీ వాటా కింద రూ.408.49 కోట్లు అందించాలని కోరింది. ఈ ప్రతిపాదనలకు కేంద్రం ఎంత మేరకు స్పందిస్తుందో ఫిబ్రవరి 1న తేలనుంది.

## వారం - వర్జ్యం

తేది : 31-01-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
శుక్ల విదియ మ.1.59
శతభిష తె.4.13
వర్జ్యం మ.12.33-2.02
దు.ఉ.9.04-9.49, 2) మ.12.52-1.37
శుభసమయం : ఉ.7.00-8.00, సా.5.00-5.50
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** అనారోగ్యం, బంధువులతో విరోధాలు ఏర్పడి చికాకులు పెడతాయి. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**వృషభం :** వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు ఏర్పడిన అధిగమించి ముందుకు సాగుతారు. ధనలాభం.

**మిథునం:** పనులు వాయిదా పడుతాయి. ఆకస్మిక ప్రయాణాలలో లాభాలు పొందుతారు. నూతన పరిచయాలు.

**కర్కాటకం :** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. కొత్త పనులు చేపడతారు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**సింహం:** దూర ప్రాంతాలనుంచి ఆహ్వానాలు అందుతాయి. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**కన్య :** పారిశ్రామిక, రాజకీయ వర్గాలలో వారికి సన్మానాలు, సత్కారాలు పొందుతారు.

**తుల :** ఉద్యోగాలలో పురోగతి సాధిస్తారు. మానసిక ప్రశాంతత పొందుతారు. నూతన వస్తు, వస్త్రాల కొనుగోలు.

**వృశ్చికం:** కొత్త మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. విలువైన వస్తువులు కొంటారు, వాహన యోగం.

**ధనుస్సు:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకొంటారు. ఆరోగ్య భంగం. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మకరం:** కీలక నిర్ణయాలలో జాప్యం జరిగిన నిదానంగా తీసుకొంటారు. దైవదర్శనాలు ప్రయాణాలు.

**కుంభం:** కుటుంబ బాధ్యతలు పెరిగిన సమర్థవంతంగా నిర్వహిస్తారు. వస్తుసేకరణ, సంఘంలో గౌరవం పెరుగుతుంది.

**మీనం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన అస్తిగమిస్తారు. ధన వ్యయం. జీవిత భాగస్వామి సాయం అందిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## రాధాకిషన్‌కు ఊరట

>> దర్యాప్తు అధికారులను కూడా ప్రభావితం చేసేలా ప్రయత్నిస్తే చర్యలు తప్పవని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. విదేశాలకు పారిపోయేందుకు అవకాశం ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించడంతో వారి వ్యక్తిగతమైన పాస్ట్‌పోర్టులను సమర్పించాలని ఆదేశించింది. పోలీసులు ఎప్పుడు పిలిచినా వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని భుజంగరావు, రాధాకిషన్‌రావుకు ఆదేశాలు జారీచేసింది. ఇప్పటికే అనారోగ్య కారణాలతో రాధాకిషన్‌రావు ముందస్తు బెయిల్‌పై ఉన్నారు.ప్రస్తుతం హైకోర్టుబెయిల్ మంజూరు చేయడంతో భుజంగరావు శనివారం ఉదయం బెయిల్‌పై విడుదలయ్యే అవకా శం ఉంది.

## ఖురాన్‌ను దగ్ధం చేసిన వ్యక్తి కాల్చివేత

**స్టాక్‌హోమ్, జనవరి 30:** స్వీడన్‌లో 2023 సంవత్సరంలో అనేకసార్లు ముస్లింల పవిత్ర గ్రంధం ఖురాన్‌ను తగులబెట్టిన నిందితుడు సల్వాన్ మోమికాను గుర్తుతెలీని దుండగులు కాల్చి చంపారు. ఇరాకీ క్రిస్టియన్ అయిన సల్వాన్ మోమికా వైఖరిపై గల్ఫ్‌దేశాలనుంచి తీవ్ర నిరసన ఆగ్రహావేశాలు వ్యక్తం అయ్యాయి. తెగలు, జాతులమధ్య చిచ్చురేపినందుకు కారణమయ్యాడని మోమికాపై స్వీడన్ పోలీసులు కేసులునమోదుచేసారు. ఈకేసును విచారించిన స్టాక్‌హోం కోర్టు తన రూలింగ్‌ను వాయిదావేసింది. వచ్చేనెల3కి వాయిదావేస్తూ సల్వాన్ మోమికా మృతిచెందినందున మరింత సమయం అవసరమని కోర్టు న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. సోడర్‌టాల్జే నగరంలో ఈ కాల్పులఘటన జరిగిందని మోమికా అక్కడే నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణంలో జాప్యం తగదు

## ఇరిగేషన్ అధికారులపై మంత్రి ఉత్తమ్ అసంతృప్తి

**హైదరాబాద్,జనవరి 30,ప్రభాతవార్త:** లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణాలు జాప్యం చేయడమే కాకుండా ఒకరిపై ఒకరు తోసిపుచ్చుకుంటు ఇంజనీర్లు ఉదాసీనంగా వ్యవహరించడం తగదని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఆయన తనసొంత నియోజకవర్గం నీటి వనరుల ప్రాజెక్టులపై సమీక్ష చేస్తూ సూర్యపేట సిఇతోపాటు జిల్లా ఇరి గేషన్ అధికారులను వెంటనే హైదరాబాద్‌కు రావాలని ఆదేశాలు జారీచే యాలని ఇఎన్‌సికి సూచించారు. నా సొంత నియోజకవర్గంలోనే పనులు జరగకపోతే రాష్ట్ర పరిస్థితి ఏంటని అగ్రహం వ్యక్తంచేశారు.తెలంగాణలోని ఇరిగేషన్‌శాఖ అధికారులు ఎక్కడ సమస్యలు తలెత్తున్నాయో అక్కడ దృష్టిసారించంలేదని ఆవేదన చెందారు. ముఖ్యంగా వర్షాకాలం దెబ్బతిన్న పనులు కూడా ఇంచా మొదలు పెట్టలేదని వాటి వెంటనే మొదలుపెట్టాలని అన్నారు. ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకొన్నారు.

**కెబినెట్ విస్తరణ సీక్రెట్... ప్రేమసాగర్ కాంగ్రెస్ పార్టీకి మూల స్థంబం..**

ప్రస్తుతం అమలులో ఉన్న మంచి పథకాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి వారసత్వంగా వచ్చినవైనా, గత పదిఏళ్ళ కాలంలో అమలు చేసిన పథకాలైనా అన్ని కొనసాగుతాయని వేటి ఆపేదిలేదని నీటిపారుదలు,పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఆయన అన్నారు. నలుబైఏళ్ళ రాజకీయ అనుభవంతో ఒక నమ్మకంకలిగిన నాయకుడిగా చెబుతున్నా బిఆర్ఎస్ తప్పుడు ప్రచారంతో ఎవరు ఆందోళన చెందకూడదని అన్నారు. ఇంత మంచిపాలన ఇంతవరకు చూడలేదని ఆయన అన్నారు. ఇన్ని పథకాలు అమలు చేసిన ప్రభుత్వంలేదని అన్నారు.,ప్రభుత్వ పథకాలలో వేగం పెంచుతున్నాం అని చెప్పారు.

పంచాయతీ ఎన్నికలు త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు పథకాలపై విమర్శలు చేయడం సరికాదు. కేబినెట్‌విస్తరణ సీక్రెట్ ఇప్పుడు చెప్పలేం అని ఆయన అన్నారు. ప్రేమసాగర్ పార్టీకి మూలస్థంబం అని కొనియాడారు.,కెటిఆర్ అరెస్టుపై ఆయన స్పందించలేదు. మంత్రి ఉత్తమ్‌తో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశమైనారు. సెక్రటేరియట్‌లో వరుసగా మంత్రులను ఆయన కలవడం ఆసక్తి కలిగించింది.

# లోక్‌సభలో పెరుగుతున్న వివిఐపి సంస్కృతి

## వన్‌నేషన్ వన్ ఎలక్షన్‌పై తొందరపాటు తగదు

### అఖిలపక్ష సమావేశంలో మంత్రులను నిలదీసిన విపక్ష ఎంపిలు

**న్యూఢిల్లీ, జనవరి 30:** బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎన్డీయే ఆధ్వర్యంలోజరిగిన అఖిలపక్ష సమావేశంలో వన్‌నేషన్ వన్ ఎలక్షన్ బిల్లుపై తొందర పడకూడదని బిజెపి మిత్ర పక్షం జెడియు కలవరం వ్యక్తంచేసింది. ఈ బిల్లుపై సమగ్ర చర్చలు అవసరమని తొందరపాటుతో ఆమోదించడం సరికాదని జెడియు ప్రతినిధులు వెల్లడించారు. కేంద్రమ ంత్రులు రాజ్‌నాథ్‌సింగ్ కిరెణ్ రిజిజు, జెపినడ్డా, అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, ఎ ల్ మురుగన్‌ల ఆధ్వర్యంలో గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. వన్‌నేషన్ వన్‌ఎలక్షన్ బిల్లును శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టారు. అయితే ఈ బిల్లును 39మంది సభ్యులున్న జెపిసికి నివేదించారు. బడ్జెట్ సమావేశాలకోసం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలోజెడియు ఎంపి సంజయ్ కుమార్‌ఝా మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎంతమాత్రం తొందరపాటు తగదని లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణపై సమగ్ర చర్చలు జరగాలని అన్నారు.అలాగే మరికొన్ని రాజకీయ పార్టీలనుంచి అంటే కాంగ్రెస్ నుంచి జైరామ్‌రమేష్, కె.సురేష్, గౌరవ్ గగోయ్, వామపక్ష నేతలు జాన్ బ్రిట్టాస్, పి.సందోష్‌కుమార్, టిఎంసి ఎంపిలు సుదీప్ బంధోపాధ్యాయ్, డెరెక్ ఒబ్రెయిన్ తదితరులు ఈసమావేశంలో పాల్గొన్నారు. ఝాతోపాటే ఇతర టిడిపి సభ్యులు కూడా కొత్తలోక్‌సభలో సీటింగ్ ఏర్పాట్లపై ప్రశ్నలు వేసారు. మొదట ఈ సమస్యను కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గగోయ్ లేవనెత్తారు. తర్వాత ఇతర ఎంపిలు కలుస్తూ సీటింగ్ ఏర్పాట్లను ఏకపక్షంగా నిర్ణయించారని ఆరోపించారు. వివిధ విపక్ష ఎంపిలు ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే ప్రశ్నలువేసారు. వివిఐపి సంస్కృతి, లోక్‌సభ నిర్వహణ యాజమాన్యలోపాలు, మహాకుంభ్‌లో తొక్కిసలాట, వక్ఫ్ సవరణబిల్లుపై ఏర్పాటుచేసిన జెపిసి పనితీరు వంటి వాటిని ప్రశ్నించారు. అనేకమంది ప్రతిపక్ష ఎంపిలు గగోయ్, బ్రిట్టాస్, డిఎంకె ఎంపి టిఆర్‌బాలు, బంధోపాధ్యాయ్, సంతోష్ కుమార్ తదితరులు వక్ఫ్ ప్యానెల్ విధివిధానాలను ఛైర్మన్ జగదాంబికా పాల్ బుల్‌డోజింగ్‌చేస్తున్నారని, విపక్ష ఎంపిలపట్ల ప్యానెల్ తీరు అమర్యాదకరంగా ఉందని ఆరోపించారు. జెపిసి విధానాలుప్రజాస్వామ్య వ్యవస్థకు సిగ్గుచేటుగా ఉన్నాయని, జెపిసి ఒక ప్రహసనంగా మారుతోందని ఆరోపించారు. సమాజ్‌వాదిపార్టీ రామ్‌గోపాల్ యాదవ్ మాట్లాడుతూ మహాకుంభ్‌మేళాలో తొక్కిసలాట యుపి ప్రభుత్వ వైఫల్యం వల్లనే జరిగిందని, మృతులు, బాధితులకు మరింత పరిహారం చెల్లించాలని ఆయన కోరారు. మహాకుంభమేళాలో మొత్తం తమకుతాము ప్రచారంచేసుకోడానికే ప్రాధాన్యతనిచ్చారని మేనేజ్‌మెంట్ నిర్వహణ లోపాలున్నాయని అన్నారు. సంక్లిష్టమైన అంశాలపై చర్చను అనుమతించడంలేదని, కేవలం అధికారపార్టీకి మాత్రమే అనుమతులిస్తున్నారని అన్నారు. అనేకమంది విపక్ష ఎంపిలు కూడా యుజిసి నిబంధనల్లో మార్పులపైమాట్లాడారు. కొత్త ముసాయిదా నిబంధనలు విద్యారంగ సమైక్యత, వర్సిటీల స్వయంప్రతిపత్తిని హరించివేసేవిగా ఉన్నాయన్నారు. సీపీఎంకు చెందిన ఎంపి బ్రిటాస్ మాట్లాడుతూ అధికార ఎంపిలు విపక్షంకంటే స్థాయి సంఘాల్లో ఎక్కువమంది ఉంటున్నారని, అధికారపార్టీనుంచే 29 మందిసభ్యులున్నారని, వీరికే అనేక కమిటీల్లో సభ్యత్వం ఇచ్చారన్నారు. 1990లో ఈ స్థాయీ సంఘాల ఏర్పాటుప్రారంభించినప్పటినుంచి పార్లమెంటులో ఒక ఎంపి ఒక్క స్థాయీ సంఘంలో మాత్రమే ఉండాలన్న నిబంధన పాటించారని, కానీ ఇపుడు 26 మంది బిజెపిఎంపిలు రెండు స్థాయీ సంఘాల్లో ఉన్నారని దీన్నింట్టి అధికార పార్టీయే స్థాయీ సంఘాలను కూడా నియంత్రిస్తున్నట్లుగా ఉందన్నారు. సమావేశం తర్వాత పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా బడ్జెట్ సమావేశాలు సజావుగాసాగేందుకు సహకరించాలని కోరామని చెప్పారు. ఈ ఏడాదిలో బడ్జెట్ సమావేశాలే మొట్టమొదటి పార్లమెంటు సమావేశాలని, ముందు రాష్ట్రపతి ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తారని, రాష్ట్రపతి ప్రసంగం తర్వాత ఆర్థిక సర్వే ఉంటుందని, శుక్రవారం ప్రవేశపెడతారని శనివారం బడ్జెట్‌ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఆ తర్వాత రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ ఉంటుందని, అలాగే బడ్జెట్‌పైనా చర్చలుంటాయన్నారు.

# పాఠశాల స్థాయిలో ఏఐ ఆధారిత డిజిటల్ విద్య

## బెంగళూరులోని ఎక్ స్టెప్-ఫౌండేషన్‌ను సందర్శించిన విద్యాశాఖ ఉన్నతాధికారులు

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంపొందించడంలో భాగంగా పాఠశాల విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) ఆధారిత డిజిటల్ విద్యను ప్రవేశ పెట్టనున్నారు. అందులో భాగంగా బెంగళూరులోని ఎక్ స్టెప్- ఫౌండేషన్‌ను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, నేతృత్వంలో పాఠశాల విద్య డైరక్టర్ ఈవీ నరసింహారెడ్డి, ఇతర పాఠశాల విద్యాధికారులు గురువారం సందర్శించారు. ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్‌ను పూర్తి స్థాయిలో ఉపయోగించడం ద్వారా రాష్ట్రంలో పాఠశాల విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాలని.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో పాఠశాల విద్యను మరింత నాణ్యతా ప్రమాణాలతో అందించడానికిగాను ఏఐతోపాటు డిజిటల్ ఇన్షియేటివ్స్‌లను పాఠశాల విద్యలో పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని విద్యాశాఖ నిర్ణయించింది. విద్యార్థులలో మరింత మెరుగైన అభ్యాస పద్దతులను, సాంకేతిక ప్రమాణాలను పెంపొందించడం వంటి వినూత్న కార్యక్రమాలను పాఠశాల విద్యలో ప్రవేశ పెట్టనున్నారు. అందులో భాగంగానే బెంగుళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఎక్ స్టెప్ ఫౌండేషన్‌ను రాష్ట్ర విద్యా శాఖ అధికారుల ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం సందర్శించింది. ప్రతినిధి బృందంలో ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ డైరక్టర్ కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహా రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్లు ఉమాహారతి, గరిమ తదితరులున్నారు. విద్యా రంగంలో డిజిటల్ పద్దతులను ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులలో విద్యాపరమైన నాణ్యతా ప్రమాణాలను పెంపొందించడంలో ఎక్ స్టెప్ ఫౌండేషన్ అగ్రగామిగా ఉందని అధికారులు పేర్కొన్నారు. ఎక్ స్టెప్ ఫౌండేషన్ విజనరీ టెక్నోక్రాట్, ఫిలాంత్రపిస్ట్, ఇన్ఫోసిస్ కోఫౌండర్ అయినా నందన్ నీలేకని ఈ ఎక్ స్టెప్- ఫౌండేషన్‌కు కోఫౌండర్‌గా ఉన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాల్లో డిజిటల్ పద్దతులను ప్రవేశపెట్టి మరింత మెరుగైన సేవలను అందించడానికి ఈ ఎక్‌స్టెప్ ఫౌండేషన్ ప్రారంభించారు. ఇప్పటికే గుజరాత్, కర్ణాటక, ఒడిస్సా, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి ఎక్‌స్టెప్ ఫౌండేషన్ పనిచేస్తుందని అధికారులు తెలిపారు. ఫౌండషనల్ లిటరసీ, న్యూమెరసీ, ప్రాథమిక విద్యా స్థాయిలో ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ ఆధారిత డిజిటల్ పద్ధతుల ద్వారా ప్రాథమిక స్థాయిలో రాయడం, చదవడం, సంఖ్యా పరమైన విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ప్రధానమైన అంశాలు.ఎక్‌స్టెప్ ఫౌండేషన్‌ను సందర్శించిన, రాష్ట్ర విద్యా శాఖ ప్రతినిధి బృందం 2024 లో కేరళ రాష్ట్రాన్ని సందర్శించి అక్కడి విద్యా రంగంలో చేపట్టిన ఆధునిక పద్దతులను పరిశీలించింది.



అసెంబ్లీ ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్, చైర్మన్ సుఖేందర్‌రెడ్డి నివాళులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 30:** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా శాసనసభ ఆవరణలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, లెజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహాచార్యులు, అధికారులు పాల్గొన్నారు.

**ప్రజాస్వామ్య రక్షణకు ఆయుధంగా బాపూజీ సత్యాగ్రహం: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్**

ప్రజాస్వామ్య రక్షణకు ఆయుధంగా బాపూజీ సత్యాగ్రహాన్ని ప్రజలు ఆచరించాలని రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి, చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. టిపిసిసి చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి బొగ జగదీష్ ఆధ్వర్యంలో గాంధేయ విధానంపై ప్రచార కార్యక్రమాలు చేపడుతారని వివరించారు.

## లక్ష్మీశ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ యజమాని గుర్రం విజయలక్ష్మి అరెస్ట్

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకొన్న పోలీసులు

**హైదరాబాద్ (దుండిగల్), జనవరి 30, ప్రభాతవార్త:** కొనుగోలుదారులను మోసం చేసిన ఓ రియల్ వ్యాపారిని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ పురపాలిక సంఘం, మల్లంపేటలో భవానీ జిఎలెస కైట్స్ పేరుతో లక్ష్మీశ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులు గుర్రం విజయలక్ష్మి(48) విల్లాలను నిర్మించారు. పంచాయతీ అనుమతులతో 250కు పైగా హెచ్ఎండిఏ అనుమతులతో 60కు పైగా నిర్మాణాలు చేశారు. విల్లాల విక్రయాల సమయంలో సంస్థ బ్రౌచర్‌లో పేర్కొన్న విధంగా సరియైన అనుమతులతో ఇంటి నిర్మాణం, యోగా సెంటర్, పార్కు, స్విమ్మింగ్‌పూల్, ఆధ్యాత్మిక కేంద్రాలు, భూగర్భడ్రైనేజీ వ్యవస్థ, ఎస్‌టిపిలు, భూగర్భ విద్యుత్ సరఫరా, తదితర అంశాలను అందించనున్నట్లు తెలిపారు. దీంతో నిర్వాహకురాలు మాటలు నమ్మి వివిధ బ్యాంకుల నుండి రుణాలు పొంది నమ్మి 250మందికి పైగా ఇళ్లను కొనుగోలు చేశారు. నిర్మాణాలు పూర్తి దశలో ఉండగా అనుమతులు అక్రమంగా పొందారంటూ మున్సిపల్ అధికారులు 260ఇళ్లను సీజ్ చేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తరువాత ప్రజాప్రయోజనాల కోసం అందిస్తాన్న సౌకర్యాలు అందివ్వకపోవడంతో మమ్మల్ని మోసం చేశారని పోలీసులకు పలుమార్లు బాధితులు ఫిర్యాదులు చేయగా కేసులు నమోదు చేశారు. నిందితురాలు దొరకకపోవడంతో విదేశాలకు వెళ్ళనున్నట్లు తెలియడంతో లుకౌట్ జారీ చేశారు. ఈక్రమంలో గురువారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆమెను అదుపులోకి తీసుకొని దుండిగల్ పోలీస్‌స్టేషన్ తరలించారు. పోలీసుల విచారణలో నేరం అంగీకరించడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. లక్ష్మీశ్రీనివాసకన్‌స్ట్రక్షన్స్ నిర్మిస్తున్న విల్లా నిర్మాణాలకు సంబంధించి మొదటి నుండి వివాదాలు నెలకొంటున్నాయి. ఖత్య చెరువు బఫర్ ఆక్రమణ జరిగినట్లు నిర్ధారించిన నీటిపారుదల శాఖ అధికారులు, రెవిన్యూ అధికారులతో పాటు బాధితులు గుర్రం విజయలక్ష్మిపై పోలీసులకు ఫిర్యాదులు చేశారు. దాంతో వివిధ సెక్షన్ల కింద నిందితురాలిపై దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.



నిందితురాలు గుర్రం విజయలక్ష్మి (ఫైల్)

## అత్యాచారం, పోక్సో కేసులో నేరస్తునికి 20 యేళ్ల కఠిన కారాగార శిక్ష

**సిద్దిపేట రూరల్, జనవరి 30, ప్రభాతవార్త:** అత్యాచారం, ఫోక్సో కేసులో నేరస్తునికి 20 యేండ్ల కఠిన కారాగార జైలు శిక్ష రూ.50 వేల జరిమానా విధిస్తు జిల్లా ప్రిన్సిపల్‌సెషన్స్ న్యాయమూర్తి సాయిరమాదేవి తీర్పునిచ్చినట్లు సీపీ అనురాధ గురువారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని పాలాట్‌లో ఇంటెగ్రేటెడ్ అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి మనవరాలు(3) యేళ్ల చిన్నారిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్(30) అనే యువకుడు ఆడుకుంటూమని తన రూంలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని, గత యేడాది ఆగస్టులో బాధితురాలి తాత త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించి నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. అనంతరం టెక్నికల్ రిపోర్ట్ వచ్చిన తర్వాత కేసు పరిశోధన పూర్తిచేసి నేరస్తునిపై కోర్టులో ఛార్జిషీట్ వేసినట్లు తెలిపారు. న్యాయమూర్తి ఇరువురి వాదనలు విన్న తర్వాత నేరస్తునికి 20 యేండ్ల కఠిన కారాగార జైలుశిక్ష రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, కోర్టు అధికారులను, సిబ్బందిని అభినందించారు.

# బడ్జెట్ సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లు

### మరో 15 బిల్లులు ప్రవేశపెడుతున్న కేంద్రం

**న్యూఢిల్లీ, జనవరి 30:** పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు మొత్తం 16 బిల్లులుప్రవేశపెట్టేందుకు ఎన్డీయే సర్కారు సిద్ధంచేసింది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే వక్ఫ్ సవరణబిల్లుతోపాటు, వన్ ఎలక్షన్ ఒన్‌నేషన్ బిల్లును కూడా ఆమోదింప చేసుకోవాలనే తాపత్రయంతో ఉంది. మొత్తం 16 బిల్లులను సభలోప్రవేశపెడతామని, 2025 ఆర్థికబిల్లు, ఇమిగ్రేషన్ ఫారినర్స్ బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. అలాగే 2025-26 సంవత్సరానికిగాను వివిధ శాఖల పద్దులపైనా పార్లమెంటులో చర్చ స్తారు. జెపిసి ఇటీవలే సవరణ బిల్లును ఆమో దించింది. విపక్ష ఎంపిలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులుసూచించగా 14 సవరణలను కమిటీ అంగీకరించింది. అందుకు సంబంధించిన తుది నివేదికను సిద్ధంచేసి లోక్‌సభ స్పీకర్‌ఓంబిర్లాకు అందించింది. ఈ సమా వేశాల్లోనే ఈ బిల్లు ఆమోదం పొందేవిధంగా ఎన్డీయే కసరత్తులు చేస్తోంది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీ తనాన్ని తీసుకు రావడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశ్యమని కేంద్రం చెపుతోంది. ఈ సవరణలపై విపక్షాలు అసమ్మతి తెలిపాయి. ముస్లింలకు రాజ్యాంగపరంగా ఉన్న హక్కులపై దాడికే ఈ బిల్లును తెస్తున్నారని వక్ఫ్‌బోర్డుల వనరులపై జోక్యంచేసుకోవడమే ప్రభుత్వం అసలు ఉద్దేశ్యమనిప్రతిపక్షాలు విమర్శల దాడిచేస్తున్నా బిల్లును ఆమోదింపచేసుకునేందుకే ఎన్డీయేసర్కారు మొగ్గుచూపిస్తోంది.

## కేజ్రీవాల్ ఇంటిముందు చెత్తతో వెళ్లిన స్వాతిమలివాల్

### అదుపులోకి తీసుకున్న పోలీసులు

**న్యూఢిల్లీ, జనవరి 30:** రాజ్యసభ ఎంపి స్వాతి మలివాల్ వినూత్న నిరసన తెలిపారు. ఢిల్లీ మాజీ సీఎం ఆప్ అధినేత అరవింద్‌కేజ్రీవాల్ నివాసం వద్ద చెత్తపోసారు. ఢిల్లీ అంతా చెత్తమయంగా మారిందని ఆప్‌ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అరవింద్‌కేజ్రీవాల్, ఆప్‌ప్రభుత్వంపై స్వాతి మలివాల్‌మండిపడ్డారు. ఈ నిరసన ఏ పార్టీకి వ్యతిరేకంగా కాదు. ఇంతకుముందు ఎప్పుడూ లేని విధంగా నేడు దారుణమైన స్థితిలో ఢిల్లీ ఉంది. ఢిల్లీలోని ప్రతిమూల మురికిగా ఉంది. రోడ్లు నాశనమయ్యాయి. మురుగుకాలువలు పొంగి పొర్లుతున్నాయి. నగరం మొత్తం చెత్తకుండీగా మారింది.

# ఇంటర్ విద్యార్థుల సెల్‌ఫోన్లకే హాల్‌టికెట్ల లింక్

### ప్రాక్టికల్ పరీక్షలతోపాటు.. థియరీకి హాల్‌టికెట్లు

### పైలట్‌గా ఎథిక్స్, ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షల హాల్‌టికెట్లు జారీ

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుంది. ఇకపై ఇంటర్ విద్యార్థులు హాల్‌టికెట్ల కోసం కాలేజీ యాజమాన్యాలను బ్రతిమాలుకోవల్సిన అవసరం లేకుండా.. విద్యార్థుల హాల్ టికెట్ల లింక్‌ను విద్యార్థులు సమర్పించిన ఫోన్ నంబర్లకే నేరుగా లింక్‌ను పంపించనుంది ఇంటర్ బోర్డు. ఇందుకు సంబంధించి ప్రయోగాత్మకంగా గురువారం జరిగిన ఎథిక్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ పరీక్ష హాల్ టికెట్ల లింక్‌ను పంపించింది. దాంతోపాటు నేడు(శుక్రవారం), రేపు(శనివారం) జరగనున్న ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షల హాల్ టికెట్లను విద్యార్థులు సమర్పించిన ఫోన్ నంబర్లకు పంపించినట్టు ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు తెలిపారు. ఇదే విధంగా ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు జరగనున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల హాల్ టికెట్లతోపాటు.. మార్చి 5 నుంచి 25 వరకు జరగనున్న వార్షిక పరీక్షల హాల్ టికెట్లను కూడా జారీ చేయనున్నట్టు తెలిపారు. గతంలో కేవలం కాలేజీలకే హాల్ టికెట్లను బోర్డు పంపించేది. ఆ తర్వాత వెబ్‌సైట్‌లో పెట్టి డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఇప్పుడైతే ఏకంగా విద్యార్థులు ఇచ్చిన ఫోన్ నంబర్‌కే నేరుగా హాల్ టికెట్ లింక్‌ను ఇంటర్ బోర్డు పంపించనుంది. ఆ లింక్‌లో డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. ఇంటర్ సెకండియర్ సైన్స్ విద్యార్థులతోపాటు, ఒకేషనల్ విద్యార్థులకు ఫిబ్రవరి 3 నుంచి ప్రాక్టికల్స్ ఉన్నాయి. వారి కూడా త్వరలోనే పంపిస్తామని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది సుమారు 9.50 లక్షల మంది విద్యార్థులు మార్చి 5 నుంచి ప్రారంభమయ్యే వార్షిక పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంది.

# తెలుగు రాష్ట్రాల్లో మోగనున్న పెళ్లిబాజాలు

### 2025లో పెళ్లి ముహూర్తాల జోరు ఆరంభం

### నేటి నుంచి మార్చి 6 వరకు శుభముహూర్తాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 30:** తెలుగు రాష్ట్రాల్లో పెళ్లి బాజాలు మోగనున్నాయి. మొత్తంగా కల్యాణ ఘడియలొచ్చాయ్....పుష్యమాసం ముగిసింది. మాఘ మాసం ఆరంభమవ్వడంతో శుక్రవారం నుంచి కల్యాణ ఘడియలు సమీపిస్తున్నాయి. శుభ ముహూర్తాలకు తెరతొలగి, పెళ్లిళ్ల బాజాల, భజంత్రీలతో సహా బరాత్‌ల మోత మోగనుంది. మాఘ, ఫాల్గుణ మాసాలలో 25 శుభ ముహూర్తాలున్నట్లుగా యాదగిరి క్షేత్రంలోని ఆలయ పంచాంగకర్తలు, పూజారులు, బ్రాహ్మణులు చెబుతున్నారు. దీంతో వివాహాలను కుదుర్చుకునే పర్వాలలో పెళ్లి చూపులు, మాటా ముచ్చట్లు వేగవంతమయ్యాయి. ఈ నెల 31 నుంచి శుభ పర్వాలు మొదలై, మార్చి 6వ తేదీ వరకు పెళ్లి తతంగాలు జరుపుకోవచ్చు. మాఘ మాసంలో జనవరి 31వ తేదీన ఉదయం, రాత్రి రెండు ముహూర్తాలు, ఫిబ్రవరి 2నాటి ఉదయం, రాత్రి 7వ తేదీన ఉదయం, రాత్రి, 13 తేదీన ఉదయం, 14వ తేదీ రాత్రి, 16, 20 తేదీల్లో మూడు వేళల్లో, 22, 23న కూడా రెండేసి ముహూర్తాలున్నాయి. ఫాల్గుణ మాసంలో వచ్చే మార్చి నెల 2న ఉదయం రెండు,రాత్రి రెండు ముహూర్తాలు, 6వ తేదీన 3 వేళల్లో కల్యాణ ఘడియలు ఉన్నట్లుగా పంచాంగకర్తలు తెలిపారు. ముహూర్తాలు సమీపించడంతో పెళ్లి పెద్దలు ఒకవైపు కుటుంబ సభ్యులు మరోవైపు ఏర్పాట్లపై వ్యూహ రచనకు రంగంలోకి దిగారు. కొనుగోలు, విందు, ఫొటో షూట్, రాకపోకల కోసం ఇరు కుటుంబాల చర్చలు సాగుతున్నాయి. కల్యాణ మండపాలు హంగామాలతో రూపు దిద్దుకుంటున్నాయి.

# ప్రశాంతంగా ముగిసిన జెఇఇ మెయిన్ ఫేజ్-1 పరీక్షలు

### 598 పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ


**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** దేశంలోని ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీల్లో బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ)-2025 మెయిన్ ఫేజ్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. దేశంతోపాటు ఇతర దేశాల్లో కలిపి 598 పరీక్షా కేంద్రాల్లో 284 నగరాల్లో పరీక్షను నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 13,78,232 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 13,00,273 మంది పరీక్షలకు హాజరైనట్టు ఎన్‌టీఏ ప్రకటించింది. పరీక్షలకు మొత్తంగా 94.4 శాతం మంది హాజరయ్యారు.

ఈ నెల 22, 23, 24, 28, 29 తేదీల్లో ఎన్ఐటీల్లో బీటెక్ సీట్ల భర్తీ కోసం పేపర్-1 పరీక్షను నిర్వహించగా.. ఈ నెల 30న బీఆర్క్, బీ ప్లానింగ్ సీట్ల కోసం పేపర్-2 పరీక్షను నిర్వహించారు.

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 1.40 లక్షల మందికిపైగా హాజరైనట్టు తెలుస్తోంది. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించగా.. ఉదయం సెషన్‌ను 9 గంటల నుంచి 12 గంటల వరకు.. మధ్యాహ్నం సెషన్‌ను 3 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించారు. ఏప్రిల్‌లో జేఈఈ మెయిన్ ఫేజ్-2 పరీక్షలు జరగనున్నాయి.

# బాపూజీ నివాళి సభలో చప్పట్లు కొట్టిన బీహార్ సిఎం!

**పాట్నా, జనవరి 30:** మహాత్మాగాంధీ వర్ధంతిసభలో పూజ్యబాపూజీకి నివాళులర్పించిన అనంతరం బీహార్‌ముఖ్యమంత్రి నితీష్ కుమార్ చప్పట్లు కొట్టడం అందరినీ ఆశ్చర్యపరిచింది. గురువారం ఆయన నివాళులు అర్పించిన వెంటనే చపట్లు చరిచారు. అంతలోనే తన తప్పును తెలుసుకుని చప్పట్లను నిలిపివేసారు. పాట్నాలోని గాంధీ మైదాన్‌లో బాపూజీకి ఘననివాళులర్పించే కార్యక్రమం ఏర్పాటుచేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీహార్ సీఎం నితీష్‌కుమార్ బాపూజీకి నివాళులర్పించి అందరిలోను ఒక్కసారిగా చప్పట్లు కొట్టడంతో పక్కనున్నవారు విస్తుపోయారు. అసలు సందర్భం ఏమిటి? నితీష్ చప్పట్లు కొట్టడం ఏమిటి అన్న అంశాన్ని అందరూ చర్చించుకుంటున్నారు. అసెంబ్లీ స్పీకర్ నంద్‌కిశోర్‌యాదవ్ ఆయన పక్కనే నిలుచుని ఉండటంతో చప్పట్లు ఆపేయాలని సంకేతాలివ్వడంతో నితీష్ తన తప్పు తెలుసుకుని చప్పట్లు నిలిపివేసారు. నితీష్‌కుమార్ ఇలా తప్పులుచేసి హెడ్‌లైన్లలోకి రావడం కొత్తేమీ కాదు. ఎన్డీయే కూటమికోసం 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేస్తూ ఎన్డీయేకు లోక్‌సభలో 4000 సీట్లకు పైగా వసానతయని ప్రకటించారు. లోక్‌సభ సీట్ల కంటే ఎన్నోరెట్లు సంఖ్యను చెపుతూ ఆయన ప్రకటన చేయడాన్ని అంరూ నోరెళ్ల బెట్టారు. ఆయన విడియోలను అప్పట్లో ఆర్జేడి నాయకులు రాష్ట్రమంతటా వైరల్‌చేసారు.



**ఢిల్లీలోనూ మహాత్మాకు ఘననివాళులు**

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలనాయకులు,అధికార పార్టీలనేతలు ఘననివాళులర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మ, ప్రధానిమోడీతోపాటు విపక్ష నాయకులు రాహుల్‌గాంధీ, ఖర్గే, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌లు మహాత్మాకు నివాళి అర్పించినవారలో ఉన్నారు. ప్రధానిమోడీ ఈసందర్భంగా బాపూజీ అభివృద్ధిచెందిన భారతావనికి స్ఫూర్తిప్రదాతగా నిలిచారన్నారు. అహింసావాదం, సత్యమేవ జయత్ నినాదాన్ని ప్రపంచ వ్యాప్తంచేసారన్నారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్; ఇతర మంత్రులు మనోహర్‌లాల్‌ఖట్టర్, ఇతర మిలిటరీ ప్రతినిదులు కూడా బాపూజీకి నివాళులర్పించారు. మహాత్మాగాంధీ ప్రతి ఒక్కరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా వెల్లడించారు.

# ఉన్నత విద్యా సంస్థల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు

### వయోపరిమితిలో ఐదేళ్ల మినహాయింపు

### విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాల్లో దివ్యాంగులకు 5 శాతం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ఇంజనీరింగ్, పీజీ, మెడికల్ ఇతర ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నట్టు విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేవారు. ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత విద్యాసంస్థల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ.. ఆయా విద్యా సంస్థల్లో దివ్యాంగుల ప్రవేశాలకు గరిష్ట వయోపరిమితిలోనూ 5 ఏళ్ల మినహాయింపు కల్పించింది. దివ్యాంగుల హక్కుల చట్టంలోని నిబంధనల మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా జీవో ఎంఎస్ నంబర్ 2ను జారీ చేశారు. దివ్యాంగులను మొత్తం ఐదు కేటగిరీలుగా విభజించి ఒక్కో కేటగిరీ వైకల్యానికి ఒక్కో శాతం రిజర్వేషన్ అమలు చేయనున్నారు. దృష్టి లోపం ఏ కేటగిరిగా, వినికిడి లోపం, మూగ బీ కేటగిరిగా, అంగవైకల్యం సీ కేటగిరిగా, మానసిక వైకల్యం డీ కేటగిరిగా, ఒకటికి మించిన వైకల్యాలుంటే ఈ కేటగిరీలుగా విభజించారు. ఇందుకు సంబంధించిన రిజర్వేషన్ల అమలును రొటేషన్ పద్ధతిలో కొనసాగించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఒక కేటగిరిలో అర్హులైన అభ్యర్థులు లేకుంటే ఆ రిజర్వేషన్‌ను తదుపరి కేటగిరి అభ్యర్థులకు వర్తింపజేయాలని ఉత్తర్వులో స్పష్టం చేశారు. ప్రవేశాల్లో అసలు దివ్యాంగులైన అభ్యర్థులే లేకుంటే ఆ ఖాళీలను ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, మహిళా వర్గాల్లోని సాధారణ అభ్యర్థులతో మెరిట్ ప్రకారం ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

## గోదావరి బోర్డు చైర్మన్‌గా ఎకె ప్రధాన్

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** గోదావరి నదీ యాజమాన్య బోర్డు చైర్మన్‌గా ఎకె ప్రధాన్‌ను నియమిస్తూ కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిఆర్ఎంబి చైర్మన్‌గా ప్రస్తుతం పనిచేస్తున్న ముఖేష్ కుమార్‌సిన్హాను కేంద్ర జలసంఘం చైర్మన్‌గా పదోన్నతిపై నియ మించారు. దీనితో కేంద్ర జల సంఘంలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఎకె ప్రధాన్‌ను జిఆర్ఎంబి చైర్మన్‌గా నియమించారు. కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. గోదావరి నది నీళ్ళను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్లకు తరలించుకుపోతున్న ప్రస్తుత పరిస్థితులలో ప్రధాన్ ఇరు రాష్ట్రాల అభిష్టానికి అనుగుణంగా నడుచుకోవడం కత్తిమీద సామిలాంటిదే.

## గాంధీజీ వర్ధంతి సందర్భంగా కెసిఆర్ ఘన నివాళి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 30:** పరాయిపాలన నుండి భారత దేశానికి స్వాతంత్రం సాధించడం కోసం గాంధీజీ అనుసరించిన శాంతియుత పోరాట పంథా, ప్రపంచ ప్రజాస్వామిక ఉద్యమాలకు స్వయంపాలనకు మార్గదర్శకంగా నిలిచిందని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వారు దేశానికందించిన సేవలను,చేసిన త్యాగాలను కేసీఆర్ స్మరించుకున్నారు. పీడిత వర్గాలు శాంతియుత మార్గంలో ఐక్యతను సాధించి పోరాడినపుడే తమ గమ్యాన్ని చేరుకోగలరనే సందేశాన్ని గాంధీజీ ప్రజాస్వామిక ఉద్యమ కార్యాచరణ మనకందిస్తుందని అన్నారు. అసాధ్యమ నుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో గాంధీజీ స్ఫూర్తి ఇమిడివున్నదని కేసీఆర్ తెలిపారు. సబ్బండ వర్గాలు, సకలజనులు అభివృద్ధి చెంది, గ్రామ స్వరాజ్యం ఫరిడవిల్లేలా పదేండ్ల బిఆర్ఎస్ పాలన సాధించిన ప్రగతి వెనుక గాంధీ మహాత్ముని ఆశయాలను ఆదర్శాలున్నాయన్నారు. సహనంతో కూడిన దార్శనికతను ప్రదర్శించడం ద్వారానే సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మరింత ప్రగతి సాధ్యమవుతుందని కేసీఆర్ తెలిపారు. తద్వారా మాత్రమే మనం గాంధీజీకి ఘన నివాళి అర్పించిన వారవౌతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

## కెసిఆర్‌ను జనంలోకి తీసుకొని రండి

### మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి

**హైదరాబాద్,జనవరి 30,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ముఖ్యమంత్రి కెసిఆర్ వలే తాను ఎక్కడ ఉంటే అక్కడే సచివాలయం అన్నట్లు వ్యవహరించడలేదని సచివాలయంలో కేబినెట్,పాలన నిర్ణ యాలు తీసుకొని ఇంటి నుంచి సమీక్షలు చేస్తున్నారని మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోన్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిపై హరీశ్‌రావు విమర్శలు చేస్తే సూర్యునిపై ఉమ్మేసినట్లే అని అన్నారు. గతంలో ఉన్న ఐ ఏ ఎస్ అధికారుల నివాస సముదాయాలను కూల్చి కెసిఆర్ ప్యాలెస్ కట్టుకున్నాడని విమర్శించారు. ప్యాలెస్ సీఎం ఎవరు అంటే ప్రజలు కెసిఆర్ అని చెబుతారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ను ప్యాలెస్ లాంటి తన ఫాం హౌస్ నుంచి ప్రజల్లోకి తీసుకు వచ్చే బాధ్యత హరీష్ రావు తీసుకోవాలని కోరారు.

## ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడి ముసుగులో గంజాయి స్మగ్లింగ్

### కన్నెర్ర చేసిన జర్నలిస్టు సంఘాలు

### ప్రెస్‌క్లబ్ నుంచి బహిష్కరించిన సభ్యులు

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త :** ఇరువురు ప్రబుద్ధులు జర్నలిజాన్ని అడ్డం పెట్టుకుని అక్రమాలకు తెరలేపారు. ఇరువురిలో ఒక సభ్యుడు పేరుపొందిన ప్రెస్‌క్లబ్‌కు అధ్యక్షుడిగా సైతం ఎదిగాడు. కానీ అతని వంకర బుద్ధి మారకపోవడంతో మొత్తం పాత్రికేయ లోకమే సిగ్గు పడేలా చేశారు. వివరాలలోకి వెళితే ... బూర్గంపహాడ్ మండలంలో ప్రముఖ పెస్‌క్లబ్‌కు అధ్యక్షుడి హోదాలో ఉన్న ఒక వ్యక్తి గురువారం ఉదయం




కారులో గంజాయి తరలిస్తూ హైద్రాబాద్‌లోని నార్కోటిక్స్ శాఖ అధికారులకు భద్రాచలం పట్టణంలోని గోదావరి బ్రిడ్జి వద్ద గల అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డ సంఘటన మండలంలో కలకలం రేపింది. ఈ మేరకు ఆ శాఖ అధికారుల తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. గురువారం ఉదయం భద్రాచలంలోని అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహించగా ఏపీ 37బీయూ 5216 అనే నెంబర్ గల హుండాయ్ గ్రాండ్ ఐటెం ఆస్తా కారు అనుమానాస్పదంగా కనిపించగా, తనిఖీ చేశారు. అందులో గంజాయి ఉండటాన్ని గమనించి వాహనాన్ని, అందులోని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి 81.950 కేజీల ఉందని నిర్ధారించారు. కారులో ఉన్న వ్యక్తులను విచారించగా ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాకు చెందిన మడవి నంద, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని బూర్గంపహాడ్ మండలం సోంపల్లి గ్రామానికి చెందిన పండగ వెంకటేశ్వర్లు (వృత్తి : తెలంగాణ కేసరి పత్రిక రిపోర్టర్), బూర్గంపహాడ్ మండలం సోంపల్లి గ్రామానికి చెందిన పండుగ రాములు (వృత్తి : సూర్య పత్రిక రిపోర్టర్)లుగా విచారణలో తేలిందని వెల్లడించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.20,25,000లు ఉంటుందని నిర్ధారించారు. పట్టుబడిన గంజాయిని, వ్యక్తులను తదుపరి విచారణ నిమిత్తం భద్రాచలం పట్టణ పోలీసు స్టేషన్‌లో అప్పగించడం జరిగిందని నార్కోటిక్స్ అధికారులు తెలియజేశారు.


# అధిష్ఠానం దృష్టికి పటాన్‌చెరు పరిణామాలు

### వినోద్‌రెడ్డి నివాసంలో పిసిసి కమిటీతో మహిపాల్‌రెడ్డి భేటీ

### సమన్వయం, క్రమశిక్షణతో మెలగాలంటూ హితవు

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి గురువారం హిమాయత్‌నగర్‌లోని వినోద్‌రెడ్డి గృహంలో పిసిసి కమిటీతో సమావేశమయ్యారు. ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, వినోద్‌రెడ్డి పటాన్‌చెరులో జరుగుతున్న పరిణామాలపై ఆయనను ప్రశ్నించి వివరాలు స్వీకరించారు. పార్టీ జెండాను పట్టుకొన్న కార్యకర్తలను కొత్తగా వచ్చిన మీరు కలుపుకొని పోవాలని, పెద్దమనసు చేసుకోవాలని విప్ ఆది శ్రీనివాస్ హితవు చెప్పారు. పటాన్‌చెరులో గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలు హైకమాండ్ దృష్టికి కూడా వెళ్లాయని క్రమశిక్షణతో ప్రతి ఒక్కరు వ్యవహరించాలని సూచించినట్లు తెలిసింది. మహిపాల్‌రెడ్డి కూడా తన క్యాంపు ఆఫీసు ముట్టడి, తన దిష్టి బొమ్మలు దగ్ధం చేయడం ధర్నాలతో మరోవర్గం చేస్తున్న అలజడిని వారి దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, వినోద్‌రెడ్డి నివేదిక తయారు చేయడానికి మహిపాల్‌రెడ్డితో మాట్లాడాల్సి ఉండగా ఆయన గాంధీభవన్‌కు గత కొద్దిరోజుల క్రితం రాలేదు. ఇప్పుడు వినోద్ ఇంటికి వచ్చారు. అమిన్‌పూర్ కార్యాలయంలో ఆదిశ్రీనివాసతక్ష జరిగిన సమావేశంలో పాత కాంగ్రెస్ నేతలు వారి బాధలు చెప్పుకొన్నారు.బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తన అనుచరుతో కాంగ్రెస్ నాయకులపై దాడులు చేస్తున్నారని కాట శ్రీనివాస్ గౌడ్ వర్గం నేతలు ఆరోపణలు చేస్తున్నారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని బొల్లారంలో పాత కాంగ్రెస్ నాయకులను సైతం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి దుర్భాషలాడటంతో ఈ వివాదం మొదలైంది. పార్టీలోని పాత - కొత్త నేతల మధ్య పంచాయితీ సర్దుబాటు చేయాలని హస్తం పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగారు. నీలం మధు ముదిరాజ్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికను మొదటి నుంచి పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ వ్యతిరేకిస్తున్నారు. అయితే, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కాట శ్రీనివాస్ గౌడ్ బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన గూడెం మహిపాల్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఇక, 2023లో బీఆర్ఎస్, కాంగ్రెస్ తరపున టికెట్ ఆశించి భంగపడిన నీలం మధు బీఎస్పీ నుంచి పోటీ చేసి థర్డ్ ప్లేస్ లో నిలిచాడు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ లో చేరి మెదక్ ఎంపీగా పోటీ చేసిన ఓడిపోయారు.

ఈ నియో జకవర్గంలోని ఆ ముగ్గురు నేతల మధ్య రాజకీయ ఆధి పత్య పోరు తరుచు రచ్చకెక్కుతుండటంతో కాంగ్రెస్ అధి ష్ఠానం తల పట్టుకుంటుంది. పటాన్ చెరు నియో జకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో వివాదం కొనసాగుతుంది. పార్టీలోని పాత, కొత్త కాంగ్రెస్ వర్గాల మధ్య ఆధిపత్య పోరు ఒక్కసారిగా రోడ్డున పడింది. స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి వ్యతిరేకంగా పాత కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు పిలుపునిచ్చింది. సేవ్ కాంగ్రెస్ - సేవ్ పటాన్ చెరు స్లోగన్స్ తో కార్యకర్తలు, నాయకులు పటాన్ చెరులోని అంబేద్కర్ చౌరస్తా దగ్గర నిరసనకు దిగారు. దీంతో పోలీసులు అక్కడ భారీగా మోహరించారు.



గురువారం హిమాయత్‌నగర్‌లోని వినోద్‌రెడ్డి నివాసంలోలో పిసిసి కమిటీతో సమావేశమైన పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

వార్త

మానవుడు తన అదృష్టం వక్రించినప్పుడు మానవాతీత శక్తి ఏదో ఉందని అనుకుంటాడు. అదృష్టం బాగా ఉన్నప్పుడు అదంతా తన గొప్పతనమే అనుకుంటాడు.

-జార్జ్ శాంతాయన

# డాలర్ కలలు కల్లలు!

అలనాడు శ్వేత సౌధాధినేత ట్రంప్ పాలనను హర్షించని వారు సైతం ఈసారి ఆయనేకావాలని అమెరికన్లు అనుకున్నారు. భారత్ తదితర దేశాల వారూ కోరుకున్నారు. కానీ ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఈ పది రోజుల్లో తీసుకున్న నిర్ణయాలు బాగా చర్చనీయాంశమయ్యాయి. ఏరోజు కారోజు ఆయన తీసుకున్న నిర్ణయాలపై ఎడతెగని చర్చ కొనసాగుతోంది. అమెరికన్ల తొలిప్రాధాన్యత అనే లక్ష్యంతో ముందుకు సాగడం మంచిదే కానీ ఇతరత్రా కొన్ని దేశాలను, ఎంతో ఆశతో బ్రతుకు తెరువుకోసం మంచి భవిష్యత్తును ఆశించి అమెరికాకు వచ్చిన వారి ఆశలపై నీళ్లు జల్లారు. కొంతమందిలో హర్షాతిరేకాలు మరి కొంత మందికి ఆందోళన ఈసారి ప్రధానంగా ఆయన అమెరికన్లే ఫస్ట్ తొలి ప్రధానిగా అమెరికా నుండి వారిసంక్షేమం, ఉపాధి సంరక్షణ అనేదారుల్లో ముందుకు సాగుతున్నారు. ట్రంప్ అంటే ఆచితూచి అడుగులు వేసేరకం కాదు. లేడికి లేచిందే పరుగు అన్నట్లుంటుంది ఆయన వ్యవహారశైలి. తమ దేశానికి నష్టంకలిగించే విధానాలపై తక్షణ నిర్ణయాలు తీసుకోవడంలో ఇప్పుడాయన ఘనాపాటి. విదేశీ వస్తువులపై అదనపు సుంకాలు విధిస్తే దేశఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు వారిస్తున్నా ఆయన ఆగడం లేదు. వివిధ దేశాల ఉత్పత్తులను అమెరికన్లు వినియోగిస్తుంటారు. వాటిపై ఇప్పుడు అధికసుంకాలు విధించేందుకు అమెరికా సిద్ధమైంది. నిన్న గాక మొన్న వలసలపై తన విశ్వరూపం చూపించారు. తన అంతరంగాన్ని బయటపెట్టారు. అమెరికాలో పౌరసత్వం లేకుండా నివసిస్తున్న వారిపై చెక్ పెట్టారు. వారిని తిప్పి వారి వారి దేశాలకు పంపించేయాలన్నది ఆయన ఆలోచన. అదే చెప్పారు కూడా. వారివల్లనే అమెరికన్లకు పనులు తగ్గాయన్నది ఆయన అభియోగం. 'జన్మతః పౌరసత్వం' ఆలోచన పర్యవసానం ఎలాఉంటుందో అంచనా వేసిన ఐఎంఎఫ్ వంటిసంస్థలు హెచ్చరిస్తూనే ఉన్నాయి. తాత్కాలికంగా అమెరికన్లు ఉపాధి అవకాశాలు పెంచుకోగలిగినా ఈ నిర్ణయం అమెరికా ఆర్థికవ్యవస్థకు ఏమాత్రం నష్టం కలిగినా ఊహించని ఉపద్రవాలు ఎదురౌతాయి. ఆదిలో ట్రంప్ నిర్ణయాలు రుచించడం లేదని ససేమిరా అన్న కొలంబియా ఇప్పుడు ట్రంప్ దారిలోకివచ్చింది. కొలంబియా ఉత్పత్తులపై టారిఫ్ విధిస్తామని హెచ్చరించడంతో అమెరికాలో ఉన్న కొలంబియా వాసుల్ని తిరిగి తమ దేశానికి రప్పించేసుకుంటామని భరోసా ఇచ్చింది. ఎవరెవరికి వలసదారుల అనుమతులున్నా శాశ్వత పౌరులు కాని వారిపై వేటుపడే విషయం సుస్పష్టం. మరోటి పారిస్ ఒప్పందంనుంచి అమెరికా వైదొలగడం. ఇవన్నీ ఇలావుంటే అమెరికన్లపై ఆదాయం పన్ను భారం లేకుండా చేయాలని మరో వ్యక్తీకరణ. ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేస్తే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆయన అభిప్రాయం. అమెరికన్లు అంతర్జాతీయంగా శక్తివంతులుగా, సంపన్నులుగా చూడాలన్నదే తన ఆకాంక్షగా అభివర్ణించారు. నిజంగా పాలకుడికి ఉండాల్సిన లక్షణమే. అమెరికా వాణిజ్య వ్యవస్థను మార్చేందుకు సైతం ఆయన కంకణం కట్టుకున్నారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయులపై ఎలాంటి విధానాన్నిఅనుసరిస్తారో ఇతమిత్థంగా తెలలేదు. కానీ భారతీయులు ఆందోళన పడుతున్నారు. ప్రసవ వేద నలుపడుతున్న వారిలోసైతం కంగారు మొదలైంది. ట్రంప్‌రాకతో భారతీయుల డాలర్ డ్రీమ్స్‌కు ఆటంకం ఏర్పడిందన్నది విదితమే. మెక్సికో, బ్రెజిల్, కొలంబియా దేశాల విద్యార్థులైతే తిరిగి తమదేశాలకు ప్రయాణం కట్టారు. ఇప్పటికే డిపోర్టేషన్ నిర్భయం వెలువడగానే అమెరికన్ పోలీసులు అక్రమ వలసదారులు జల్లెడపట్టే పనిలో ఉ న్నారు. న్యూయార్క్, న్యూజెర్సీలలో గురుద్వారాలు, సోదా మొదలైంది. ఎఫ్1బి పత్రాలతో అనేక లక్షల మంది అక్కడే కాలక్షేపం చేస్తున్నారు. వారిలో భారతీయ విద్యార్థులూ అధికులే. భారత దేశ ఉత్పత్తులను కూడా అధిక సుంకం జాబితాలో చేర్చినందున, భారతీయ విద్యార్థుల స్థితిగతులపై ట్రంప్ ప్రభుత్వానికి పెద్దగాసానుకూల వైఖరి ఉన్నట్లు లేదు. అయితే భారత ప్రధాని నరేంద్ర మోడీ, ట్రంప్‌ల మధ్య ఏదైనా సయోధ్య నిర్ణయాలు జరిగితే తాము గట్టెక్కినట్లేనని భారతీయులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రోజుకో కొత్తఉత్తర్వుతో వలసదారుల వెన్నులో చలిపుట్టిస్తున్న ట్రంప్ అమెరికాపౌరుల ఆదాయ పన్ను రద్దుచేసారు సరే. ఆలోటు భర్తీచేయడానికి తమపై భిన్న ఆలోచనలున్న దేశాలకు బాగా వడ్డించి ఆదాయం పొందాలని రంగంలోకి దిగాడు. ఎక్స్‌టర్నల్ రెవెన్యూ సర్వీస్ ప్రారంభించానని ట్రంప్ ప్రకటించడం గమనార్హం. 1913వరకూ అమెరికాలో సుంకాల ఆధారిత ఆర్థికవ్యవస్థ ఉండేదన్నారు. ఇండియా నుంచి అమెరికావెళ్లే ఉత్పత్తులపై భారీగా సుంకాలు పెంచడంవల్ల అమెరికా మార్కెట్‌ను లక్ష్యంగా వ్యాపారం చేసే భారతీయులు వ్యాపారం దెబ్బ తినడం ఖాయం. విదేశీయులపై కూడా సుంకం పెంచడ మంటే అమెరికాలోని ఎన్నారైలు కూడా రిస్కులో పడుతు న్నట్లే. అదే జరిగితే అమెరికా వచ్చేఎన్నారైల సంపాదన ఇక్కడపన్నులతో సరిపోతుంది. ఇలా చేస్తే విదేశీయులు రాక తగ్గి స్థానికులకు ఉద్యోగాలు లభిస్తాయని ట్రంప్ ఎత్తుగడ. కొత్త విధానాల అమలులో కూడా అమెరికా దుందుడుకు వైఖరి అవలంబిస్తే ప్రపంచ దేశాలతో వివాదాలను కొనితెచ్చుకున్నట్లే! ఇదిలా ఉండగా చైనా ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌లో అమెరికా చాట్ జీపీటీని తలదన్నే సరికొత్త టూల్‌ను అభి వృద్ధి చేసింది. దాంతో అమెరికా 600 బిలియన్ డాలర్ల మార్కెట్ కోల్పోయి చైనాపై గుర్రుగా ఉంది. ఏదిఏమైనా ట్రంప్ తొందరపాటు నిర్ణయాలు అమెరికాకు మేలు చేస్తాయా లేదా అనేది భవిష్యత్తులో తెలుతుంది.



మనల్ని గాయపరిచినవారితో మనల్ని పోల్చుకోకపోవడమే సరైన ప్రతీకారం.

జేన్ పోర్టర్



మనిషి తన ధనాన్ని బుర్రగా మార్చుకుంటే దాన్నెవరూ తస్కరించలేరు. జ్ఞానంపై పెట్టిన పెట్టుబడి ఎల్లప్పుడూ మంచి వడ్డీనే ఇస్తుంది.

పాస్కల్

# ప్రజావాక్కు



## సుంకాలు విధించాలి

మైనింగ్, ఖనిజ కార్యకలాపాలపై రాయల్టీ విధించేహక్కు రాష్ట్రాలకున్నదని సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం వెలువరించింది. తీర్పుతో పదమూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ అతి పురాతనమైన కేసు పరిష్కృతం కావడం మరో రికార్డు. రాయల్టీ అనేది పన్ను వంటిది కాదని, రాయల్టీని విధించే అధికారం రాష్ట్రాలకు ఉన్నదని ధర్మాసనం స్పష్టం చేయడం ఫెడరలిజానికి బలం చేకూర్చే అంశం. ఖనిజాలను కలిగి ఉన్న భూమిపై రాయల్టీని వసూలు చేసే రాష్ట్ర ప్రభుత్వ హక్కును ఈ తీర్పులో భాగంగా సుప్రీంకోర్టు సమర్థించింది. అక్కడి ప్రభుత్వాలు ఇప్పుడు తమ భూభాగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న మైనింగ్ కంపెనీలపై అదనపు సుంకాలు వసూలు చేసేందుకు దీని ద్వారా అవకాశం ఏర్పడుతుంది.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలి

కేంద్రప్రభుత్వ ఆరోగ్య పథకం మన రాష్ట్రంలో ఉన్న ఆరోగ్య కేంద్రాలు, ఉత్తరాంధ్ర ఐదు జిల్లాలకు ప్రస్తుతం రెండు మాత్రమేఉన్నవి. యేటా రిటైర్ అయ్యే ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు విపరీతంగా ఉన్నారు. దీనిలో సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులు కూడా భాగమే. సెంటర్లు అద్దె భవనాల్లో కనీస సదుపాయాలు, సామాగ్రితో లేక పేషంట్స్ ఇక్కట్లకు గురవుతున్నారు. కేంద్ర ఆరోగ్యశాఖకు పంపిన నివేదికలు రాష్ట్ర సహాయ కార్యదర్శి వారి కృషి, సంఘం ప్రతినిధుల జోక్యంతో మంజూరు అత్యవసరం. వైద్యుల నియామకాలను చేపట్టాలి.

-బి. మేఘనాథం, విశాఖపట్నం

## బాధ్యత తల్లిదండ్రులదే

మనుషులకు భయం భక్తి ఉండాలి. లేకుంటే కఠిన చట్టాలకుకూడా భయపడకుండా ప్రవర్తిస్తుంటారు. మహిళలపై పాశవికంగా జరుగుతున్న అత్యాచారాలు, హత్యలపై ప్రజలు రోడ్డెక్కి నిరసనలు, నినాదాలు చేస్తుంటే, ఏదో ఒక చోట ఇలాంటివి పునరావృతంకావడం చాలా బాధాకరం. సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లయిన మనదేశంలో ఇక నుంచి అయినా తగ్గుముఖం పట్టాలి. కన్నబిడ్డల్ని మాత్రం మంచిగా పెంచి సొసైటీలో ఉత్తమ పౌరుడిగా అందించవలసిన బాధ్యత అమ్మానానలది.

- ఎన్.కృష్ణమోహన్, కర్నూలు జిల్లా

## నెట్‌వర్క్‌ను విస్తరించాలి

రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియాతో సహా భారతదేశంలోని ప్రైవేట్ టెలికాం కంపెనీలు గత నెలలో తమ ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ రీచార్జ్‌ల ప్లాన్‌ల ధరలను భారీగా పెంచాయి. టారిఫ్ ధరలు పెంచడంతో ఇప్పుడు చాలా మంది కస్టమర్లు బియస్ఎన్ఎల్‌వైపు మళ్లుతున్నారు. ఇతర టెలికాం కంపెనీలు ధరలు పెంచినా బిఎస్ఎన్ఎల్ మాత్రం ఎలాంటి రీ ఛార్జ్ ధరలను పెంచలేదు. ఇప్పటికే చాలా మంది కస్టమర్లు బియస్ఎన్ఎల్‌వైపు వెళ్లిపోయారు. కావున కేంద్రప్రభుత్వం బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరించి ఎక్కువ టవర్లను ఏర్పాటు చేస్తే ముఖ్యంగా తక్కువ ఆదాయం గల ప్రజలకు అలాగే శ్రామిక వర్గానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కావున ఆ దిశగా కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

-డి. వెంకటరెడ్డి, బెంగళూరు

## పటిష్ట భద్రత అవసరం

గృహ అవసరాల కోసం విద్యుత్ శక్తి సరఫరాలో హెచ్చుతగ్గులు నివారించుటకు ప్రతి వాడలలో వినియోగదారుల అవసరం, వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని తగు సామర్థ్యంగల కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేశారు, చేస్తున్నారుకూడా. దీని వలన వినియోగదారులకు నాణ్యమైన కరెంటు సరఫరా జరుగుతున్నదనడంలో సందేహంలేదు. కానీ ఈప్లింత్ ఏరియా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినస్థలంలో సరైన రక్షణ కవచాలు ఏర్పాటు చేయడం లేదు. నిర్వహణ లోపం వలన భూమిపై చిన్న చిన్న పిచ్చిమొక్కలు చెట్లు పెరుగుతున్నాయి. కొంత మంది వ్యక్తులు సామాజిక బాధ్యతను విస్మరించి అక్కడ చెత్తాచెదారం వేయడం జరుగుతున్నది. ఫలితంగా క్రిమి కీటకాలకు స్థావరంగా, దోమలు వ్యాప్తి చెందడానికి దోహదం చేస్తున్నది.

-దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

## పనులు వేగవంతం కావాలి!

అమరావతి రాజధాని రైలు మార్గానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఆపై సంబంధిత డిపిఆర్ సిద్ధంగా ఉందని రైల్వే అధికారులు ప్రకటించడం రాష్ట్ర రాజధాని నిర్మాణానికి మరో అడుగుపడినట్లే. అయితే పనులు వేగవంతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులురైల్వేశాఖతో పూర్తి సమన్వయంతో పనిచేయాలి. ఎక్కడా ఎటువంటి అవాంతరాలు రాకుండా అందరి సమిష్టికృషితోనే అభివృద్ధి ప్రాజెక్టులు సాకారమవుతాయి. ఇప్పటికే ఉన్నరైలు మార్గాలకు అనుసంధానం చేయాలి.

-ఎన్. అజయ్‌కుమార్, కృష్ణాజిల్లా

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భూ సమస్యల పరిష్కారం ఇంకెప్పుడు?

**ప్రస్తుతం డ్రోన్ల ద్వారా, రోవర్ల ద్వారా జరగడం వలన భూమి విస్తీర్ణం 5శాతం తగ్గడం రైతులలో అసహనానికిగురిచేస్తుంది. దానికి తోడుభూములు ఒక సెంటు లక్షల్లో ఉండడం వల్ల ఎకరానికి 10లక్షల వరకు నష్టంవాటిల్లే ప్రమాదం ఏర్పడింది. ఇన్ని సమస్యలు ఇంకా తీరనిపరిస్థితిలో ఉండగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీటన్నిటిని సవాలుగా తీసుకొని, పరిష్కరించే మార్గంలో మళ్లీ రీసర్వేని ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం పై తెలిపిన సమస్యలే కాకుండా క్షేత్రస్థాయిలో అనేక సమస్యలనుపరిష్క రిస్తుందా? అధికారులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా సరైనవిధివిధానాల ద్వారా, సమాలోచనలు చేసిన తర్వాత రీసర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగానిర్వహిస్తే చాలా సమస్యలు తగ్గుతాయని నిపుణుల అభిప్రాయం.**

తలారి మారుతీ

భూమ్మీద జనాభా పెరిగే కొద్దీ, నివాస స్థలాలకు, వ్యవసాయ సంబంధిత ఉత్పాదకతకు భూమి చాలా అవసరం. భూమి ఒక సహజ వనరు మాత్రమే కాదు. అది మానవ జీవితంపై అత్యంత సన్నిహిత సంబంధం కలిగి ఉంది. చారిత్రాత్మకంగా, భౌగోళికంగా, సాంఘికంగా, ఆర్థిక సామాజికంగా ఎంతో సమ్మిళితమైఉన్నది. భూమి ప్రాథమిక వనరుగా, నివాసానికి యోగ్యమైనదిగా, వ్యవసాయానికి మానవుడు ఇతర జంతుజాలం ఆహార ఉత్పత్తిదారుగా ఎంతో అగ్రస్థానంలోఉంది. అలాంటి భూమిని రక్షించడానికి సేద్యం చేస్తున్నటువంటి రైతుకు హక్కు కలిగించడానికి భూవివాదాల నుండి రక్షణసాంత్వన చేకూర్చడానికి అనేక ప్రభుత్వాలు రెవెన్యూ సంబంధించినటువంటి భూవివాదాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల మన్ననలను పొందాయి. అలాగే సీలింగ్ చట్టం వచ్చిన తర్వాత భూస్వాముల భూములను భూమిలేని దారిద్రరేఖకు దిగువనున్న పేదలకు, నిరుపేదలకు, వెనకబడిన తరగతులకు భూములు మంజూరు చేసినటువంటి ఘనత ప్రభుత్వాలకి ఉంది. అలాగే ప్రభుత్వ భూములను కూడా భూమిలేని నిరుపేదలకు డి పట్టాలు మంజూరు చేస్తూ ప్రజలను ఆర్థికంగా, సాంఘికంగా అభివృద్ధి చెందేలా వారి వ్యక్తిగత పరపతి పెంచేలా ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. అంతేకాకుండా దేవాలయ భూములకు రక్షణ కల్పిస్తూ అనేక చట్టాలుచేస్తూ వచ్చారు. ఇందులో భాగంగానే నాడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారి అధినాయకత్వంలో"జగనన్న శాశ్వత భూహక్కు చట్టం" (రి సర్వే కార్యక్రమం) కార్యక్రమొకటి ఆంధ్రప్రదేశ్లో రూపుదిద్దుకుంది. అయితే అది క్షేత్రస్థాయిలో ప్రజలకు కాస్త ఇబ్బందులకు గురిచేసి, భూమి విస్తీర్ణంలో తేడాలు, జాయింట్ ఎల్పీఎంలు, సబ్ డివిజన్ సరిగా జరగకపోవడం తదితర అంశాలద్వారా ప్రజల మన్నన పొందలేక పోయిందనేది క్షేత్రస్థాయి ప్రజల అభిప్రాయం. అయితే ఈ రీసర్వేలో వచ్చిన సమస్యలు, వాటి పరిష్కారానికి నాటి ప్రభుత్వం తీసుకున్న చర్యలు పూర్తిగా విఫలం కావడం. రైతుల దృష్టిలో ప్రభుత్వం వ్యవహారం, అలాగే సంబంధిత ప్రక్రియ విధానం రైతులకు అయోమయంగా తయారై, అనవసరమైన లంచాలు ఊబిలో చిక్కుకునేలా చేసాయన్నమాట వాస్తవం. మరి ఆ రీసర్వే సమస్యల మీద ప్రస్తుతకూటమి ప్రభుత్వం యోచన ఏ విధముగా ఉన్నది. మళ్లీ దాన్నిపునః ప్రారంభించడం, లేదా రీసర్వేలోనే అవకతవకలను సరదిద్దడం, రీ సర్వేలో ఉన్నటువంటి లోపాలను గమనించి వాటి పరిష్కార మార్గాలను ఏ విధంగా పరిష్కరించగలదో భవిష్యత్తులో చూడాల్సి ఉంది. ముఖ్యంగా మద్రాస్ ప్రావెన్స్‌లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం కూడా అనేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ప్రతి రైతుకు భూ సరిహద్దును చూపించి ఆ భూమికి ఒక నెంబర్ను కేటాయించడం జరిగింది. దానినే మనం ప్రస్తుతం వాడుక భాషలో "సర్వేనెంబర్" అంటున్నాం. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం డైక్లాట్ అనేటువంటి ఒక శాశ్వత రిజిస్టర్ను తయారుచేసి అందులో ప్రతి రైతుకు తాను సాగు చేస్తున్నటువంటి ప్రతి పొలానికి ఒక నెంబర్ కేటాయిస్తూ వచ్చారు. అయితే కొంతమంది రైతులు భూమిశిస్తూ సరిగ్గా కట్టలేదు అటువంటి సందర్భంలోబ్రిటిష్ వారు రెవెన్యూ రికార్డులలో వారు పేర్లకు బదులుగా హక్కుదారుగా ఖాళీ ప్రదేశాన్ని లేదా చుక్కలను సూచించేవారు. ఆ చుక్కలనే ప్రస్తుతం చుక్కల భూములుగా పరిగణిస్తూ ఉన్నాం. తర్వాతకాలంలో సదరు చుక్కల భూములకు శిస్తు కట్టిన వారికి పట్టా మంజూరు చేయడం కూడా జరిగినది. అలా పట్టా మంజూరు చేసిన వారి భూములకు రిజిస్ట్రేషన్ హక్కును కూడా కల్పించడం జరిగింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ చుక్కల భూముల మీద విస్తృత



స్థాయి చర్చలు జరిగిన తర్వాత జీవో నెంబర్: 575ను ప్రకటించడం జరిగింది. ఈ జీవో ప్రకారం 08.06.1954కు కన్నా ముందు ఎవరైతే చుక్కల భూములో పట్టాలు పొంది ఉంటారో, లేదా అసైన్మెంట్ చేయబడి ఉంటుందో వారికి కూడా రిజిస్ట్రేషన్ హక్కు కల్పించడం జరిగింది. తెదేపా ప్రభుత్వం బి.వీ.ల్బీ.వ్వి.195 ను మేరకు 2016వ సంవత్సరంలో నిషేధిత భూముల జాబితాను తయారు చేసింది. అసలు దీనిఉద్దేశం ఏమిటంటే ఇందులో ఐదు రకాలైనటువంటి ప్రభుత్వ భూములు నమోదయిఉంటాయి. ప్రభుత్వ భూములు అన్యక్రాంతం కాకుండా, రిజిస్ట్రేషన్ హక్కు కల్పించకుండా ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించడం దీనిసదుద్దేశం. అయితే జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత సదరు నిషేధిత జాబితాలో 2005 కన్నా ముందు డి పట్టా మంజూరు చేసిన భూములకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పిస్తూ జీవోలు కూడా విడుదల చేయడం జరిగింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాని మీద విస్తృతమైనటువంటి పరిశీలన చేసి, క్విడ్ ప్రోకో ఏమైనా జరిగిందా? అనే ఉద్దేశంతో దానిలో ఉన్నటువంటి అవకతవకలను గ్రహించి ప్రస్తుతం రెవెన్యూ రికార్డులలో ఫ్రీ హోల్డ్ రైట్స్ ఇచ్చిన డి పట్టా భూములు లావాదేవీలు జరగకుండా రిజిస్ట్రేషన్లు, మీసేవలో పట్టాదారు పాసుపుస్తకాలు కోసం దరఖాస్తు చేయడానికి సదుపాయం లేకుండా చేసింది. క్షేత్రస్థాయి పరిశీలన తరువాత ప్రభుత్వం మళ్లీ తదుపరిచర్యలు తీసుకునే యోచనలో ఉంది. అయితే నిషేధిత భూముల జాబితాలో కూడా అనేక పొరపాట్లు జరిగాయి. అందులో అత్యంత ముఖ్యమైనవి ఎవరికైనా సీలింగ్ భూములు అసైన్మెంట్ చేసినప్పుడు సబ్ డివిజన్ చేసి సర్వే నెంబర్ను రెండు భాగాలుగా విభజించిన తర్వాత వాటికి డిపట్టా మంజూరు చేస్తారు. అయితే నిషేధిత భూములు జాబితా తయారు చేసేటప్పుడు పూర్తి సర్వేనెంబర్ను జాబితాలో ఉంచడం వల్ల పట్టా భూమి కలిగినటువంటి వ్యక్తులు చాలా అవస్థలు పడుతున్నారు. తమ భూములు ఆస్తులుగా భావించినటువంటి రైతులు తమకు అవసరమైన సమయంలో తనకా పెట్టడానికి, అమ్మడానికి, దానవిక్రయం చేయడానికి ఇతరత్రా లావాదేవీలు రిజిస్ట్రేషన్ చేయడానికి కుదరడం లేదు. ఈ విషయమే క్షేత్రస్థాయిలో మండల తహసీల్దారులు మీసేవ ద్వారా నిషేధిత భూముల జాబితానుంచి సదరభూములను తొలగించడానికి కలెక్టర్ కార్యాలయాలకు సిఫారసు చేసినప్పటికీ, సంబంధిత దస్త్రాలు కలెక్టర్ వారికార్యాలయాల్లో మగ్గుతున్నాయి. అంతేకాకుండా కలెక్టర్ కార్యాలయంలో ఉన్నటువంటి అధికారులు సంబంధిత నిషేధిత భూములో సర్వే నంబర్ను తొలగించడానికి ఆర్ హెచ్, చేతివ్రతతో కూడిన ఈసీ, ఆన్లైన్ ఈసీ, లింకు డాక్యుమెంట్లు ఇతరత్రా దస్తావేజులు అడగడం ద్వారా రైతులు విపరీతమైనటువంటి ఖర్చులు, లంచాలు ఇచ్చి రిజిస్టర్ కార్యాలయాల్లో తమ హక్కుకు సంబంధించిన పత్రాలు తీసుకుని కలెక్టర్ చుట్టూ తిరగడం తప్ప వేరే గత్యంతరం లేని పరిస్థితి రైతులలో ఏర్పడింది. అయినా ఇప్పటికీ పరిష్కారం కాక కలెక్టరేట్ల చుట్టూ తిరుగుతున్నారు. అంతేకాకుండా నిషేధిత భూములరిజిస్టర్‌లోపట్టా భూములు కూడా నమోదుకావడం రైతుల పాలిట శాపంగా మారింది. రీ సర్వేలో ప్రముఖంగా కనిపించే సమస్య భూమి విస్తీర్ణం ఎకరానికి దాదాపు 25 సెంట్లు తగ్గడం దీని ద్వారా అత్యధిక భూమి కలిగినటువంటి భూస్వాములకు 10 ఎకరాలకు దాదాపు అర్ధఎకరా నుండి పాతిక సెంట్ల వరకు భూమి తగ్గుదల చూపిస్తోంది. దీనికి కారణం పూర్వంబ్రిటిష్ కాలంలో ఇనుప గొలుసుతో భూమిని కొలవడం ఒకకారణం అయితే , రెండవది పొలాలు ఎగుడు దిగుడులు ఉండటం ద్వారా గొలుసు ద్వారా కొలిచినప్పుడు ఖచ్చితత్వంలో తేడాలు ఉండడటం. అయితే ప్రస్తుతం డ్రోన్ల ద్వారా, రోవర్ల ద్వారా జరగడం వలన భూమి విస్తీర్ణం 5శాతం తగ్గడం రైతులలో అసహనానికిగురిచేస్తుంది. దానికి తోడుభూములు ఒక సెంటు లక్షల్లోఉండడం వల్ల ఎకరానికి 10లక్షల వరకు నష్టంవాటిల్లే ప్రమాదం ఏర్పడింది. ఇన్ని సమస్యలు ఇంకా తీరనిపరిస్థితిలో ఉండగా, ప్రస్తుత కూటమిప్రభుత్వం వీటన్నిటిని సవాలుగా తీసుకొని, పరిష్కరించే మార్గంలో మళ్లీ రీసర్వేని ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం పై తెలిపిన సమస్యలే కాకుండా క్షేత్రస్థాయిలో అనేక సమస్యలనుపరిష్కరిస్తుందా? అధికారులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా సరైనవిధివిధానాల ద్వారా, సమాలోచనలు చేసిన తర్వాత రీసర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగానిర్వహిస్తే చాలా సమస్యలు తగ్గుతాయని నిపుణుల అభిప్రాయం. ●

# యువతను సన్మార్గంలో నడిపించాలంటే..

మోటె చిరంజీవి

దేశ జనాభాలో సుమారు 50 శాతానికి పైగా యువత ఉంది. వారు తలుచుకుంటే దేనినైనా సాధించవచ్చు. దేశ అభివృద్ధిలో వారి పాత్ర కీలకం. యువతలో సాధారణ చెడు అలవాట్లు చూసినట్లయితే అధిక సమయం సెల్ ఫోన్ చూడడం, పెద్దలపట్ల, చిన్నలపట్ల, అగౌరవంగా కించపరిచి మాట్లాడడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లకు అలవాటు పడడం, తరచుగా ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్ తీసుకోవడం, శారీరక శ్రమ లేకపోవడం, ఏ పనినైనా వాయిదా వేయడం, సరైన నిద్ర లేకపోవడం, పరిశుభ్రత పాటించకపోవడం, ధూమపానం, మద్యం వంటి చెడు వ్యసనాలకు బానిసవ్వడం, మాదకద్రవ్యాలకు అలవాటు పడడం, అధిక సోషల్ మీడియా వినియోగం, సమయపాలన పాటించకపోవడం ఇలా అనేక అలవాట్లకు నేటి యువత బానిస అవుతున్నారు. యువతీ యువకుల్లో విచ్చలవిడితనం పెరిగిపోవడం, తల్లిదండ్రులు వారి పిల్లలకు ఎక్కువ సమయం కేటాయించకపోవడం వల్ల ఇటువంటి దుష్పరిణామాలు ఏర్పడుతున్నాయి. పిల్లలు ఏం చేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు, ఎటువంటి అలవాట్లను అలవర్చుకుంటున్నారనేటువంటి విషయాలను వారు గమనించడం లేదు. ప్రపంచం



మొత్తం మీద జనాభాలో యువతశాతం ఎక్కువగా ఉంటుంది. అయితే యువత ఈ ప్రపంచంలో ఎదుర్కొంటున్న సమస్యలు చాలానేఉన్నాయి. వాటిలో నిరుద్యోగంఎంతో ముఖ్యమైనది. డిగ్రీ పట్టాలు చేతిలోఉన్నా, ఉన్నత విద్యలు చదివినా ఉద్యోగ అవకాశాలు సరైనవిధంగా లేక మిగిలిపోతున్న యువత ఎందరోఉన్నారు. ఈ సమస్యలను అధిగమించడానికి నేటి యువత తమ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. నాణ్యమైన నిద్రను పొందడం, శారీరకంగా చురుకుగాఉండటం, ఆరోగ్యకరమైన ఆహారంతీసుకోవడం, స్నేహితులు కుటుంబ సభ్యుల తో సన్నిహితంగా ఉండటం సరైన మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో చాలాదూరంగా ఉంటుంది. యువజనులలో నైపుణ్యాలను పెంచాలి. వాటిద్వారా మరింత సంపన్నమైన, శాంతియుతమైన, స్థిరమైన భవిష్యత్తు కోసం, యువత అభివృద్ధి చెందడానికీ, మార్పును సృష్టించేందుకు అవసరమైన నైపుణ్యాలు, సాధనాలతో యువతను సన్నద్ధంచేయడంలో అందరూ చేతులు కలపాలి. యువత సన్మార్గంలో నడవడానికి ఇంట్లోతల్లిదండ్రులు, పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాల్లో గురువులు అత్యంత ప్రధానమైనటువంటి భూమికను పోషించవలసి నటు వంటి అవసరం ఉంది. అప్పుడే యువత సరియైన మార్గంలో పయనిస్తారు. ●

# సామాజిక స్ఫృహతో ఆధ్యాత్మిక జాతర

ననుబోలు రాజశేఖర్

కుంభమేళా సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక స్ఫూర్తిని ప్రతిబింబించే విశిష్టమైన పండుగ. ఓ గొప్ప సామాజిక దృక్పథాన్ని అంతర్లీనంగా కలిగున్న ఆధ్యాత్మిక జాతర. కోట్ల మంది భక్తులను ఒకచోటకుచేర్చి తన భక్తి జలాలతో తడిపిముద్దచేసే అత్యంత పురాతన ఆధ్యాత్మిక వేడుక. వేలసంవత్సరాల నాటి పురాణ గాథల ఆధారంగా సాగిన ఈ మహాసమ్మేళనం భారతదేశం అప్రతిహత ఆధ్యాత్మిక వారసత్వానికి సాక్ష్యంగా నిలుస్తోంది. ప్రాచీన భారతదేశంలో ఈ కుంభమేళకు ఆధ్యాత్మిక సాధకులు, తత్వవేత్తలు, భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడం వలన కుంభమేళా ఆధ్యాత్మికత వేదికగానే కాకుండా జ్ఞాన మార్పిడి వేదికగాకూడా ఉపయోగపడింది. విశ్వాసం, సంస్కృతి, ఆధ్యాత్మికత, సమాజానికి సంబంధించిన అందమైన దృశ్యం ఈ కుంభమేళా. కుంభమేళా అనేది కుంభం, మేళా అనే రెండు పదాలకలయిక. కుంభ అనేది కుండకు సంస్కృతంలో సమానమైన అర్థంగల పదం. దీనికే కలశంఅనే అర్థంకూడా ఉంది. భారత ఖగోళ శాస్త్రం ప్రకారం కుంభం అనేది ఒక రాశిని కూడా సూచిస్తుంది. ఈ రాశిలోనే ఈ పండుగను నిర్వహిస్తారు. మేళా అంటే కూటమి, కలయిక లేక జాతరగా భావించవచ్చు. అతిపెద్ద ధార్మిక కార్యక్రమమైన కుంభమేళాలో నదులకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. కోట్లమంది భక్తులు పవిత్ర నదుల వద్దకు చేరుకొని చేసేవేడుకయే ఈకుంభమేళా. కుంభమేళా ఉత్తరప్రదేశ్లోని హరిద్వార్, ప్రయాగరాజ్‌తో పాటు మహారాష్ట్రలోని నాసిక్, మధ్యప్రదేశ్లోని ఉజ్జయినిలలో జరుగుతుంది. ప్రయాగరాజ్లో గంగా, యమునా, సరస్వతి నదుల సంగమ తీరంలో, హరిద్వార్లో గంగాతీరంలో, నాసిక్ గోదావరి తీరంలో, ఉజ్జయినిలో పవిత్ర క్షిప్రానది తీరంలో కుంభం కుంభమేళా జరుగుతుంది. కుంభమేళా అనేది భిన్నత్వాలను ఏకత్వంచేసేవేడుక, ఇక్కడ అన్నివర్గాల ప్రజలు ఆధ్యాత్మిక శుద్ధి జ్ఞానోదయం కోసం పవిత్ర నదులలో స్నానమాచరిస్తారు. ఈ పండుగ భారతదేశం గొప్ప సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనం. దేశం అద్భుతమైన వైవిధ్యాన్ని ప్రజలను ఒకచోట చేర్చే సామర్థ్యాన్ని కలిగినదే ఈ కుంభమేళా. కుంభమేళా ముఖ్యమైన సామాజిక ప్రభావాలను కలిగి ఉంది. ఎందుకంటే ఇది ప్రజలు ఒకరితో ఒకరు మమేకమవడానికి, వారి అనుభవాలను పంచుకోవడానికి ఒకరి నుండి మరొకరు నేర్చుకోవడానికి ఒక వేదికను నిర్మిస్తుంది. ఈ కుంభమేళా సామాజిక అడ్డంకులను ఛేదించడంలో, విభిన్న నేపథ్యాల ప్రజల మధ్య సామరస్యాన్ని పెంపొందించడంలో విశిష్టపాత్రను పోషిస్తుంది. ఆర్థికకుంభమేళా గణనీయమైన ఆర్థిక ప్రభావాన్ని చూపుతూ ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. వాణిజ్య పర్యాటక రంగాలను ప్రోత్సహిస్తుంది. కుంభమేళా భారతదేశ ఆర్థిక దృశ్యంలో ముఖ్యమైన భాగం. కుంభమేళా అనేది ఒక శక్తివంతమైన సాంస్కృతిక మార్పిడి ఈ ఉత్సవం సంగీతం, నృత్యం ప్రదర్శనలతోసహా అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలను కుంభమేళ వేదికగా ప్రదర్శిస్తారు. ఈ సాంస్కృతిక ప్రదర్శనలు భారతీయ సంస్కృతి అద్భుతమైన వైవిధ్యాన్ని



ప్రదర్శిస్తాయి. ఒక కథ ప్రకారం కుంభమేళాకి ఒక క్రమబద్ధమైన రూపాన్ని ఇచ్చిన ఘనత ఆది శంకరాచార్యుల వారికి దక్కుతుందనేది చరిత్రకారుల అభిప్రాయం. నాలుగుప్రధాన తీర్థాలలో నాలుగు పీఠాలను స్థాపించినట్లే నాలుగు తీర్థ స్థలాలలో కుంభమేళాలో సాధువుల భాగస్వామ్యాన్ని కూడా ఆయన నిర్ధారించారు. నేటికీ కుంభమేళాలలో శంకరాచార్య మఠానికి చెందిన సాధువులు, శిష్యులతో సహాపాల్గొంటారు. మధ్యయుగంలో మౌర్యులు, గుప్తులు వంటి రాజవంశాలు కుంభమేళాకు అనేక రకాల సహకారం అందించాయి. ఈ సమయంలో కుంభమేళా భారతదేశంలో ప్రధాన యాత్ర సంస్కృతిగా నిలిచింది. 12వ శతాబ్దం తర్వాత కుంభమేళా ప్రతిష్ఠ మరింత పెరిగింది. వివిధ రాజ్యాలకు చెందిన రాజులు చక్రవర్తులు ఈ వేడుకల్లో పాల్గొని తగిన ఆర్థిక సాయం వసతి ఏర్పాట్లు కల్పించేవారు. ముఖ్యంగా అక్బర్ కాలంలో మహా కుంభమేళ కోసం ప్రత్యేక నిధులు, భూ కేటాయింపులు జరిగాయి. బ్రిటిష్ పాలన సమయంలోనూ కుంభమేళా ఖ్యాతి మరింత పెరిగింది. 1918లో జరిగిన మహా కుంభమేళాల్లో మహాత్మా గాంధీ కూడా పాల్గొన్నారు. ఈ తరహా కార్యక్రమాలు ప్రజల్ని ఏకతాటి మీదకు తీసుకొస్తున్నాయన్న కారణంతో క్రమంగా చరిటిష్ ప్రభుత్వం దీన్ని వ్యతిరేకించింది. పన్నులు విధించి అణగదొక్కే ప్రయత్నం చేసింది. స్వతంత్రం తర్వాత తొలిసారిగా 1954లో తొలి కుంభమేళా నిర్వహించారు. అప్పుడునుంచి ఈ పుణ్య కార్యక్రమ నిరంతరాయంగా కొనసాగుతుంది. పురాణాలను పరికిస్తే ఒకసారి దేవతలు, రాక్షసులు కలిసి అమృతంకోసం క్షీరసాగర మథనం చేశారు. ఈ క్షీరసాగర మథనం నుండి అమృతాన్ని కలిగి ఉన్నకుంభం (కుండ) కనబడగానే దేవతలు రాక్షసులు మధ్య అమృతపు కుండకోసం భీకర పోరు జరుగుతుంది. పన్నెండు రాత్రులు పన్నెండు పగళ్ళు పాటు (మనుషుల దృష్టిలో పన్నెండు సంవత్సరాలు) జరిగిన ఈ యుద్ధ సమయంలో శ్రీ మహావిష్ణువు మోహినిఅవతారమెత్తి అమృతభాండం రాక్షసులకు దక్కకుండా. తీసుకెళుతున్నప్పుడు నాలుగు అమృతపు చుక్కలు భూలోకంలోని హరిద్వార్లోని గంగ ఉజ్జయినిలోని శివరా, నాసిక్లోని గోదావరి, ప్రయాగ్లోని త్రివేణీ సంగమంలో పడ్డాయని చెబుతారు. ఈ కారణంగానే ఆ నదుల్లోని నీళ్లు కొన్ని సమయాల్లో అమృతత్వాన్ని సంతరించుకుంటాయని చెబుతారు. సమయాన్నే కుంభమేళా సమయంగా భావిస్తారు. అందుకే అప్పుడు ఈ నదుల్లో స్నానం చేసేందుకు కోట్లాది భక్తులు సిద్ధమవుతారు. కుంభమేళా నిర్వహించే వేదికలను, తేదీలను సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి వివిధ రాశిచక్రాలలో ఆ కాలంలో ఉన్న స్థితిని బట్టిఎప్పటికప్పుడు నిర్ణయించడం జరుగుతుంది. సూర్యుడు. బృహస్పతి సింహరాశిలో ఉన్నప్పుడు ఈకుంభమేళాను నాసిక్‌లోని త్రియంబకేశ్వర్‌లోను, బృహస్పతికుంభ రాశిలో సూర్యుడు మేషరాశిలో ఉన్నప్పుడుహరిద్వార్‌లోను, బృహస్పతి వృషభరాశిలో సూర్యుడు మకరరాశిలో ఉన్నప్పుడు కుంభమేళాను ప్రయాగలోను, బృహస్పతి, సూర్యుడు వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు ఉజ్జయినిలోను నిర్వహించడం జరుగుతుంది. 144 సంవత్సరాల తర్వాత ప్రయాగరాజ్లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 25 వరకు మహా కుంభమేళా జరుగుతుంది. దాదాపు 15 కి.మీ. దూరం వరకు విస్తరించి ఉన్న త్రివేణి సంగమ తీరంలో కోట్లమంది భక్తులు స్నానం చేసే దృశ్యం అద్భుతంగా ఉంటుంది. దేశం నుంచే కాకుండా విదేశాలనుంచి కూడా భక్తులు ఇక్కడికివచ్చి మహాకుంభమేళా చారితరాత్మిక దృశ్యాలకు సాక్షులు అవుతారు. మహా కుంభస్నాన మంచు తెరల మాటున దాగివున్న కుంభమేళా ఆధ్యాత్మిక సౌందర్య దృశ్యాలను వీక్షి స్తూ అనుభవించడంట గొప్ప అనుభూతి అంతకుమించి పూర్వజన్మ సుకృతం. ●

# బడ్జెట్ తయారీలో ఆ ఆరుగురే కీలకం



## ఆర్థిక వృద్ధి 6.4 శాతంగా అంచనా

**న్యూఢిల్లీ, జనవరి 30:** కేంద్ర బడ్జెట్ రూపకల్పనలో కేంద్ర ఆర్థికశాఖ ఆధ్వర్యంలోని ఐదుగురు అధికారులు కీలకంగాపనిచేసారు. ఆర్థికవృద్ధి 6.4శాతంగా ఉంటుందని బడ్జెట్‌లోవేస్తున్న అంచనాలు ద్రవ్యోల్బణం తగ్గుతుందన్న అంచనాలు కూడా ఉన్నాయి. ఆర్థికస్థిరత్వానికి బడ్జెట్ దోహదంచేస్తుందని చెపుతున్నారు. ఆర్థిక మంత్రి సీతారామన్ నిపుణులైన ఆర్థికవేత్తలు అధికారుల బృందంతో కలిసి పనిచేసారు. ఆర్థిక రోడ్ మ్యాప్‌కు ఒక నిర్దిష్టమైన రూపాన్ని ఇచ్చారు. వారిలోప్రధానంగా ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ ఒకరు. అహ్మదాబాద్ ఐఐఎం పూర్వ విద్యార్థి అయిన అనంత నాగేశ్వరన్ స్థూల ఆర్థిక వ్యవస్థను రూపొందించడంలో కీలకంగా పనిచేసారు. అంతేకాకుండా బడ్జెట్ లక్ష్యాలు కూడా నిర్దేశించారు. ఆర్థిక సర్వేను రూపకల్పనచేసారు. ఈ ఆర్థికసంవత్సరం లోనే ఆయన పదవీకాలం పూర్తవుతుంది. ఇక ఐఐటి కాన్పూర్ పూర్వ విద్యార్థి అయిన ఆర్థికశాఖ వ్యయకార్యదర్శి మనోజ్‌గోవిల్ కొత్త పథకాల మంజూరులు, వ్యయం మార్గదర్శకాలు రూపొందించారు. అలాగే రాష్ట్రాలకు ఆర్థిక వనరుల బదిలీలో కూడా కీలకంగాపనిచేసారు. మధ్యప్రదేశ్ కేడర్‌లో 1991 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అయిన గోవిల్ వ్యయవిభాగం కార్యదర్శిగా 2024నుంచి పనిచేస్తున్నారు. కార్పొరేట్ వ్యవహారాల్లో విశేష అనుభవం ఉన్న అధికారి. ఇక ఆర్థికవ్యవహారాల కార్యదర్శి అజయ్‌సేథ్ 2021నుంచి ఈవిభాగంలో ఉన్నారు. బడ్జెట్ తుదిపత్రాల రూపకల్పనలో ఆయన దిట్ట. ఇక రెవెన్యూ ఆర్థికకార్యదర్శిగా తుహిన్‌కాంత పాండే కూడా బడ్జెట్‌రూపకల్పనలోభాగం అయ్యారు. ఒడిశా కేడర్ ఐఎఎస్ అధికారి అయిన తుహిన్ కాంత పాండే ఈ ఏడాది జనవరిలోనే చేరారు. సరళీకృత పన్నువ్యవస్థను రూపొందించడంలో కీలకంగా పనిచేసారు. ఇక దీపక్ కార్యదర్శి అరునిష్ చావ్లా కూడా బడ్జెట్‌లో కీలకమే. బీహార్ కేడర్ ఐఎఎస్ అధికారి పెట్టుబడుల ఉపసంహరణ, స్థిరాస్థి నగదీకరణ పథకాలు, ఐడిబిఐ బ్యాంకులో వాటా విక్రయాలలో కీలకంగా వ్యవహరించారు. ప్రాధాన్యేతర ఆస్తులను ఉపసంహరించడంలో ఆయన అందెవేసినచేయి. ఇక ఆర్థిక సేవల కార్యదర్శిగా ఎం నాగరాజుకూడా బడ్జెట్‌లో కీలకంగాపనిచేసారు. 1993 బ్యాచ్ త్రిపుర కేడర్ ఐఎఎస్ అధికారి అయిన దేశ అవసరాలకు అనుగుణంగా రుణపరపతి, ఫిన్‌టెక్ నిబంధనలు, బీమాకవరేజి విస్తరణ వంటి వాటిలో కీలకంగా పనిచేసారు. వివిధ ప్రభుత్వశాఖల్లో ఆయనకు విశేషానుభవం ఉంది. అందువల్లనే ఆర్థిక శాఖకు ఆయన్ను నియమించారు.



# రేప్‌కేసులో యుపి ఎంపి రాకేష్ రాథోడ్ అరెస్టు

**న్యూఢిల్లీ, జనవరి 30:** కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుడు రాకేష్ రాథోడ్‌ను ఒక అత్యాచారం కేసులో పోలీసులు అరెస్టుచేసారు. ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ ఎంపిగా ఎన్నికైన రాకేష్ మీడియా సమావేశం నిర్వహిస్తుండగానే పోలీసులు వచ్చి అరెస్టుచేసారు. రాథోర్‌పై పోలీసులు కేసునమోదు చేసారు. యుపి కాంగ్రెస్ యూనిట్‌కు ప్రధాన కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఒక మహిళ ఆయనపై ఈనెల 17వ తేదీ ఫిర్యాదుచేసింది. గడచిన నాలుగేళ్లుగా తనపై లైంగిక దాడికి పాల్పడుతున్నట్లు ఆమె ఫిర్యాదుచేసింది. తనను పెళ్లిచేసుకుంటానని నమ్మించాడని, తనకు మంచి రాజకీయ కెరీర్‌ను ఇస్తానని నమ్మబలికి తనను లొంగదీసుకున్నాడని ఆమె తెలిపింది. ఆమె రాకేష్ తనతో మాట్లాడిన కాల్‌రికార్డులు, కాల్స్ వివరాలు, రికార్డింగ్‌లను కూడా పోలీసులకు షేర్‌చేసింది. గత వారంలోనే మహిళ భర్త వేరుగా ఒక ఫిర్యాదుచేసారు. ఐదుగురు వ్యక్తులపై ఆయన ఫిర్యాదుసాడు. వారిలో రాథోడ్, ఆయన కుమారుడిపైనా నమోదుచేసిన కేసును సెటిల్‌చేసుకోవాలని బెదిరిస్తున్నారని ఆరోపించారు. అంతకుముందు అలహాబాద్ హైకోర్టు లక్నోబెంచ్ రాథోడ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించి వెంటనే లొంగిపోవాలని ఆదేశించింది.

హైకోర్టుకువెళ్లడానికి ముందు ఎంపిఎమ్మెల్యే కోర్టుకూడా ఆయనముందస్తు బెయిల్‌ను తిరస్కరించింది. కాంగ్రెస్‌లో చేరే ముందు రాథోర్ యుపి అసెంబ్లీఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా కూడా కొనసాగారు. ఆ తర్వాత స్వతంత్ర అభ్యర్థిగా కూడా పోటీపడ్డారు. అంతకు ముందుయుపి మాజీ సీఎం మాయా వతికి చెందిన బహుజన్ సమాజ్ పార్టీలో కూడా కొనసాగారు.

# నోబెల్ శాంతి బహుమతి రేసులో ఎలాన్ మస్క్!

**వాషింగ్టన్, జనవరి 30:** ప్రపంచ ప్రఖ్యాత నోబెల్ శాంతి బహుమతి-2025 రేసులో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు యూరోపియన్ పార్లమెంట్ సభ్యుడు బ్రాంక్ గ్రిమ్స్ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. 'ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నోబెల్ శాంతి బహుమతి అభ్యర్థిత్వానికి ఎంపికయ్యారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, మానవ హక్కులపై ఆయన ఎక్స్ వేదికగా తన నిబద్ధతను చాటుకున్నారు' అని గ్రిమ్స్ పేర్కొన్నారు. ఈ నెల 29న ఈ అభ్యర్థిత్వాన్ని సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఇక, గత యేడాది ఫిబ్రవరిలోనూ మస్క్ నోబెల్ శాంతి బహుమతి రేసులో ఉన్నారు. అప్పట్లో నార్వేకు చెందిన పార్లమెంట్ సభ్య మారియస్ నీల్సన్ ఆయన పేరును ప్రతిపాదించారు.

ప్రపంచంలో అత్యున్నత పురస్కారం నోబెల్ బహుమతి. ఈ నోబెల్ బహుమతిని డైనమేట్ కనుగొన్న విఖ్యాత రసాయన శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ పేరు మీద ప్రారంభించారు. వైద్యం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, సాహిత్యం, శాంతి విభాగాల్లో ఈ బహుమతిని అందజేస్తారు. 1968 స్వీడన్ బ్యాంక్ 300వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్థిక రంగంలో నోబెల్ బహుమతిని ఏర్పాటుచేసి, 1969 నుంచి ప్రదానం చేస్తున్నారు. దీన్ని నోబెల్ ప్రైజ్ ఇన్ ఎకనామిక్స్‌గా పిలుస్తారు. నోబెల్ బహుమతులను డిసెంబరు 10న నోబెల్ వర్ధంతి సందర్భంగా స్టాక్‌హోంలో ప్రదానం చేస్తారు.

# అమెరికా విద్యార్థి వీసాల్లో మార్పులు




## భారత్‌పై ప్రభావం!

**వాషింగ్టన్, జనవరి 30:** విద్యార్థి వీసాల గడువు ముగిసినా అమెరికాలో అక్రమంగా ఉంటున్న వారిపై ఇప్పుడు ఆ దేశం దృష్టి కేంద్రీకరించింది. తాజాగా అమెరికాలో 'వలస చట్టాల అమలును పునరుద్ధరించడంపై హౌస్ కమిటీ విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా చట్టసభ సభ్యులు పలు సూచనలు చేశారు. 2023లో వీసా గడువు ముగిసినా.. 7,000 మంది భారతీయ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లుచాలాకాలం అమెరికాలోనే ఉండిపోయారని సెంటర్ ఫర్ ఇమ్మిగ్రేషన్ స్టడీస్‌కు చెందిన జెస్సికా ఎం.వాఘన్ కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. కనీసం 32 దేశాలకు చెందిన విద్యార్థులు, స్టూడెంట్ ఎక్స్ఛేంజి విజిటర్లలో 20 శాతానికిపైగా వీసా గడువు దాటినా అమెరికాలోనే ఉంటున్నారని పేర్కొన్నారు. ఎఫ్, ఎం కేటగిరీల్లో వీసాలు పొందిన వారే అత్యధికంగా ఈ ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు.

అమెరికా స్కూళ్లు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పూర్తిస్థాయి విద్యార్థిలా చదువుకొనేందుకు ఎఫ్-1 వీసాలు జారీ చేస్తారు. దీంతోపాటు సెమినార్లు, భాషపై శిక్షణలకు కూడా వాడతారు. ఇక ఎం-1 వీసాలను వృత్తివిద్యా కోర్సులు, నాన్‌అకడమిక్ అవసరాలకు, లాంగ్వేజ్ ట్రైనింగ్‌లకు వాడుతుంటారు.

'బ్రెజిల్, చైనా, కొలంబియా, ఇండియాల్లో ఒక్కో దానికి చెందిన 2,000 మందికిపైగా విద్యార్థులు వీసా గడువు ముగిసినా ఇంకా అమెరికాలోనే ఉన్నారు. వీరిలో అత్యధికంగా భారతీయుల సంఖ్య 7,000. వీసా పాలసీల్లో మార్పులు అవసరం. మారుమూల ప్రాంతాల్లో కూడా అక్రమ వలసదారులను గుర్తించి వెనక్కి పంపేలా ఇంటీరియర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విధానాన్ని బలోపేతం చేయాలి. చట్టంలో కాంగ్రెస్ పలు సవరణలు చేయాలి. ద్వంద్వ ఉద్దేశాలను విద్యార్థి వీసాలకు వర్తింపజేయకూడదు. దీంతోపాటు ప్రతి స్టూడెంట్ చదువు పూర్తయిన తర్వాత స్వదేశానికి వెళ్లటానికి సిద్ధంగా ఉండాలి' అని జెస్సికా ఎం.వాఘన్ పేర్కొన్నారు.

**మొత్తం 75,000లోపే వీసాలు ఉండాలి..**

ఇక హెచ్-1బి వీసాలకు రెండేళ్లగడువు మాత్రమే ఉండాలని జెస్సికా పేర్కొన్నారు. వీటిని అవసరాన్ని బట్టి నాలుగేళ్లకు పొడిగించుకొనేల అవకాశం ఇవ్వాలన్నారు. గ్రీన్‌కార్డు పిటిషన్ల ఆధారంగా ఆటోమేటిక్‌గా పొడిగింపులు లభించకూడదని కమిటీకి సూచించారు. 'రీసెర్చి, నాన్‌ప్రాఫిట్ సహా వీసాల సంఖ్య 75,000లోపే ఉండాలి. ప్రస్తుతం అపరిమితంగా ఉంది. ఒకవేళ వీసా సబ్‌స్క్రిప్షన్లు ఎక్కువగా ఉంటే.. అత్యధికంగా వేతనాలు చెల్లించే సంస్థకు కేటాయించారు. ఇలా చేయడం వల్ల ఎక్కువ ప్రతిభ ఉన్న వారికి అవకాశం లభిస్తుంది. ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగులుగా చాలా పరిమిత సంఖ్యలో.. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే వీసాలు కేటాయించాలి' అని ఆమె సూచించారు.

# మహాకుంభ్‌మేళాలో వివిఐపి పాస్‌ల రద్దు

## ట్రాఫిక్ క్లియరెన్స్‌కోసం చిరువ్యాపారాల తొలగింపు

## మహాకుంభ్ నగర్ మొత్తం నో వెహికల్ జోన్

**మహాకుంభ్‌నగర్, (యుపి), జనవరి 30:** ప్రయాగరాజ్‌లోజరుగుతున్న కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో 30 మంది మృతిచెంది 90 మందివరకూ గాయపడటంతో అధికారులు వెంటనే సర్దుబాటు చర్యలుచేపట్టారు. కుంభమేళా జరుగుతున్న ప్రాంతాన్ని నో వెహికల్ జోన్‌గాప్రకటించారు. వివిఐపి పాస్‌లన్నింటినీ రద్దు చేసారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేందుకు రోడ్లన్నీ కూడా వన్‌వేగా మార్చారు. మౌని అమావాస్యను పురస్కరించుకుని పవిత్రస్నానాలు ఆచరించేందుకు లక్షలాది మంది ఒక్కసారిగా తోసుకురావడంతో సంగమ ప్రాంతంలో తొక్కిసలాటజరిగింది. ఈ ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 60 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో అప్రమత్తం అయిన సీఎం యోగి పలు జిల్లాలపోలీసులు అధికారులతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను నియంత్రించేందుకు పలుసూచనలు కూడా చేసారు. మహాకుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి రాకుండా అన్ని వాహనాలకు ఎంట్రీ పాస్‌లు రద్దుచేసారు. ప్రయాగరాజ్ చుట్టుపక్కల జిల్లాలనుంచి వస్తున్న వాహనాలను సరిహద్దుల్లోనే నిలిపివేస్తున్నారు. ఫిబ్రవరి 4 వరకూ నగరంలోకి రాకుండా నాలుగు చక్రాల వాహనాలను నిషేధించారు. రోడ్డుపక్కల చిరుతిళ్లను విక్రయించే వారందరినీ ఖాళీప్రదేశాల్లోకి తరలించి ట్రాఫిక్‌ను క్లియర్‌చేయాలని సీఎం యోగి ఆదేశించారు.

ఇదిలా ఉంటే వచ్చే నెల మూడో తేదీ వసంత పంచమి సందర్భంగామూడో అమృత్‌స్నానాలు జరుగుతాయి. ఆరోజు కూడా భక్తులుభారీగా అమృత్‌స్నానాలకు తరలివచ్చే అవకాశం ఉంది. దాంతో మళ్లీ తొక్కిసలాట లాంటి దుర్ఘటన పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఆప్రాంతాన్ని గురువారం రాష్ట్రప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ సింగ్, డిజిపి ప్రశాంత్‌కుమార్‌లు పరిశీలించారు. అంతేకాకుండా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటపై సమగ్ర విచారణ జరిపించాలని సుప్రీం కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాం దాఖలయింది. తొక్కిసలాటకు సంబందించిన నివేదిక కోరాలని డిమాండ్‌చేస్తూ బాధ్యులైన అధికారులపై చర్చలు తీసుకోవాలని ఆదేశించాలని పిటిషనర్‌కోరారు. కేంద్ర ప్రభుత్వం,యుపితో సహా అన్నిరాష్ట్రాలను పార్టీలుగాచేర్చారు.

# మేయర్ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్

## ఛండీఘర్ మేయర్ బిజెపి వశం

**ఛండీఘర్, జనవరి 30:** ఛండీఘర్ మేయర్ ఎన్నికల్లో బిజెపి విక్టరీ నమోదుచేసింది. మొత్తం ఓట్లలో 19ఓట్లు సాధించిమేయర్‌పదవిని కైవసం చేసుకుంది. ఆప్ కాంగ్రెస్ కూటమిలో 17 ఓట్లు మాత్రమే రావడం 19 ఓట్లు బిజెపిరావడంతో మేయర్ గా బిజెపి అభ్యర్థి హర్‌ప్రీత్‌కౌర్ బబ్లా ఎన్నికలయినట్లు ప్రకటించారు. ఆప్‌నుంచి ప్రేమ్‌లత మేయర్‌పదవికి పోటీపడిన సంగతి తెలిసిందే. ఛండీఘర్‌మేయర్ ఎన్నికలు ఇటు బిజెపి, అటు కాంగ్రెస్, ఆప్‌కూటమిలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. చండీఘర్‌మున్సిపల్ కార్పొరేషన్ మొత్తం 35 మంది సభ్యులున్నారు. ఎన్నికయిన కౌన్సిలర్లతోపాటు చండీఘర్ ఎంపి ఇపుడు ఎక్స్‌అఫీషియో సభ్యునిగా కొనసాగుతున్నారు. ఎన్నికలకు ముందు ఆప్ 13 మంది కౌన్సిలర్లు, కాంగ్రెస్ ఆరు, బిజెపి 16, ఒక వోటు చండీఘర్ ఎంపి కాంగ్రెస్‌కు ఉన్నాయి. అయితే పోలింగ్ సరళిని చూస్తే ఖచ్చితంగా క్రాస్ ఓటింగ్ జరిగిందన్నది రుజువవుతోంది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ కౌన్సిరల్ గురుబక్స్ రావత్ బిజెపివైపు మొగ్గుచూపించారు. దీనితో పార్టీబలం 16కు పెరిగింది. రహస్య ఓటింగ్ పద్ధతిలో ఎన్నికలు జరిగాయి. నామినేటెడ్ కౌన్సిలర్ రామ్‌నీక్‌సింగ్ బేడి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. పంజాబ్ హర్యానాహైకోర్టు రిటైర్డ్ జడ్జి జయశ్రీ ఠాకూర్‌ను స్వతంత్ర పరిశీలకురాలిగా సుప్రీంకోర్టు నియమించింది. మొత్తం ఎన్నికలప్రక్రియను విడియో చిత్రీకరించాలనికూడా సుప్రీం ఆదేశించింది.

# గగనతలంలో విమానం, హెలికాప్టర్ ఢీ



## పోటోమాక్ నదిలో కుప్పకూలిన వైనం

## ఇప్పటివరకూ 28 మృతదేహాలు రికవరీ

**ఆర్లింగ్టన్, జనవరి 30:** అమెరికాలోని రొనాల్డ్ రీగన్ ఎయిర్‌పోర్టుకు వచ్చే క్రమంలోనే గగనతలంలో ఒక విమానం, ఆర్మీ హెలికాప్టర్లు ఢీకొనడంతో అక్కడికక్కడే కుప్పకూలాయి. ఈ ప్రమాదంలో 28 మందిమృతదేహాలను ఇప్పటివరకూ రికవరీచేసారు. అయితే ఈ ఘటనలో ఏఒక్కరూ బతికి ఉంటారని భావించడంలేదని ప్రమాద స్థితిని బట్టి అధికారులు చెపుతున్నారు. రీగన్ ఎయిర్‌పోర్టుకు సమీపంలోనే ఉన్న పోటోమాక్ నదినుంచి కొన్ని మృతదేహాలను రికవరీ చేసారు. 60 మంది ప్రయాణీకులు, నలుగురు క్రూసిబ్బందితో వస్తున్న ఈ విమానం ఇక కొద్దిసేట్లో రొనాల్డ్ రీగన్ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుందనగా ఈప్రమాదం చోటుచేసుకుందని ఈప్రమాదంలో అమెరికా ఆర్మీకి చెందిన బ్లాక్ హాక్ హెలికాప్టర్ కూడా ధ్వంసం అయినట్లు వాషింగ్టన్ డిసి అధికారులు చెపుతున్నారు. వాషింగ్టన్ ఫైర్ చీఫ్ జాన్ దోన్నెల్లీ మాట్లాడుతూ ఈప్రమాదంలో ఎవ్వరూ బతికి ఉంటారని అనుకోవడంలేదన్నారు. సహాయ కార్యక్రమాలతోపాటు బాడీల రికవరీకి కూడా కృషిచేస్తున్నా మన్నారు. బుధవారం రాత్రి వేళ ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అమెరికన్‌ఎయిర్‌లైన్స్ అనుబంధ సంస్థ ఈ బాంబార్డియర్ విమానాన్ని నడుపుతోంది. అదేక్రమంలో ఆర్మీ హెలికాప్టర్ కూడా పైలట్లకు సిబ్బందికి శిక్షణనిస్తోంది. అత్యంతశీతలనదిగా ఉన్న పోటోమాక్ నదిలోనే గగనతలంలో ఢీకొని కూలిపోయాయి. క్రాష్ క్రాష్ అన్న శబ్దాలు బిగ్గర వినిపించాయి. బ్లాక్‌హాక్ హెలికాప్టర్ కూడా ముగ్గురు సైనికులతో వెళుతోంది. అత్యవసర సిబ్బంది సుమారు 300 మందికిపైగా ఇపుడు మృతదేహాల రికవరీకి పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈప్రమాదంపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేసారు. ఈప్రమాదంపట్ల విచారం వ్యక్తం చేస్తూనే ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలపై తీవ్ర విమర్శలుచేసారు. విమానం ఖచ్చితమైన రూటులోఉన్నపుడు హెలికాప్టర్‌నేరుగా విమానం వైపునకు ఎలా వస్తుందని స్పష్టంగా ఉన్న రాత్రివేళ కూడా ఇలా జరిగితే ఎలా ఇందుకు ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలదే బాధ్యత కాదా అని ఆయన ట్రూత్‌సోషల్‌మీడియాలో పోస్టుచేసారు. ఫెడరల్ ఏవియేషన్ పాలనా యంత్రాంగం ముందు విచారణకు ఆదేశించింది. రీగన్ విమానాశ్రయంలోకి అన్ని విమానాల రాకపోకలను నిషేధించింది. శుక్రవారం ఉదయం వరకూ కూడా విమానాల ల్యాండింగ్‌ను నిలిపివేసింది. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌సిఇఒ ఒక విడియో విడుదలచేస్తూ తీవ్ర విచారం కలిగిస్తోందని పేర్కొన్నారు.

అమెరికా కన్సాస్ సెనేటర్ రోజర్ మార్షల్ మాట్లాడుతూ ఈప్రమాదం అంతా ఒక క్షణంలో జరిగిపోయిందని అన్నారు. అత్యాధునిక సాంకేతికపరిజ్ఞానంతో ఉన్న విమానం ఒక మిలిటరీ హెలికాప్టర్‌ను ఎలా ఢీకొట్టిందన్న అంశంపై విచారణ జరుపుతున్నారు. వాషింగ్టన్ గగనతలం నిత్యం రద్దీగా ఉంటుంది. తక్కువ ఎత్తులోనే విమానాలు రాకపోకలు సాగిస్తుంటారు. మిలిటరీ, ప్రభుత్వ హెలికాప్టర్లు కూడా వివిధ ప్రాంతాలకు తగిన ఎత్తుల్లో వెళుతుంటాయి. రాత్రిపగలు కూడా రాకపోకలు సాగిస్తూనే ఉంటాయి. ఇలా తక్కువ ఎత్తులో గగనతలంలో రద్దీగా రాకపోకలు సాగించడంపైనా ఇపుడు విచారణ సాగిస్తున్నారు.

# బంగ్లా ప్రధాన సలహాదారు యూనస్‌తో జార్జిసోరస్ కుమారుడు భేటీ

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎఫెక్ట్

**ఢాకా, జనవరి 30:** వివాదాస్పద అమెరికన్ బిలియనీర్, ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ అధినేత జార్జిసోరస్ కుమారుడు అలెక్స్.. బంగ్లాదేశ్ ముఖ్య సలహాదారు మహమ్మద్ యూనస్‌తో భేటీ అయ్యారు. ఆ దేశానికి నిధులను నిలిపేస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకొన్నాక ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. మూడు నెలల వ్యవధిలోనే వీరిద్దరూ భేటీ కావడం ఇది రెండోసారి. ఓపెన్ సొసైటీ ఫౌండేషన్‌కు చెందిన కీలక వ్యక్తులు చీఫ్ ఇంటీరియం అడ్వైజర్‌తో భేటీ అయ్యారని యూనస్ ఆఫీస్ ఎక్స్‌లో పోస్టుచేసింది. 'బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థను ఎలా పునరుద్ధరించాలని, అసత్య ప్రచారాలతో ఎలా పోరాడాలో, కీలక ఆర్థిక సంస్కరణలు వంటి అంశాలపై చర్చించారు. అని యూనస్ ఆఫీసు పేర్కొంది. వీటితోపాటు రోహింగ్యా సంక్షోభం వంటి వాటిపైనా మాట్లాడినట్లు స్థానిక మీడియా పేర్కొంది. సోరస్‌కు చెందిన ఒఎస్‌ఎఫ్ తూర్పు ఐరోపా, పశ్చిమాసియా, లాటిన్ అమెరికాలోని కొన్ని దేశాల్లో ప్రభుత్వాల మార్పిడిని ప్రోత్సహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వ పతనంలో కూడా కీలకపాత్ర పోషించారని ప్రచారంలో ఉంది.

యుఎస్ ఎయిడ్ నుంచి వివిధ దేశాలకు అందుతున్న సాయాన్ని ట్రంప్ సర్కారు 90 రోజులపాటు నిలిపివేసింది. ఈ జాబితాలో బంగ్లాదేశ్ కూడా ఉంది. దీంతో యుఎస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వానికి చిక్కులు ఎదురుకానున్నాయి.


ఆసియాలోనే యుఎస్‌ఎయిడ్ అతిపెద్ద సాయం బంగ్లాదేశ్‌కు అందుతుంది. ముఖ్యంగా ఆహార, ఆరోగ్యం, పాలన, విద్య, పర్యావరణం సంబంధిత రంగాల్లో వీటిని వినియోగించేవారు. 2024లో అమెరికా నుంచి 202 మిలియన్ డాలర్లు అందాయి.

# మహా కుంభమేళాలో అగ్నిప్రమాదం..

## 15 గుడారాలు దగ్ధం..

**ప్రయాగ్‌రాజ్, జనవరి 30:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో మరోసారి అపశ్రుతి చోటుచేసుకుంది. ప్రయాగ్‌రాజ్ సెక్టార్- 22లోని ఛట్‌నాగ్ ఘాట్ వద్ద ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో దాదాపు 15 గుడారాలు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఎవరికీ ప్రమాదం జరగలేదని అధికారులు వెల్లడించారు. 11 రోజుల క్రితం రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో భారీగా మంటలు వ్యాపించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 18 టెంట్లు దగ్ధమయ్యాయి.

# యమునలో అమోనియం స్థాయిలు అధికంగా ఉన్నాయన్న ఆప్




## తగిన ఆధారాలు చూపాలన్న ఇసి!

**న్యూఢిల్లీ, జనవరి 30:** యమునా నదిలో అమోనియా స్థాయిలు పెరగడాన్ని రెండు దేశాల మధ్య యుద్ధంలా చూడొద్దని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్‌కు ఎన్నికల సంఘం సూచించింది. హర్యానా ప్రభుత్వం యమునా నదిలోకి పారిశ్రామిక వ్యర్థాలను వదులుతోందని కేజ్రీవాల్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలపై ఇసి జారీ చేసిన నోటీసులకు ఆయన సమాధానమిచ్చారు. దీనిపై తాజాగా ఇసి ప్రతిస్పందించింది. యమునా నదిలో అమోనియా పెరుగుదలను నరమేధం, రెండు దేశాల మధ్య యుద్ధంలా చూడొద్దని ఇసి కేజ్రీవాల్‌కు సూచించింది. వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంచడంతో పాటు అశాంతిని కలిగించేలా తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని కోరింది. పెరిగిన అమోనియా స్థాయిలను విషప్రయోగం అనే అంశంతో కలపకుండా నదిలోని నీటి స్వభావం, పరిణామం, విషపూరితమైన విధానం, దాన్ని గుర్తించే పద్ధతులపై సరైన సాక్ష్యాలను అందించేందుకు మరో అవకాశం కల్పించింది. శుక్రవారం ఉదయం 11 గంటలలోపు ఆయా సాక్ష్యాలను ఢిల్లీ జల్ బోర్డుకు సమర్పించాలని ఆదేశించింది. లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది. హర్యానా నుంచి ఢిల్లీకి ప్రవహిస్తున్న యమునా నదిలో అమోనియం స్థాయిలు ఆరురెట్లు అధికంగా ఉన్నాయని ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం వాదిస్తోంది. వీటివల్ల నగరవాసులకు ఆరోగ్యసమస్యలు వస్తాయని, ఈ విషయాలన్నీ తెలిసినప్పటికీ ఉద్దేశపూర్వకంగానే పారిశ్రామిక వ్యర్థాలను డంప్ చేస్తున్నారని ఆరోపిస్తోంది.

ఈ క్రమంలో నదిలో విషం కలపడం ద్వారా ప్రజలను హతమార్చాలని అక్కడి బిజెపి ప్రభుత్వం చూస్తోందని కేజ్రీవాల్ ఇటీవల సంచలన ఆరోపణలు చేశారు.

మరోవైపు ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ కూడా యమునను కలుషితం చేయడం 'జల ఉగ్రవాదం'గా పేర్కొన్నారు. ఈఆరోపణలపై స్పందించిన ఇసి తగిన ఆధారాలు చూపించాలని ఆప్‌ను ఆదేశించింది. దీనికి కేజ్రీవాల్ స్పందించగా, తాజాగా ఇసి ప్రతిస్పందించింది.

# ప్రొఫెసర్‌ను పెళ్లాడిన విద్యార్థి

## బెంగాల్‌లో వింత సంఘటన వైరల్

**కోల్‌కత్తా, జనవరి 30:** బెంగాల్‌లోని మౌలానా అబుల్ కలామ్ అజాద్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న హరింఘటా టెక్నాలజీ కాలేజీలో ఒక ప్రొఫెసర్ అదే కళాశాలలో చదువుతున్న విద్యార్థిని పెళ్లాడింది. కోల్‌కత్తాకు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న నదియాలో ఈసంఘటన జరిగింది. పాయల్ బెనర్జీ అనే సైకాలజీ ప్రొఫెసర్ తన విభాగంలోనే చదువుతున్న విద్యార్థిని పెళ్లాడిందని విడియోల్లో రుజువయింది. ఆమె పెళ్లిందడలు, వధువు దుస్తులు అలంకారంలో కనిపించింది. అయితే ఇది నిజమైన పెళ్లికాదని, అకడమిక్ కసరత్తుల్లో భాగంగా అంతర్గత వినియోగంకోసం జరిగినదేనని ఆమె వాదిస్తోంది. హల్దీ వేడుకలు, పూలదండలు మార్చుకోవడం వంటివి తరగతి గదిలోనే జరిగాయి. ఈసంఘటనను తీవ్రంగా పరిగణించిన వర్సిటీ అధికారులు ఆమెను సెలవుపై వెళ్లాలని ఆదేశించి దర్యాప్తునకు ఆదేశించారు. ఇందుకోసం ముగ్గురుసభ్యుల ప్యానెల్‌ను కూడా ఏర్పాటుచేసి దోషులుగా ఎవరుతేలినా కఠిన చర్యలు తీసుకుంటామని వర్సిటీ అధికారులు చెప్పారు. సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్న విడియోల్లో విద్యార్థిపై హల్దీని చల్లారు. హిందూ వివాహ వేడుకల్లో ఈ వేడుక జరుగుతుంది. మరో విడియోలు ఇద్దరూ దండలు మార్చుకుని పవిత్ర అగ్నిగుండం తరహాలో ఒక క్యాండిల్‌చుట్టూ ఏడు అడుగులు నడిచినట్లు కనిపిస్తోంది. అలాగే విద్యార్థి కూడా ఆమె నుదుటిపై సిందూరం పెట్టాడు. అంతేకాకుండా ఆమెకు రోజాపువ్వును ఆఫర్‌చేసాడు. విద్యార్థి ప్రొఫెసర్ సంతకాలతో ఉన్న యూనివర్సిటీ లెటర్‌హెడ్‌పై ఆమె ఆతడు ఒకరికొకరు ఇష్టపడుతున్నట్లు అందుకే పెళ్లిచేసుకున్నట్లు సంతకాలున్న పత్రం కూడా వైరల్ అయింది. ఏళ్లతరబడి సైకాలజీ ప్రొఫెసర్‌గా బెనర్జీ పనిచేస్తోంది. అయితే సైకలాజికల్ డ్రామాలో ఇదొక భాగమని తన బోధనా తీరును తరగతుల్లో కూడా ఆమె ఈవిధంగా వివరిస్తుందని ఈ విడియోలు ఆమెను అప్రతిష్టపాలుచేయడానికే వైరల్‌చేసారని ఆమె ఆరోపిస్తోంది. అయితే ఈ తతంగం మొత్తంపై విద్యార్థి మాత్రం ఎలాంటి వ్యాఖ్యలుచేయలేదు.



గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పిపిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

# అధిష్టానానికి ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితా

## ఫిబ్రవరి రెండోవారం సూర్యాపేటలో రాహుల్‌గాంధీ సభ

## టీచర్ ఎమ్మెల్సీపై ఫిబ్రవరి 3న కేబినెట్ సబ్‌కమిటీ

## సమావేశం, 5న కులగణనపై.. : పిసిసి చీఫ్ మహేష్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న శాసనమండలి ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థిని ఏఐసిసి ప్రకటిస్తుందని ఢిల్లీకి పేర్లు నివేదిం చామని తెలిపారు. నక్సలిజం లా అండ్ ఆర్డర్ ప్రాబ్లంగా మారిందని అన్నారు. సూర్యపేటలో రాహుల్‌సభ ఉంటుందని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ చెప్పారు. ఫిబ్రవరి రెండోవారం రాహుల్‌గాంధీ సభను తెలంగాణలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరుపై ఇప్పటికే కసరత్తు జరిగిందని ఢిల్లీకి పంపిచామని తెలిపారు. కుల గణన నివేదికపై ఫిబ్రవరి 5న కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం ఉంటుంది. టీచర్స్ ఎమ్మెల్సీ పై ఫిబ్రవరి 3న సమావేశం ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. బిఆర్ఎస్, బిజెపి కుల గణన సర్వే జరిగితే తమకు నష్టం జరుగుతుందని అది జరగకుండా కుట్రలు చేశాయని ఆయన ఆరోపించారు. స్థానికసంస్థల ఎన్నికలు కేబినెట్‌లో నిర్ణయిస్తారని రిజర్వేషన్ పెంపు తర్వాత ఉంటాయని టిపిసిచీఫ్ స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సి పల్ కార్పొరేషన్ ఎన్నికలల్లో కాంగ్రెస్ గెలుపొందడం ఖాయమని జోస్యంచెప్పారు. మేయర్ పీఠం కైవసం చేసుకొంటామని ధీమా వ్యక్తంచేశారు. బిజెపి కార్పొరేటర్లు బిక్షాటన చేస్తూ జిహెచ్ఎంసి సమావేశాని రావడం విడ్డూరమని కేంద్రం నుంచి ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదని ఇద్దరు బిజెపి కేంద్ర మంత్రులు ఉన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో విఫలం కావడతో సంక్షేమపథకాలు లబ్దిదారులకు అందడంలేదని ఆయన ఆవేదన చెందారు. హామిల అమలుకు కొంత ఆలస్యం అవుతుందేమోకానీ ప్రజల్ని మోసం కాంగ్రెస్ మోసం చేయ దని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని పథకాలను అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఉద్దేశ్యం డబ్బులు లేవని కాదని అధికా రుల వల్ల సంక్షేమపథకాలు కొంత మందికి అందంలో ఆలస్యం అవుతుందనే భావంలో మాట్లాడారని ఆయన అర్థం వివరించారు. పటాన్‌చెరుపై కమిటీ నివేదిక ఇంకా రాలేదని ఎమ్మెల్యే కమిటి ముందుకు రావాల్సి ఉందని సమస్యను సామ రస్యపూర్వకంగా పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. సిఎం ఇంటి వద్ద సమీక్షలు చేస్తారు అందులో తప్పే ముందని ఆయన ప్రశ్నించారు. సచివాలయం కూల్చి మరలా కొత్తది కట్టాల్సి న అవసరం ఏమొచ్చిందని అని ఆయన్నారు. తెలంగాణ ఉద్యమనాయకుడిగా కెసిఆర్‌పై అభిమానం ఉంటుందని, జగ్గారెడ్డిని మూడేండ్లు నెగ్గు కుంటూ వచ్చామని టిపిసిసి చీఫ్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు.

# సచివాలయంలో ఇద్దరు నకిలీ ఉద్యోగులు

## అధికారులతో పనులు చేయిస్తామంటూ దందాలు

## రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న భద్రతా సిబ్బంది

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 30:** తెలంగాణ సచివాలయంలో భద్రతా లోపం బయటపడింది. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నకిలీ ఉద్యోగులు దర్జాగా తిరగడం కలకలం రేపింది. ఫేక్ ఐడీ కార్డు మెడలో వేసుకుని అన్ని సెక్షన్లు తిరుగుతూ హల్చల్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సెక్రటేరి యట్‌లో ఇటీవల నకిలీ ఉద్యోగులు తిరుగుతు న్నారని భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. దీంతో



నిఘా పెట్టిన ఇంటెలిజెన్స్ శాఖ.. ఇద్దరు నకిలీ ఉద్యోగులను అదుపులోకి తీసుకుంది. ఖమ్మం జిల్లాకు చెందిన భాస్కర్ రావు, డ్రైవర్ రవి ఫేక్ ఐడీ కార్డులు తయారుచేసి సెక్రటేరియట్‌లో దందా చేస్తున్నారు. సెక్షన్ ఆఫీసుల్లో తిరుగుతూ అక్కడికి వచ్చిన వారిని మాటల్లో పెట్టి వివరాలు రాబడుతున్నారు. వారి పని పూర్తి చేయిస్తామని నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్నారు. నకిలీ ఉద్యోగుల సమాచారంతో అప్రమత్తమైన సచివాలయ భద్రతా సిబ్బంది, ఇంటెలిజెన్స్ శాఖ అధికారులు నిఘా పెట్టారు. ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ యూసుఫ్, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు చాకచాక్యంగా వ్యవహరించి నకిలీ ఉద్యోగులు ఇద్దరినీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరినీ సైఫాబాద్ పోలీసులకు అప్పగించారు. రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్ గా చలామణి అవుతున్న భాస్కర్ రావుతో పాటు డ్రైవర్ రవిని పోలీసులు విచారిస్తున్నారు. సచివాలయంలో ఫేక్ ఐడితో ఓ వ్యక్తి దొరికాడు. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా చెప్పుకుంటూ సదరు వ్యక్తి బిల్డప్ ఇస్తున్నాడు. నకిలీ ఉద్యోగి కదలికలు అనుమానంగా ఉండడంతో సెక్రటేరియట్ సిఎస్ఒ దేవిదాస్ ఆదేశాల మేరకు ఇంటెలిజెన్స్ నిఘా ఉంచి పట్టుకుంది. మైనార్టీ డిపార్ట్మెంట్ సెక్షన్ ఆఫీసర్ వి ప్రశాంత్, డ్రైవర్ రవిలు ఫేక్ ఐడీ కార్డు తయారు చేసి భాస్కర్ రావుకు ఇచ్చినట్లు ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ గుర్తించింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ మీడియా సమావేశంలో ఉద్యోగి పేరిట హల్‌చల్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తే అసలు విషయం బట్టబయలైంది. నకిలీ ఐడెంటిటీ కార్డుతో చలామణి అవుతున్న విషయం బయటపడింది. ఖమ్మం జిల్లాకు చెందిన భాస్కర్ అనే వ్యక్తి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగిగా నకిలీ ఐడెంటిటీ కార్డు తీసుకుని సెక్షన్‌లో దర్జాగా తిరుగుతున్నట్లు ఇంటెలిజెన్స్ గుర్తించారు.



# తెలంగాణ తరహా అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ను గెలిపించండి

## ఢిల్లీలో ఎన్నికల ప్రచారంలో మాజీ ఎంపి విహెచ్

**హైదరాబాద్, జనవరి 30,ప్రభాతవార్త:** తెలంగాణ తరహాలో అభివృద్ధి సంక్షేమం కోసం కాంగ్రెస్‌ను ఢిల్లీ ప్రజలు గెలిపించాలని కాంగ్రెస్‌ను గెలిపించాలని పిసిసి మాజీ అధ్యక్షుడు,మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. ఢిల్లీలోనీ నాంగ్లోయ్ జాట్ అసెంబ్లీ నియోజకవర్గంలో గురువారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రోహిత్ చౌదరి తరఫున కాంగ్రెస్ నేతలు సచిన్ పైలట్, వి.హనుమంత రావు, మాణిక్ రావు ఠాక్రే ప్రచారం చేశారు.ఈ సందర్భంగా వి.హెచ్ మాట్లాడతాడు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న యువకుడు, సౌమ్యుడు రోహిత్ చౌదరి కి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ గెలుపుతో రాజ్యాంగ పరిరక్షణ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కులగణ చేసి అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తామని తెలిపారు. ఢిల్లీలో మౌలికవసతులు శీలాదీక్షిత్ కాలంలో ఉన్నవే ఇప్పటి ఉన్నాయని ఇంకా పెంచాలనే ఆలోచన రెండు ప్రభుత్వాలు చేయ లేదన్నారు. తెలంగాణలో రెండులక్షల రుణమాఫీచేశామని, రైతుభరోసా ఇచ్చామని కరెంటుఉచితంగా ఇస్తున్నామని ఆరు గ్యారెంటీలను ఏకరువుపెట్టినారు.

# జోగులాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలి

## మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** జోగులాంబ బాల బ్రహ్మేశ్వరి స్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 3వ తేది వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలు, ఫిబ్రవరి 25 నుంచి మార్చి 1వ తేది వరకు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆలయ ఇఒ పురేంద్ర కుమార్, అర్చకులు సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను, ఆహ్వానపత్రికను మంత్రికి అందించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధ్వజారోహణం, మహా పూర్ణాహుతి, సహస్ర కలశాభిషేకం, జోగులాంబ బాల బ్రహ్మేశ్వర్‌స్వామి కళ్యాణోత్సవం, మహాశివరాత్రిని పురస్కరించుకుని కళ్యాణో త్సవం, రథోత్సవం, అశ్వ వాహన సేవ, అవభృదోత్సవాలను నిర్వహిం చనున్నట్లు ఇఒ పురేంద్రకుమార్ మంత్రికి వివరించారు. వరుస ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు సౌకర్యాల కల్పనలో ఇతర శాఖల అధికారులను సమన్వ యం చేసుకుంటూ ఏర్పాట్లు చేయాలని మంత్రి సురేఖ ఇఒను ఆదే శించారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి లోటురాకూడదని మంత్రి ఆదేశించారు. దేదీప్య మానంగా బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి ఉత్స వాలను నిర్వహించాలని మంత్రి సురేఖ సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి కార్య దర్శి, ఆలంపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

**గోవర్ధనగిరిలో ఉపాధికూలీ మృతి ఘటనపై మంత్రి కొండా సురేఖ ఆరా**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని గోవర్ధనగిరిలో ఇద్దరు ఉపాధి హామీ కూలీలు తమ పనులలో నిమగ్నమై ఉండగా ప్రమాదవశాత్తు మరణించడంతో పాటు పలువురు గాయపడంపై మెదక్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరితో ఫోన్‌లో మాట్లాడి, దుర్ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఉపాధి హామీ పథకం కింద నిబంధనల ప్రకారం కూలీలకు అందించాల్సి న ఆర్థిక సహాయం, ఇతర సహకారాలపై కలెక్టర్‌తో మంత్రి సురేఖ చర్చించారు.

# ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ మూలసిద్ధాంతం

## వివేక్ వ్యతిరేకించడం పార్టీకి విరుద్ధం

## ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ మూల సిద్ధాంతం వివేక్ కానీ ఇంకెవరైనా వ్యతిరేకంగా మాట్లాడితే కాంగ్రెస్ పార్టీకి విరుద్ధంగా వ్యవ హరించడమే అని ఏఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఎలాంటి ఆందోళన చేయవద్దని విజ్ఞప్తి చేశారు. మాదిగ రిజర్వేషన్ ఎస్సీ వర్గీకరణపై వ్యతిరేకంగా ఎవరు మాట్లా డినా చర్యలు తప్పవు. వివేక్ మీటింగ్‌లు పెడుతున్నారని తెలిసిందని, అది మానుకోవాలని హితవు చెప్పారు. మాదిగల కోసం సిఎం రేవంత్‌రెడ్డి సుప్రీం కోర్టులో వాదనలు వినిపించిన ఏకైక ముఖ్యమంత్రి అని సంపత్ గుర్తు చేశారు. ఏకపక్ష కమిషన్ రిపోర్టు రాగానే తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. మాదిగ సమాజిక వర్గానికి న్యాయం చేస్తాం అని హరీష్‌రావు కేటీఆర్ అనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ఉషామెహ్రా కమిషన్ రిపోర్టును ఢిల్లీకి తీసుకోదాం అని నేను అసెంబ్లీలో అంటే పదేళ్ల బిఆర్ ఎస్ నాయకులు నోరు మెదపలేదని గుర్తుచేశారు. అసెంబ్లీలో ఇప్పటికే రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై ప్రకటన చేశారని గుర్తు చేశారు. వర్గీ కరణ అమలు దిశగా కేబినెట్ సబ్‌కమిటీ కూడా వేశారని చెప్పారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోనే ఎస్సీ వర్గీకరణ జరిగి తీరుతుందని తెలిపారు.



నర్సరీలో ఆధునిక వంగడాల గురించి తెలుసుకుంటున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు

# మిద్దె తోటలను ప్రమోట్ చేస్తున్నాం

## 17వ గ్రాండ్ నర్సరీ మేళాను ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 30, ప్రభాతవార్త:** పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు చెట్లు పెంచుకునేలా సబ్సిడీ అందిస్తూ ఈ ఏడాది నుంచి టెర్రస్ గార్డెన్‌లను ప్రమోట్ చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.గురువారం నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజా లో 17వ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా హార్టికల్చర్‌షో ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ ఆద్వర్యంలో హైదరాబాద్‌లో పెద్దఎత్తున రూఫ్ గార్డెన్స్‌ను ప్రోత్సహిస్తున్నామని ప్రకటించారు. ఏమాత్రం ఖాళీ స్థలం ఉన్నా కూరగాయలతోపాటు పచ్చదనంగా ఉండేలా మొక్కలు పెంచాలని మంత్రి పిలుపు నిచ్చారు. కాలుష్యం నుంచి ఉపశమనం పొందడానికి రూఫ్ గార్డెన్, వర్టికల్ గార్డెన్స్ ఇలా ఇంటి నిండా మొక్కలు పెంచుకోవాలనే ప్రజల ఆకాంక్షను చూస్తున్నామన్నారు. నర్సరీ ప్రేమికుల కోసం దేశ విదేశాల నుంచి అరుదైన మొక్కలు,విత్తనాలు తీసుకు వచ్చి ఒక వేదికగా నర్సరీ మేళాలో అందించడం అభినందనీయమన్నారు. నర్సరీ మేళా ఇంచార్జి ఖాలీద్ అహ్మద్ మాట్లాడుతూ నర్సరీ మేళాలలో దేశ విదేశాల నుంచి 150 స్టాల్స్ లో అందమైన పూల మొక్కలు తక్కువ ధరతో పాటు లక్షల రూపాయల ఖరీదైన మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

## బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికి సంక్షేమ పథకాలు అందజేయాలి అని బిజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు పరచడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాలో ఇల్లులేని పేదలు 1లక్ష 90వేల దరఖాస్తులు వస్తే నియోజకవర్గం నుండి సుమారు 70 వేలకుపైగా దరఖాస్తులు వస్తే కేవలం 3,500 ఇల్లు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. అర్హులను ఎలా గుర్తిస్తారు. దానికి సంబంధించిన పూర్తి ప్రణాలికను ప్రజలకు తెలియజేయాల్సి న అవసరం ఉంది. రేషన్‌కార్డు జారీలపై కూడా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



బిసి విద్యార్థుల సమర శంఖారావం సభలో అభివాదం చేస్తున్న అఖిలపక్ష పార్టీల నేతలు, బిసి సంఘాల నేతలు

## ఫీజు రీయిబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే

# సెక్రటేరియట్ ముట్టడిస్తాం

## బిసి విద్యార్థుల సమరభేరి సభలో అఖిలపక్ష పార్టీల, బిసి సంఘాల నేతల హెచ్చరిక

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జనవరి 30, ప్రభాతవార్త:** విద్యార్థుల త్యాగాలతో వచ్చిన రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వారికి అన్యాయం చేస్తోందని, పది రోజుల్లోగా విద్యార్థుల ఫీజు రీయిబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని అఖిల పక్షాల నేతలు, బీసీ సంఘాల నేతలు హెచ్చరించారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో, రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్‌యాదవ్ అధ్యక్షతన బీసీ విద్యార్థుల సమర శంఖారావం మహాసభ నిర్వహించారు. ఈ సమావేశానికి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రం గౌడ్ సమన్వయం చేయగా, బీజేపీ పార్లమెంట్ సభ్యుడు, మాజీమంత్రి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఫీజుల రీయింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వ దయాదాక్షిణ్యాలు కాదని, అది విద్యార్థుల హక్కని అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తూ, ఫీజుల బకాయిలు 4,600 కోట్లు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. మధుసూదనాచారి మాట్లాడుతూ విద్యార్థులకు ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఖర్చుగా భావించవద్దని, దానిని మానవ వనరుల అభివృద్ధి కోణంలో చూడాలని సూచించారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, యేడాది గడిచిపోయినప్పటికీ బీసీ ఎస్సీ, ఎస్టీ మైనారిటీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించటంలో విఫలమయిందని ఆరోపించారు. పదిరోజుల లోగా ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, లేనిపక్షం వేలాది మంది విద్యార్థులతో సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ విద్యార్థుల బలిదానాలతోనే తెలంగాణ రాష్ట్రం సాకారం అయిందని, అటువంటి విద్యార్థులను అక్కున చేర్చుకోవలసిన ప్రభుత్వం విద్యార్థుల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారని ఆరోపించారు.

# విలువలతో కూడిన విద్యను అందించాలి

## జడ్పీ పాఠశాల వార్షికోత్సవాల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 30, ప్రభాతవార్త:** విద్యార్థులకు ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యను అందించినప్పుడే సమాజ ప్రగతి సాధ్యమవుతుందని ఐటీ శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పోచారం మున్సిపాలిటీ ప్రతాప సింగారంలో జిల్లా పరిషత్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి శ్రీధర్ బాబు హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నామని అన్నారు. అనతికాలంగా విద్యావ్యవస్థలో గల లోపాలను గుర్తించామని వాటిని సవరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా ఎదగాలని అన్నారు. ప్రైవేటు విద్యలో ఇంటర్ విద్యార్థులే విద్యబోధనలు చేస్తారని అదే ప్రభుత్వ పాఠశాలలో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు బోధనలు చేస్తారని అన్నారు. పోటీ ప్రపంచంలో నైపుణ్యతతో కూడిన విద్యను ప్రభుత్వ పాఠశాలలో అందించడానికి ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. భవిష్యత్తు అంతా చదువుకున్న యువతదేనని విద్య ద్వారానే ఉన్నత ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయని అన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ దేశంలో అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని వారిని ప్రోత్సహించాల్సి న బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని సంప్రదాయం స్త్రీని పూజించేది భారతదేశం ఒక్కటేనని అన్నారు. సమాజ ప్రగతికి మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని తెలిపారు. అప్పట్లో సరియైన వసతులు లేకున్నా పట్టుదలతో శ్రమించి విద్యనభ్యసించినట్లు తెలిపారు. భవిష్యత్తును బంగారుమయం చేసుకోవడానికి కష్టపడి ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అభ్యసించాలని అన్నారు. ఇంకా ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ పాఠశాల వార్షిక నివేదికను చదివి వినిపిం చారు. అంతకు ముందు వేదికపై పాఠశాల విద్యా ర్థులచే ప్రదర్శిం చబడిన సంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డి అధ్యక్ష తన జరిగిన కార్యక్రమంలో మంత్రితో పాటు ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు సిహెచ్. మల్లారెడ్డి, యశస్వినీరెడ్డి, మఖన్ సింగ్ ఠాగూర్, డీఈవో విజయకుమారి, తహ సీల్దార్ రజిని, విద్యాశాఖ డైరక్టర్లు నర్సింహ రెడ్డి, రమేశ్‌లు, మాజీ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీలు వై. సుదర్శన్ రెడ్డి, బండారి శ్రీనివాస్ గౌడ్, పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జీ తోటకూర వజ్రేశ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల మహేశ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు కందుల కుమార్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రతాప సింగారంలో జరిగిన జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవాల్లో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



వివిధ రాష్ట్రాల బిసి ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య తదితరులు

# బిసిలకు 2 లక్షల కోట్ల బడ్జెట్‌తో సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త :** బీసీలకు 2 లక్షల కోట్ల బడ్జెట్తో బీసీ సబ్ ప్లాను ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు పార్లమెంట్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీ, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, మహిళ విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి సుగుణవతి ఆధ్వర్యంలో గురువారం కాచిగూడలో వివిధ రాష్ట్రాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం మహిళ విభాగం జాతీయ ప్రధానకార్యదర్శిగా చెరుకుల సుగుణవతిని నియమిస్తూ నియామకపత్రాన్ని ఆర్ కృష్ణయ్య అందజేశారు. ఓబీసీ జాతీయ సెమినార్లు నిర్వహించాలని కోరుతూ ఫిబ్రవరి 6,7 తేదీలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, అసోం, పంజాబ్ తదితర రాష్ట్రాల నుండి వేలాది మందితో చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ముఖ్యఅతిధిగా ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ బీసీలకు రాజ్యంగా బద్ధంగా విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో న్యాయం జరడంలేదని, దేశంలోని బీసీలకు రావాల్సి న హక్కులను కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం అణిచివేస్తుందన్నారు.

# ఉపాధి హామీ కూలీకి వెళ్లిన తల్లీ, కూతురు దుర్మరణం

## గోవర్ధనగిరిలో విషాదం

**అక్కన్నపేట, జనవరి 30, ప్రభాతవార్త:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని గోవర్ధనగిరిలో గురువారం తీవ్రవిషాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఉదయం ఉపాధి హామీ కూలీకి వెళ్లిన తల్లి, కూతురు కందారపు సరోజన (45), అన్నాజీ మమత (28) మాదిరిగానే ఇంట్లో నుండి ఉదయం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీపనికి వెళ్లారు. సంజీవయ్యగుట్ట నుండి వ్యవసాయదారుల బావులకు వెళ్లేందుకు జరుగుతున్న పనులు లోతులో జరుగుతుండడంతో పైనుండి పెద్దపెద్ద బండ రాల్లు ఒక్కసారిగా కింద పనిచేస్తున్న వారిపై పడడంతో తల్లి, కూతురు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు మహిళా కూలీలు రేణుక, స్వరూప సహా ఐదుగురికి గాయాలైనట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు చనిపోయిన తల్లి, కూతుళ్లను బండ రాళ్ల కింద నుండి అతికష్టం మీద జెసిబి సహాయంతో బయటకు తీశారు. కాళ్లు విరిగిన రేణుక, స్వరూపలను 108లో హుస్నా బాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న హుస్నాబాద్ ఎసిపి వాసాల సతీష్, సిఐ కొండ్ర శ్రీనివాస్, ఎస్ఐ విజయ్‌భాస్కర్‌లు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేసి కేసు నమోదు చేసుకున్నారు.

**ఇద్దరి మృతి ఘటనపై మంత్రుల దిగ్భ్రాంతి**

మండలంలోని గోవర్ధన గిరిలో ఉపాధి హామీ పనుల్లో ఇద్దరు కూలీలు మృతి చెందిన విషయం పట్ల మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండ సురేఖ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులతో పాటు ఆర్డీవోను ఘటనా స్థలానికి వెళ్లాలని ఆదేశిం చారు. జరిగిన ప్రమాదం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు సంభవించే ప్రదేశాల్లో పనులు చేయించవద్దని జిల్లా అధికారులకు వారం క్రితమే అధికారులను మంత్రి సీతక్క చెప్పినా.. పనులు చేయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిగిన ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు. మరణించిన, ప్రమాదానికి గురైన కూలీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రులు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై మంత్రి కొండ సురేఖ జిల్లా కలెక్టర్ మనుచౌరికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మృతులకు అందిం చాల్సి న నష్టపరిహారం త్వరగా అందేలా చూడడంతోపాటు గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని, ఎంజిఎంలో చికిత్స పొందు తున్న మహిళ భర్తకు ఆహారం, వసతి ఇతర సౌకరాలు కల్పించాలని సూచించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎసిపి వాసాల సతీష్



## మూడున్నర రోజుల్లోనే అయోధ్యకు 65 లక్షల మంది భక్తులు

**అయోధ్య, జనవరి 30:** మౌని అమావాస్యసందర్భంగా కుంభమేళాకు కోట్లాదిమంది భక్తులు పోటెత్తుతున్నారు. అక్కడ పుణ్యస్నానాలుచేసిన తర్వాత అయోధ్యవైపు ఎక్కువమంది వెళుతున్నారు. దీనితో రాత్రికిరాత్రే నగర వీధులన్నీ క్రిక్కిరిసిపోయాయి. అప్రమత్తం అయిన ప్రభుత్వం భక్తుల రద్దీని నియంత్రించేందుకు కేంద్ర బలగాలనురంగంలోకి దించింది. బాలరాముడిని దర్శించుకునేందుకు కేవలం96 గంటల్లోనే65 లక్షలమంది అయోధ్యనగరానికి వచ్చినట్లుయుపి సర్కారు తెలిపింది. మరోవైపు కుంభమేళాకు భారీ సంఖ్యలోభక్తులు వస్తున్నారు. కేవలంమౌని అమావాస్యరోజే దాదాపు ఎనిమిదినుంచి 10 కోట్లమంది వచ్చినట్లు అంచనా. ఆ తర్వాత భక్తులు అయోధ్యదర్శనానికి వెళ్లడంతో నగరవీధులన్నీ రాత్రికిరాత్రే నిండిపోయాయి. గోండా, అంబేద్కర్‌నగర్, సుల్తాన్‌పూర్,లక్నో రోడ్లవద్ద రద్దీని నియంత్రిస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఎపి, తెలంగాణ,గోవా మహారాష్ట్రతోపాటు గుజరాత్‌లనుంచి అయోధ్యదర్శనానికి ఎకునకవమంది వస్తున్నట్లు అయోధ్య డివిజనల్‌కమిషనర్ గౌరవ్‌దయాల్ వెల్లడించారు. నిత్యం సుమారు 3 లక్షలమందికిపైగా దర్శించుకుంటున్నారని రద్దీ నేపథ్యంలో దర్శన సమయాన్ని 18 గంటలకు పెంచినట్లు తెలిపారు.

## పిజి మెడికల్ సీట్లలో స్థానిక రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి

### మాజీ మంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 30:** పీజీ మెడికల్ సీట్ల రిజర్వేషన్ల విషయంలో 50శాతం లోకల్ రిజర్వేషన్ వర్తించదని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణతో పాటు, దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉందని బిఆర్ఎస్ సీనియర్ నేత,సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల్లో అగ్రగామి ఉన్న తెలంగాణలో, ఈ తీర్పు వల్ల స్థానిక విద్యార్థులు వైద్య విద్య చదివే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు.ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2025 నాటికి తెలంగాణలో 2,924 పీజీ సీట్లలో 50శాతం లోకల్ రిజర్వేషన్ ప్రకారం 1462 సీట్లు తెలంగాణ ప్రాంత విద్యార్థులకు వచ్చేవని, తాజాగా సుప్రీంకోర్టు తీర్పుతో ఈ 1,462 సీట్లు కూడా ఆల్ ఇండియా కోటాలోకి వెళ్లిపోతాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఉంటూ మెడికల్ పీజీ చదువుకోవాలనుకునే విద్యార్థులకు ఇది శరాఘాతంగా మారిందని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళ,ఏపీ విద్యార్థులు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కోబోతున్నారని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు కాన్‌స్టిట్యూషనల్ బెంచ్‌కు వెళ్లాలని తీర్పుపై స్టే తీసుకురావాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

## రాష్ట్రంలో రూ.2 వేల కోట్లకు చేరిన పశు సంపద సంఖ్య

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పశు సంపద గణనీయంగా వృది సాధించింది. ఫలితంగా తెలంగాణలో ప్రస్తుతం ఉన్న పశు సంపద విలువ 2 వేల కోట్ల రూపాయలకు పెరిగిందని కేంద్ర గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ మేరకు విడుదల చేసిన ఒక నివేదికలో వీటి వివరాలను తెలియచేసింది.నపశు సంపద, గుడ్లు, మాంసం, పాలు ఉత్పత్తులకు సంబంధించిన గణాంకాలను ఈ నివేదికలో పొందుపరచింది. మాంసం, గుడ్లు, పాలు తదితర ఉత్పత్తుల్లో తెలంగాణ మంచి వృద్ధి రికార్డయిందని వెల్లడించింది. 2022-23 నాటికి రాష్ట్రంలో పశు సంపద విలువ 4,789.09 కోట్ల రూపాయలుగా నమోదైంది. అయితే రాష్ట్రం ఏర్పాటైన 2014-15లో ఇది 2,824.57 కోట్ల రూపాయలు మాత్రమే ఉందని, ఇది దాదాపు రెట్టింపు అయిందని వివరించింది. అలాగే గుడ్ల ఉత్పత్తిలో 228.97 కోట్ల రూపాయల విలువైన ఉత్పత్తి జరగ్గా, అది 381.04 కోట్ల రూపాయలకు చేరింది. ఇక అన్ని రకాల మాంసం ఉత్తుల విలువకు సంబంధించి 1,484.05 కోట్ల రూపాయలు కాగా, అది ఏకంగా 5,531.85 కోట్ల రూపాయల విలువకు చేరింది. అయితే పశు సంపద గణీయంగా పెరిగినప్పటికీ పాల ఉత్పత్తిలో మరింత వృద్ధిని సాధించాల్సి ఉందని తెలిపింది. రాష్ట్రం ఏర్పాటు అయ్యే నాటికి తెలంగాణలో పాల ఉత్పత్తి విలువ 1.350.69 కోట్ల రూపాయలు కాగా, అది 1,874.28 కోట్ల రూపాయలకు చేరుకుందని కేంద్రం వెల్లడించింది.

## అధికారం కోల్పోయి కడుపు మంటతో రైతులను రెచ్చగొడుతున్నారు

### వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విసుర్లు

**హైదరాబాద్, జనవరి 30,ప్రభాతవార్త:** అధికారం కోల్పోయి కడుపు మంటతో నేడు రైతులను రెచ్చగొట్టడానికి బిఆర్ఎస్ నాయకులు ఎత్తులు వేస్తున్నారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆరోపించారు. సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ నేడు కమిటీల పేరుతో బిఆర్ఎస్ చేసే శవ రాజకీయాలకు తెలంగాణ రైతాంగం మోసపోయే పరిస్థితిలో లేరని అన్నారు. ఎరువుల కోసం రైతులు లైన్లో నిలబడి గుండెపోటుతో మరణిస్తే సినిమా టికెట్ల కోసమైతే లైన్లో నిలబడలేరా ఇది అంతకన్నా కష్టమా అని మాట్లాడిన మీరు.. నేడు వేదాలు వల్లించడం హాస్యాస్పదం అని ఎద్దేవా చేశారు.. కేసీఆర్ ప్రభుత్వం ఆనాడు చేసిన లక్ష రుణమాఫీ మిత్తికే సరిపోయిందని తెలిపారు. తీసుకున్న ఆ అప్పు బ్యాంకుల్లో అలాగే ఉంది అని గుర్తుచేశారు. రైతుబంధు ఇస్తున్నామనే నెపంతో రైతులకు ఇచ్చే రాయితీలు ఎత్తివేశారని ఆరోపించారు.

## హామీలన్నీ అమలు చేస్తున్న ప్రభుత్వం

### పిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్

**హైదరాబాద్,జనవరి 30,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏఒక్కటి కూడా అమలు కాలేదని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ మాట్లాడటం ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాల్ని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు పోతున్నారన్నారు.

ప్రతి వ్యక్తి అకౌంట్లో 15 లక్షల బ్లాక్ మనీ తెప్పించి వేస్తా అన్న మీ మోడీ హామీ ఏమైంది ? ఏటా కోటి మందికి ఉద్యోగాలిస్తామన్నారు, పదేళ్ల కాలం సరిపోలేదా? అని ఆయన ప్రశ్నించారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన భారతదేశంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందడం తప్ప, బీజేపీ దేశానికి చేసిందేమీ లేదన్నారు. పేదలకు అందుబాటులో ఉండాలని స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ ఆనాడు బ్యాంకులను జాతీయం చేశారని బండి సుధాకర్ గుర్తు చేశారు. కానీ ఈరోజు మోడీ అనాలోచితంగా బ్యాంకులను విలీనం చేసి, ఆ రంగాన్ని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. కేంద్ర పెద్దల మిత్రులకు దాదాపు 18 లక్షల కోట్లు మాఫీ చేసింది వాస్తవం కాదా? బీజేపీ నాయకులే సమాధానం చెప్పాలన్నారు.తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉచిత బస్సు ప్రయాణం కింద 136 కోట్ల మంది మహిళలు లబ్ధి పొందగా, ఇందుకోసం ప్రభుత్వం 4500 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు.

# కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపైనే కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ ఫోకస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 30:** రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో తెలంగాణ రాష్ట్రంలో ఒక్కసారిగా పొలిటికల్ హీటెక్కింది. రాష్ట్రంలోని రాజకీయ ప్రధాన పార్టీలు కరీంనగర్ గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపై ఫోకస్ పెట్టారు. ఈ గ్రాడ్యుయేట్ ఎన్నిక మూడు పార్టీలకు ఇప్పుడు కీలకంగా మారింది. మూడు పార్టీల్లో ఆ స్థానంలో గెలవడానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తున్నాయి. కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పరిధిలోకి ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలు వస్తాయి. ఇక్కడ పోయినసారి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలిచారు. దీంతో ఈసారి కూడా గెలివాలని హస్తం పార్టీ ఉవ్విళ్లురుతోంది. బీఆర్ఎస్ ఇంకా పార్టీ అభ్యర్థిని ప్రకటించలేదు. ఇప్పటివరకు ఒక్క బీజేపీ మాత్రమే అభ్యర్థిని ప్రకటించింది. కాంగ్రెస్ మూడు, నాలుగు రోజుల్లో పార్టీ అభ్యర్థి పేరును ప్రకటించనుంది. అభ్యర్థిని ప్రకటించడానికి కాంగ్రెస్ అధిష్టానం పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో చర్చలు జరుపుతోంది. దీంతో మూడు పార్టీలు ఈ ఎన్నికను కీలకంగా తీసుకున్నాయి. అన్ని పార్టీల్లోని కీలక నేతలు కరీంనగర్ గ్రాడ్యుయేట్ నియోజక పరిధలోనే ఉన్నారు. ఈ నియోజకవర్గంలోనే టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉన్నారు. ఆయన పీసీసీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఇక్కడ ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో ఉన్నారు. ఇప్పటి నుంచే పార్టీ కార్యకర్తలు, నాయకులను ఆయన చురుకుగా ప్రజల్లోకి ఆదేశిస్తున్నట్లు తెలుస్తోంది. రేవంత్ సర్కార్ వచ్చాక ఉద్యోగాల ప్రక్రియలో కూడా ఎలాంటి అవకతవకలు లేకుండా కట్టుదిట్టంగా పరీక్షలో నిర్వహించింది. కాకపోతే గత ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు.

ఇది కొంత కాంగ్రెస్ పార్టీకి మైనస్‌గా మారవచ్చు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి సరిగ్గా అమలు చేస్తే గ్రాడ్యుయేట్లు కాంగ్రెస్ వైపే మొగ్గు చూపే అవకాశం ఉంది.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి హరీష్ రావు ఇలా కీలక నేతలందరూ ఈ నియోజకవర్గంలోనే ఉన్నారు. తమకు మంచి పట్టు ఉన్న నియోజకవర్గం కావడంతో పోటీ చేస్తే గెలవచ్చు బీఆర్ఎస్ అంచనా వేస్తుంది. కాకపోతే పోటీ చేయాలా..? వద్దా..? అని యోచనలో బీఆర్ఎస్ ఉన్నట్లు సమాచారం. ఇక ఒకప్పుడు ఉత్తర తెలంగాణ పెద్దగా పట్టులేని బీజేపీ ఒక్కసారిగా పుంజుకుంది. ఒకప్పుడు హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైన కమలం ఇప్పుడు ఉత్తర తెలంగాణ పట్టు సాధించింది. ఇక్కడ నుంచే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, నలుగురు ఎంపీలు కూడా ఉన్నారు. పార్టీకున్న ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో ఏడుగురు ఈ జిల్లాల్లోనే ఉన్నారు. ఈ బలంతోనే బీజేపీ ఎలాగైనా కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలో గెలిచి రాష్ట్రంలో కమలం పార్టీని వ్యాపంపజేయాలని చూస్తోంది. ఇప్పటి నుంచి బీజేపీ గ్రామాల్లో యువతను పార్టీలో చేర్చుకునే పనిలోపడింది. మొత్తానికి ఇప్పుడు ప్రధాన పార్టీలు కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపైనే గురిపెట్టాయి.

## వర్గీకరణ అమలు చేస్తానన్న సిఎం మాట నిలుపుకోవాలి

### ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త :** పార్టీలోని రెండు మాల కుటుంబాల మాటలు విని, కొట్లాడి తెచ్చుకున్న ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం చేస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఆయన చేతుల మీదుగా ఫిబ్రవరి 7న లక్షల డప్పులు వేల గొంతులు సాంస్కృతిక ర్యాలీ పోస్టర్, నూతన సంవత్సర డైరీ ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మన బిడ్డల భావితరాల భవిష్యత్తు కొరకు ఆలోచించే ప్రతి ఒక్కరూ వర్గీకరణ అమలుకై ఫిబ్రవరి 7వ తేదీన జరిగే లక్షల డబ్బులు.. వేల గొంతికలు... సాంస్కృతిక కార్యక్రమానికి మాదిగ, ఉప కులాలు సంక డప్పు వేసుకొని, వర్గీకరణ కోరుకుంటున్న కుల, మత, ప్రజాసంఘాలు, కళాకారులు, కవులు సంఘీభావంగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదట అమలు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తెలుపుకోవాలి అన్నారు. కొట్లాడి తెచ్చుకున్న ఎస్సీ వర్గీకరణ అమలు దశలో కొంతమంది మాల స్వార్ధపరులు అడ్డుకుంటున్నారన్నారు. వర్గీకరణ న్యాయ మేంటి మండని దేశ వ్యాప్తంగా మాలల్లో కొంత మంది స్వార్ధపరులు తప్ప కోట్లాది ప్రజలు వర్గీకరణకు మద్దతుగా సంఘీ భావం తెలి పారన్నారు. ఎస్సీ వర్గీకరణకు ఫిబ్రవరి 7 జరగబోయే సాంస్కృతిక ప్రదర్శన అతి పెద్ద ప్రదర్శన కానున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు.

వర్గీకరణ అమలు చేస్తానని మాట ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు వర్గీకరణకు అనుకూలం ఉన్నారని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టిలో ఉందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో సుప్రీంకోర్టు తీర్పు అనంతరం పలు రాష్ట్రాల్లో ఇప్పటికే అమలవుతుందని తెలిపారు. మొట్టమొదట సారిగా తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు అమలు చేయకూడ జాప్యం చేస్తూ మాకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీలో రెండు మాల కుటుంబాల ఆధిపత్యం ఉందని, వారి మాటలు విని వర్గీకరణ కాకుండా అడ్డుకుంటున్నారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ తీరును ఆ రెండు మాల కుటుంబాల అడ్డుపడుతున్న తీరు ప్రజలు గమనిస్తు న్నారని, రానున్న ఎన్నికల్లో ఆ రెండు కుటుంబాలు కచ్చితంగా భూస్థాపితం చేస్తామన్నారు.



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం లక్షల డప్పులు- వేల గొంతులు సాంస్కృతిక ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

## సుప్రీంకోర్టు తీర్పుతో తెలంగాణ విద్యార్థులకు పిజి మెడికల్ సీట్లలో నష్టం

### జాతీయస్థాయిలోనే పోటీ పడాల్సి ఉంటుంది

### సుప్రీంతీర్పుతో 1,462 స్థానిక కోటా సీట్లు కూడా నేషనల్ పూల్‌కే!

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పీజీ మెడికల్ సీట్ల భర్తీ అంశంపై సుప్రీంకోర్టు తీర్పుతో తెలంగాణ స్థానిక విద్యార్థులకు నష్టం జరగనుంది. పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా ఉండదని.. స్పెషలైజ్డ్ కోర్సులో చేరేటప్పుడు.. అదీ జాతీయస్థాయిలో ప్రవేశ పరీక్షను నిర్వహించినప్పుడు వాటిని అమలు చేయడం సరికాదని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. పీజీ మెడికల్ సీట్ల రిజర్వేషన్ల విషయంలో 50 శాతం లోకల్ రిజర్వేషన్ వర్తించదని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో తెలంగాణతోపాటు దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు కూడా నష్టం జరగనుంది. మెడికల్ కాలేజీలు ఎక్కువగా ఉన్న తెలంగాణలో సుప్రీం తీర్పు వల్ల స్థానిక విద్యార్థులు పీజీ వైద్య విద్య చదివే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత దాదాపు జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. దీంతో 2014 వరకు రాష్ట్రంలో ఐదే ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉండగా.. ప్రస్తుతం అదికాస్త 34కి చేరింది. ప్రతి లక్ష జనాభాకు 19 ఎంబీబీఎస్ సీట్లతో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. పీజీ సీట్లలో దేశంలో రెండో స్థానంలో ఉంది. ప్రస్తుతం తెలంగాణలో 2924 పీజీ సీట్లు ఉండగా వాటిలో 50శాతం లోకల్ రిజర్వేషన్ ప్రకారం 1462 పీజీ సీట్లు తెలంగాణ ప్రాంత విద్యార్థులకు దక్కేవి. అయితే ఇప్పుడు సుప్రీం కోర్టు తీర్పు మూలంగా ఈ 1462 సీట్లు కూడా ఆల్ ఇండియా కోటాలోకే వెళ్లనున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న 100 శాతం సీట్లు నేషనల్ పూల్‌కే వెళ్లడంతో.. తెలంగాణలో ఉంటూ పీజీ మెడికల్ విద్యను చదువుకోవాలనుకునే వారికి నష్టం జరగనుంది. అయితే సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనే అంశంపై ఇటు పీజీ విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఆతృతతో ఎదురు చూస్తున్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### బిజెపి ఎంపి డా.లక్ష్మణ్

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తి వైఫల్యం చెందిదని రాజ్యసభ సభ్యుడు, బిజెపి ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతున్నామని కాంగ్రెస్ నేతలే స్వయంగా ఒప్పుకోవడం, రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనానికి, అసమర్థతకు ప్రత్యక్ష నిదర్శనమని ఎద్దేవా చేశారు. గురువారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. రాష్ట్రంలో మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతను స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే అంగీకరించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు ఇది అద్దం పడుతోందన్నారు. కాంగ్రెస్ మోసానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిందని మండిపడ్డారు. తెలంగాణలోనే కాదు, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లలోనూ కాంగ్రెస్ మోసం చేసిందని తెలిపారు. కాంగ్రెస్ గ్యారంటీలంటే దగా, మోసమని ప్రజలు గ్రహించి హర్యానాలో ప్రజలు కాంగ్రెస్‌కు కర్రుగాల్చి వాతపెట్టారు.. మహారాష్ట్రలో కాంగ్రెస్‌ను ముంచేశారన్నారు. ఇప్పుడు ఢిల్లీలో దిక్కులేకుండా పోయేలా, డిపాజిట్లు గల్లంతయ్యేలా తీర్పు ఇవ్వబోతున్నారంటూ ధీమా వ్యక్తం చేశారు.

ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టడానికి 6 గ్యారంటీలు, 66 హామీలు, 420 వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తుంగలో తొక్కిందని ఫైరయ్యారు. తెలంగాణలో రిటైర్ట్ ఉద్యోగులు తమ బెనిఫిట్స్ కోసం ఆఫీసుల చుట్టూ తిప్పించుకుంటూ బిల్లులను చెల్లించకుండా పెండింగులో పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్రాంత ఉద్యోగులకు జిపిఎఫ్, గ్రాట్యుటీ, కమ్యూటేషన్ బిల్లులు చెల్లించడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కోర్టు నోటీసులను కూడా పట్టించుకోకుండా బేఖాతరు చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత వల్ల విశ్రాంత ఉద్యోగులు తమ బిల్లుల కోసం తిప్పలపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా కాంగ్రెస్ పార్టీ బిసిలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బ్రేకులు వేయకపోతే, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించి బుద్ధిచెప్పకుంటే ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులను మరిన్ని తిప్పలు పెడుతుందని ప్రజలను అప్రమత్తం చేశారు.

## డెయిరీ కాలేజీలో సమస్యల తిష్ట

### అంతంత మాత్రంగా ఇంజినీరింగ్ స్టాఫ్

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఏకైక డెయిరీ కాలేజీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. వెటర్నరీ యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న ఈ కాలేజీకి ప్రధానంగా సిబ్బంది లేక సతమతమవుతోంది. ఇందులో ఇంజనీరింగ్‌లో మిగిలిన కోర్సులకు సమానంగా బీటెక్ డెయిరీ నాలుగేళ్ల కోర్సుగా నిర్వహిస్తున్నారు. ఇందులో 40 సీటులన ఉండగా, వీటిలో 35 సీట్లు ఎంసెట్ కౌన్సిలింగ్ ద్వారాను, మరో 5 సీట్లు ఐసీఆర్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేస్తారు. ఎంసెట్ కోటాలో రైతుల పిల్లలకు రిజర్వేషన్ కూడా ఉంది.

గతంలో ఈ కాలేజీలో పూర్తి స్థాయిలో సీట్లు భర్తీ అయినప్పటికీ ప్రస్తుతం 25 నుండి 30 సీట్లు మాత్రమే నిండుతున్నాయి. ఈ డెయిరీ కాలేజీలో 35 మంది టీచింగ్ స్టాఫ్ ఉండగా, ప్రస్తుతం 10 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ముగ్గురు రెగ్యులర్ కాగా, మిగిలిన వారు కాంట్రాక్ట్ పద్దతిలో పని చేస్తున్నారు. అయితే విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్, ఇతర రంగాల్లో రాణించేందుకు మరింత మంది మెరుగై బోధన కోసం పూర్తి స్థాయిలో టీచింగ్ స్టాఫ్ అవసరం. డిగ్రీ కాలేజీలో బీఎస్సీ డెయిరీ కోర్సును బోధించే వారే బీటెక్ డెయిరీలోనూ క్లాసులు చెబుతున్నారు.

## జిహెచ్‌ఎంసి బడ్జెట్ రూ.8,440 కోట్లు

### చర్చ లేకుండానే కౌన్సిల్ ఆమోదం

**హైదరాబాద్, జనవరి 30,ప్రభాతవార్త:** జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం రసనాభాసగా సాగింది. 20025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ఆమోదంపై కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయగా ముందు గా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, రతన్ టాటాకు కౌన్సిల్ నివాళులు అర్పించింది. అనంతరం మేయర్ విజయలక్ష్మీ సభలో బడ్జెట్ ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. సీఎం వ్యాఖ్యలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ మేయర్ పోడియాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. వారికి కాంగ్రెస్ కార్పొరేటర్లు అడ్డుకుని, ప్లకార్డులు చింపేశారు. దీంతో ఇరు పార్టీల కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో సభలో ఎలాంటి చర్చలు లేకుండానే 8.440 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం



నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ సభ్యులను మేయర్ విజయలక్ష్మీ సస్పెండ్ చేయగా వారిని అరెస్ట్ చేసి రాం గోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో బిఆర్ఎస్ కార్పొరేటర్ల అరెస్ట్‌పై మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు స్పందించారు. ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే సస్పెండ్ చేయడమేంటని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నామని అడ్డగోలుగా ప్రవర్తిస్తే సహించేది లేదని హెచ్చరించారు.


## సత్యం, అహింస, శాంతిమార్గాలను ఆదర్శంగా తీసుకోవాలి

### మహాత్మాగాంధీకి ఘనంగా నివాళులర్పించిన మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మగాంధీకి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఘనంగా నివాళులర్పించారు. గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. మహాత్ముడు చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని గాంధీ చెప్పిన మాటలను మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యమైన జీవనశైలి అలవర్చుకోవాలని మంత్రి సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశ చరిత్రలో అత్యంత ప్రముఖమైన ఆస్పత్రుల్లో ఒకటిగా ఉన్న ఉస్మానియా హాస్పిటల్ కోసం కొత్త భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు. నేడు (శుక్రవారం) కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసుకోబోతున్నామని తెలిపారు.

### నూతన భవన నిర్మాణంపై తెలంగాణ వైద్యుల సంఘం హర్షం

ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనం నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమని తెలంగాణ వైద్యుల సంఘం ఉస్మానియా విభాగం తెలిపింది. తెలంగాణ వైద్యుల సంఘం.. ఉస్మానియా విభాగం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు వైద్య, ఆరోగ్య శాఖామంత్రి దామోదర రాజనర్సింహకి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తూ.. కృతజ్ఞతలు తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనం కొరకు గత కొన్ని సంవత్సరములుగా కృషి చేసిన ప్రభుత్వ వైద్యులకు.. వైద్యుల సంఘానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపింది.




## నాలుగేళ్ల బాలుడికి హెచ్‌ఎంపివి వైరస్

**అహ్మదాబాద్, జనవరి 30:** రాష్ట్రంలోనాలుగేళ్లబాలుడికి హెచ్‌ంపివి వైరస్ సోకింది. ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం బాలుడిపరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. గుజరాత్‌లో ఈబాలుడితోపాటు మొత్తం 8కి హెచ్‌ంపివికేసులు పెరిగాయి. ఈనెల 28న అహ్మదాబాద్‌లోన గోటాప్రాంతానికి చెందిన నాలుగేళ్ల బాలుడు జ్వరం, దగ్గుతో బాధపడ్డాడు. ఎస్‌జివిపి ఆసుపత్రిలో అడ్మిట్‌కావడంతో వైద్యపరీక్షలునిర్వహించారు. దీనితో ఆ బాలుడికి హెచ్‌ఎంపివి సోకిందని అదేరోజున నిర్ధారించినట్లు అహ్మదాబాద్ మున్సిపల్‌కార్పొరేషన్ అధికారులతు తెలిపారు. ఆ బాలుడు ఇటీవల విదేశాల్లో పర్యటించాడని తెలిసింది. అయితే గుజరాత్‌లో ఇప్పటివరకూ 8 హెచ్‌ఎంపివికేసులునమోదయ్యాయి. అహ్మదాబాద్‌లో ఏడు, సబర్కాంత జిల్లాలో ఒకటి కేసులు వెలుగులోకి వచ్చాయి. అహ్మదాబాద్‌లోని ఆసుపత్రుల్లో చేరిన ఆరుగురు రోగులను పూర్తిగా కోలుకున్న తర్వాత డిశ్చార్జిచేసామని అధికారులు తెలిపారు.

## ఒసి వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడాలి

### ముఖ్యమంత్రికి రవీందర్‌రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** ఓసి వర్గాలలోని ఈడబ్లుఎస్ రిజర్వేషన్‌లపై కొందరు బిసి మహా మేధావులు చేస్తున్న తప్పుడు ప్రచారంపై తక్షణమే చర్యలు తీసుకుని ఓసి కులాల ఆత్మగౌరవాన్ని కాపాడాలని ఓబిసి జాతీయ అధ్యక్షులు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. పేదరికి అనేది ఒక కులం, ఒక మతం , ప్రాంతానికి పరిమితం కాదన్నారు. అన్ని కులాలలో ధనికలు, పేదలు ఉంటారని సిఎంకు విజ్ఞప్తి చేశారు. కులాలకు అతీతంగా ఈబిసి సంఘం స్థాపించి పోరాటాలు చేయడం జరిగిందన్నారు. జానాభాలో నాలుగవంతు ఉన్న ఓసి కులాలను తక్కువ చేసి చూపిస్తూ ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడుతున్న వారిని కట్టడి చేయాలన్నారు.

## 60 యేళ్లు దాటినా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను కొనసాగించండి

### వర్సిటీ రిజిస్ట్రార్లకు లేఖ రాసిన కళాశాల విద్యా కమిషనర్

**హైదరాబాద్,జనవరి 30,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లను 60 సంవత్సరాలు దాటినప్పటికీ కొనసాగించాలని పేర్కొంటూ కళాశాల విద్య కమిషనర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్లకు ఈ నెల 29న లేఖ రాశారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో సుమారు 1100 మంది వరకు కాంట్రాక్ట్ విధానంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు కొనసాగుతున్నారు. వారిలో 60 సంవత్సరాలు నిండినప్పటికీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు యధావిధిగా కొనసాగించాలని పేర్కొంటూ కళశాళ విద్య కమిషనర్ ఈ నెల 29న లెటర్ నంబర్ 01-సీసీఈ అండ్ సీటీఈ-పేషీ-2025 పేరుతో ఓయూ, కేయూ, మహాత్మాగాంధీ, తెలంగాణ,పాలమూరు, శాతవాహన, తెలుగు యూనివర్సిటీ, జేఎన్‌టీయూ, జేఎన్ఏఎఫ్ఏయూ, డాక్టర్‌బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, ఆర్‌జీయుకేటీల రిజిస్ట్రార్లకు లేఖలు రాశారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి గతంలో రాసిన లేఖ ప్రతిని పేర్కొంటూ ఈ ఉత్తర్వులను జారీ చేశారు. అయితే కళాశాల విద్య కమిషనర్‌కి యూనివర్సిటీ రిజిస్ట్రార్లను ఆదేశించి అధికారం నిబంధనల ప్రకారం ఉండని యూనివర్సిటీల్లోని ప్రొఫెసర్లు చెబుతున్నారు. ఇటువంటి ఆర్డర్ ఇవ్వాల్సి వస్తే విద్యా శాఖ కార్యదర్శి, ముఖ్యకార్యదర్శి ఇవ్వాల్సి ఉంటుంది తప్ప.. కళాశాల విద్య కమిషనర్ ఇచ్చే అధికారం ఉండదని పేర్కొంటున్నారు. యూనివర్సిటీల్లో రెగ్యులర్ పోస్టులోలన పనిచేస్తున్న అసిస్టెంట్, నఅసోసియేట్ ప్రొఫెసర్లతో పాటు.. ప్రొఫెసర్లు తమకు 60 సంవత్సరాలు రిటైర్‌మెంట్ ప్రకటిస్తుండగా.. కాంట్రాక్ట్ విధానంలోని వారిని 60 సంవత్సరాలు నిండిన తరువాత కూడా కొనసాగించాలనడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాత్రం తమకు అనుకూలంగా 60యేళ్లు నిండాక కూడా కొనసాగించాలని కళాశాల విద్య కమిషనర్ వర్సిటీ రిజిస్ట్రార్లకు రాసిన లేఖపై హర్షం ప్రకటిస్తూ.. కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## మేగోటి డైరెక్షన్‌లో 'వరలక్ష్మి శరత్‌కుమార్'

సీనియర్ నటుడు శరత్‌కుమార్ కూతురిగా వెండితెరకు పరిచయమైనా, తన వైవిధ్యమైన నటన, విలన్ పాత్రలతో ఆకట్టుకుంటోంది వరలక్ష్మి. నటిగా సౌతిండియా భాషల్లో తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుని దూసుకుపోతోంది. ఈ క్రమంలో ఆదిపర్వం మూవీ డైరెక్టర్ సంజీవ్ మేగోటి దర్శత్వంలో ఓ తెలుగు సినిమా చేయబోతున్నట్టు సమాచారం. సంజీవ్ మేగోటి రాసుకున్న సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ సబ్జెక్టు కోసం వరలక్ష్మి శరత్ కుమార్ ఓకే చెప్పినట్టు తెలుస్తోంది. ఇందులో వరలక్ష్మి శరత్ కుమార్ మెయిన్ లీడ్‌పాత్ర చేయనుంది. భారీ బడ్జెట్‌తో డైరెక్టర్ సంజీవ్ మేగోటి తెరకెక్కించనున్న ఈ సినిమాలో పలువురు ప్రముఖ నటీ నటులను




తీసుకోబోతున్నారట. వరలక్ష్మి శరత్‌కుమార్ మెయిన్ లీడ్‌గా సంజీవ్ మేగోటి తెరకెక్కించనున్న ఈ ప్రాజెక్ట ఇప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. పూర్తి వివరాలు అతి త్వరలోనే ప్రకటించనున్నట్టు సమాచారం.

## టివి ఆర్టిస్టుల సంక్షేమం కోసమే 'జిఎస్ హారి ప్యానెల్'

తెలుగు టెలివిజన్ ఆర్టిస్టు అసోషియేషన్ కార్యవర్గం ఎన్నికలు ఈ నెల 31న జరగబోతున్నాయి. ఈ సందర్భంగా ఫిలించాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమవేశంలో జీఎస్ హరి ప్యానెల్ సభ్యులు మేనిఫెస్టో విడుదల చేశారు. తమ జీఎస్ హరి ప్యానెల్ గెలిస్తే.. తెలుగు టెలివిజన్ ఆర్టిస్టులకు పలు ప్రయోజనాలు అమలు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ టీవీ నటుడు విజయ్ యాదవ్ మాట్లాడుతూ, టెలివిజన్ అప్పటి మంత్రి శ్రీనివాస్ యాదవ్‌ల సహకారంతో ఆర్టిస్టులందరికి సహాయం చేశాం. పేద కళాకారులకు పెన్షన్ ఇచ్చాము. ఇలా చెప్పుకుంటూ పోతే ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నాం. సమర్థులైన జీఎస్ హరి ప్యానెల్ సభ్యులను భారీ మెజారిటీతో గెలిపించుకుంటే టెలివిజన్ కళాకారుల సమస్యలు తీర్చుతూ, సంక్షేమంపై దృష్టిపెడతాము. అని అన్నారు. జీఎస్ హరి ప్యానెల్ నుంచి అధ్యక్ష అభ్యర్థి జీఎస్ హరి మాట్లాడుతూ, నటుడుగా ఒక దశలో నా జీవితం అయిపోయింది అనుకున్న సమయంలో నన్ను ఆదుకుని నా నట జీవితాన్ని నిల



కళాకారుల సంక్షేమమే ధ్యేయంగా వినోద్ బాల ఆధ్వర్యంలో 27 ఏళ్ల క్రితం మా తెలుగు టెలివిజన్ ఆర్టిస్టు అసోషియేషన్ అసోసియేషన్‌ను ప్రారంభించాము. ఇప్పటి వరకు ఎన్నో కార్యక్రమలు చేశామని ఘనంగా చెప్పగలుగుతున్నాం. మా అసోసియేషన్‌కు మాత్రమే సొంత బిల్డింగ్ ఉంది. వందలాది మంది ఆర్టిస్టుల సమస్యలు పరిష్కరించాం. మెడిక్లెయిమ్ చేయించాము. తెలుగు ఆర్టిస్టులకు మాత్రమే అవకాశాలు ఇవ్వాలనేదే మా ప్రయత్నం. సీరియల్ షూటింగ్ టైమింగ్ విషయాలపై మేము ఒకరికొకరు సపోర్ట్ చేసుకున్నాం. కరోనా సమయంలో చిరంజీవి ట్రస్ట్, బెట్టింది ఈ టెలివిజన్ రంగం. ఈరంగానికి పెద్ద దిక్కుగా మిత్రులు విజయ్ యాదవ్, వినోద్ బాల అందరికి సపోర్టుగా నిలుస్తున్నారు. అర్ధరాత్రి తలపు తట్టిన కూడా ఆదుకునే మంచి మనసున్న వారు. కరోనా సమయంలో పెద్దలు చిరంజీవి, తలసాని శ్రీనివాస్ సహకారంతో ఇంటింటికి నిత్యావసర వస్తువులు అందించే బాధ్యత తీసుకున్నది మన అసోషియేషన్‌ది. నిరంతరం ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామని గర్వంగా చెప్పగలను. విజయ్ యాదవ్, వినోద్ బాల ఆధ్వర్యంలో నా మీద నమ్మకంతో నాకు అధ్యక్ష అభ్యర్థిగా అవకాశం ఇచ్చారు.




## గుజరాత్ సిఎంతో మోహన్ బాబు, మంచు విష్ణు

లెజెండరీ నటుడు మోహన్ బాబు, డైనమిక్ స్టార్ విష్ణు మంచు ప్రస్తుతం 'కన్నప్ప' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ క్రేజీ పాన్‌ఇండియా ప్రాజెక్ట్ కన్నప్ప పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలతో పాటుగా ప్రమోషన్స్ కూడా సమాంతరంగా జరుగుతున్నాయి. ఈ ప్రమోషనల్ టూర్‌లో భాగంగా కన్నప్ప టీమ్ దేశవ్యాప్తంగా ద్వాదశ జ్యోతిర్లింగాలను సందర్శిస్తోంది. ఈ క్రమంలో మోహన్ బాబు, విష్ణు మంచు గుజరాత్ ముఖ్యమంత్రి గౌరవనీయులైన శ్రీ భూపేంద్ర పటేల్‌ని కలిశారు. ఈటూర్‌లో శరత్ కుమార్, ముఖేష్ రిషి, వినయ్ మహేశ్వరి కూడా సందడి చేశారు. ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్ అతిథి మర్యాదలకు, పలికిన సాదర స్వాగతాలకు కన్నప్పటీం హృదయపూర్వక కృతజ్ఞతలుతెలిపింది. ప్రముఖ తెలుగు కళాకారుడు రమేష్ గొరిజాల అందమైన పెయింటింగ్‌ను విష్ణు మంచు ముఖ్యమంత్రికి బహూకరించారు. కన్నప్ప చిత్రం ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోన్న సంగతి తెలిసిందే.

## యూవీ క్రియేషన్స్ విటి15 వర్కింగ్ టైటిల్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా యంగ్ అండ్ టాలెటెడ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ ఓ సినిమా రూపొందిస్తున్న విషయం తెలిసిందే. వరుణ్ తేజ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమాను ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్ ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఇండోకొరియన్ హారర్ కామెడీ జానర్‌లో రానుంది. విటి15 వర్కింగ్ టైటిల్‌తో వరుణ్ తేజ్ 15 సినిమాగా రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి ప్రీ ప్రొడక్షన్ వర్క్ వియత్నాంలో శరవేగంగా జరుగుతోంది. హీరో వరుణ్ తేజ్, డైరెక్టర్ మేర్లపాక గాంధీతో పాటు నిర్మాతలు వియత్నాంలో అద్భుతమైన లోకేషన్స్ ను చూస్తున్నారు. అలాగే స్క్రిప్ట్ వర్క్ కూడా వేగంగా జరుగుతోంది. అన్ని కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేసి మార్చి మొదటి వారంలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాలని భావిస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. వరుణ్ తేజ్‌తో చేయబోతున్న ఈ సినిమా కోసం డైరెక్టర్ మేర్లపాక గాంధీ యూనిక్ స్టోరీలైన్‌ను డిజైన్ చేశారు. సరికొత్త జానర్‌తో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమా కోసం వరుణ్ తేజ్ ఇప్పటి వరకు కనిపించని సరికొత్త మేకోవర్‌తో స్క్రీన్ పై మెస్మరైజ్ చేయనున్నారు. ఇప్పటికే ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలకు అద్భుత మైన సంగీతం అందించిన ఎస్ఎస్ తమన్ ఈ సినిమాకు సంగీతం అందిం చనున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించి మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. తారాగణం: వరుణ్ తేజ్, సాంకేతిక బృందం: రచన, దర్శకత్వం: మేర్లపాక గాంధీ, నిర్మాతలు: యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్ టైన్‌మెంట్.





అదా శర్మ నయా లుక్

## 'కిల్లర్' మూడో షెడ్యూల్ పూర్తి

శుక్ర, మాటరాని మోనమిది ఏ మాస్టర్ పీస్ వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్‌ను ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ మరో సెన్సేషనల్ సైఫై యాక్షన్ థ్రిల్లర్"కిల్లర్" సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఈ చిత్రంలో పూర్వాజ్ హీరోగా నటిస్తుండగా, జ్యోతి పూర్వజ్ హీరోయిన్‌గా నటిస్తోంది. విశాల్ రాజ్, గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. థింక్ సినిమా బ్యానర్ పై ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థలతో కలిసి పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభ రెడ్డి నిర్మిస్తున్నారు. కిల్లర్ పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మూడో షెడ్యూల్ విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం 50 శాతం షూటింగ్ కంప్లీట్ అయింది. ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం పాల్గొని, కీలకమైన యాక్షన్, రొమాంటిక్, థ్రిల్లింగ్ సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమా లవ్, రొమాన్స్, రివేంజ్, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, థ్రిల్లర్ అంశాలను అద్భుతంగా మిళితం చేస్తూ, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుంది. సరికొత్త సైఫై యాక్షన్ థ్రిల్లర్‌గా "కిల్లర్" పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ సినిమా మెమొరబుల్ ఎక్స్పీరియన్స్ ఇవ్వనుంది. ఈ సినిమా తదుపరి షెడ్యూల్ కోసం టీమ్ త్వరలో రెడీ అవుతోంది. కిల్లర్‌కు సంబంధించి మరిన్ని అప్‌డేట్స్ త్వరలో వెల్లడించనున్నారు. నటీనటులు: జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, విశాల్ రాజ్, చందూ, గౌతమ్, తదితరులు.



## అందంలో తారలకి పోటీ డ్యాజ్లింగ్ దిశా..

దిశా పటాని ప్రధానంగా హిందీ చిత్రాలలో పని చేస్తున్నారు. పటాని తెలుగు చిత్రం లోఫర్‌తో సినీ రంగ ప్రవేశం చేసింది. బయోపిక్‌గా వచ్చిన ఎం.ఎస్ ధోనితో తన మొదటి హిందీ చిత్రం. ఇటీవల పాన్ వరల్డ్ బ్లాక్ బస్టర్ సినిమా కల్కి 2898 ఎడిలో ప్రభాస్ పక్కన నటించింది. ఆమె ఫోర్బ్స్ ఇండియా 2019 సెలబ్రిటీ 100 జాబితాలో కనిపించింది. తాజాగా కొన్ని సిజ్లింగ్ ఫొటోలతో కుర్రాళ్లను ఫిదా చేస్తుంది ఈ బ్యూటీ. 13 జూన్ 1992న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బరేలీలో హిందూ రాజపుత్ కుటుంబంలో జన్మించింది వయ్యారి భామ దిశా పటాని. ఈ ముద్దుగుమ్మ తండ్రి జగదీష్ సింగ్ పటానీ పోలీసు అధికారిగా పని చేస్తున్నారు. తల్లి పద్మ పటాని హెల్త్ ఇన్‌స్పెక్టర్. 13 జూన్ 1992న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బరేలీలో హిందూ రాజ్‌పుత్ కుటుంబంలో జన్మించింది వయ్యారి భామ దిశా పటాని. ఈ ముద్దుగుమ్మ తండ్రి జగదీష్ సింగ్ పటానీ పోలీసు అధికారిగా పని చేస్తున్నారు. తల్లి పద్మ పటాని హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఈ వయ్యారి అక్క ఖుష్బూ పటానీ ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్. ఆమెకి సూర్యాంశ్ పటానీ అనే తమ్ముడు కూడా ఉన్నాడు. లక్నోలోని అమిటీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చేస్తున్న సమయంలో సినిమా అవకాశం రావడంతో మధ్యలోనే వదిలేసింది. ఈ వయ్యారి అక్క ఖుష్బూ పటానీ ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్. ఆమెకి సూర్యాంశ్ పటానీ అనే తమ్ముడు కూడా ఉన్నాడు. లక్నోలోని అమిటీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చేస్తున్న సమయంలో సినిమా అవకాశం రావడంతో మధ్యలోనే వదిలేసింది. 2013లో ఇండోర్ వేదికగా జరిగిన పాండ్స్ ఫెమినా మిస్ ఇండియా వేడుకలో మొదటి రన్నరప్‌గా నిలిచింది ఈ వయ్యారి. 2015లో మెగా హీరో వరుణ్ తేజ్ సరసన తెలుగు యాక్షన్ డ్రామా సినిమా లోఫర్‌తో చలనచిత్ర అరంగేట్రం ఈ వయ్యారి భామ. 2013లో ఇండోర్ వేదికగా జరిగిన పాండ్స్ ఫెమినా మిస్ ఇండియా వేడుకలో మొదటి రన్నరప్‌గా నిలిచింది ఈ




వయ్యారి. 2015లో మెగా హీరో వరుణ్ తేజ్ సరసన తెలుగు యాక్షన్ డ్రామా సినిమా లోఫర్‌తో చలనచిత్ర అరంగేట్రం ఈ వయ్యారి భామ. 2016లో సుశాంత్ సింగ్ హీరోగా ఎం.ఎస్. ధోని: ది అన్‌టోల్డ్ స్టోరీలో ఓ కీలక పాత్రలో నటించింది ఈ అందాల తార. ఇటీవల తెలుగు ఇండియన్ ఎపిక్ సైన్స్ ఫిక్షన్ డిస్టోపియన్ చిత్రం కల్కి 2898 ఏడిలో ప్రభాస్ పక్కన ఆకట్టుకుంది. 2016లో సుశాంత్ సింగ్ హీరోగా ఎం.ఎస్. ధోని: ది అన్‌టోల్డ్ స్టోరీలో ఓ కీలక పాత్రలో నటించింది ఈ అందాల తార. ఇటీవల తెలుగు ఇండియన్ ఎపిక్ సైన్స్ ఫిక్షన్ డిస్టోపియన్ చిత్రం కల్కి 2898 ఏడిలో ప్రభాస్ పక్కన ఆకట్టుకుంది. ప్రస్తుతం సూర్య హీరోగా తెరకెక్కుతున్న కంగువ అనే ఓ తమిళ సినిమాలో ఓ కీలక పాత్రలో నటిస్తుంది ఈ బ్యూటీ.

## ఒంపు సొంపుల్లో సొగసరి పాయల్ రాజ్‌పుత్ !

తన తల్లిదండ్రులతో కలిసి ముంబైలో నివసిస్తున్న ఈ బ్యూటీకి చిన్నతనం నుంచే నటనపై ఆశక్తితో గ్రాడ్యు యేషన్ తర్వాత చిత్రసీమలో అడుగు పెట్టింది. ముందుగా బుల్లితెరపై తన కెరీర్ మొదలుపెట్టింది ఈ వయ్యారి భామ. తన తల్లిదండ్రులతో కలిసి ముంబైలో నివసిస్తున్న ఈ బ్యూటీకి చిన్నతనం నుంచే నటనపై ఆశక్తితో గ్రాడ్యుయేషన్ తర్వాత చిత్రసీమలో అడుగు పెట్టింది. ముందుగా బుల్లితెరపై తన కెరీర్ మొదలుపెట్టింది ఈ వయ్యారి భామ. 2010లో సప్నోన్ సే భరే నైనా అనే ఓ హిందీ సీరియల్‌లో సోనాక్షిగా టెలివిజన్‌లో తన కెరీర్‌ని ప్రారంభించింది. ఆఖిర్ బహు భీ తో బేటీ హీ హై సీరియల్‌లో సియా అనే ప్రధాన పాత్రను పోషిం చింది. గుస్తాఖ్ దిల్, మహాకుంభ్: ఏక్ రహస్యా, ఏక్ కహానీ సీరియల్స్‌లో నటించింది.

అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కిన ఆర్ఎక్స్ 100 సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయ్యింది పాయల్. రొమాంటిక్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమాలో పాయల్ తన నటనతో పాటు అందంతో కవ్వించింది. ఈ సినిమాలో రొమాంటిక్ సీన్స్‌లో రెచ్చిపోయి నటించింది. తొలి సినిమాలోనే ఈ అమ్మడు ఆ రేంజ్‌లో అందాలు ఆరబోయడం, రొమాంటిక్ సీన్స్‌లో రెచ్చిపోవడంతో కుర్రకారు ఫిదా అయ్యారు. 5 డిసెంబర్ 1992న దేశ రాజధాని ఢిల్లీలో విమల్ కుమార్ రాజ్ పుత్, నిర్మల్ రాజ్ పుత్ దంపతులకు జన్మించింది పాయల్ రాజ్ పుత్. ఈ ముద్దుగుమ్మ యాక్టింగ్‌లో డిప్లొమా చేసింది. అలాగే ప్రముఖ కాలేజీలో గ్రాడ్యుయేట్ పట్టా పొందింది ఈ భామ. 5 డిసెంబర్ 1992న దేశ రాజధాని ఢిల్లీలో విమల్ కుమార్ రాజ్ పుత్, నిర్మల్ రాజ్ పుత్ దంపతులకు జన్మించింది పాయల్ రాజ్ పుత్. ఈ ముద్దుగుమ్మ యాక్టింగ్‌లో డిప్లొమా చేసింది. అలాగే ప్రముఖ కాలేజీలో గ్రాడ్యుయేట్ పట్టా పొందింది ఈ భామ.



2010లో సప్నోన్ సే భరే నైనా అనే ఓ హిందీ సీరియల్‌లో సోనాక్షిగా టెలివిజన్‌లో తన కెరీర్‌ని ప్రారంభించింది. ఆఖిర్ బహు భీ తో బేటీ హీ హై సీరియల్‌లో సియా అనే ప్రధాన పాత్రను పోషించింది. గుస్తాఖ్ దిల్, మహాకుంభ్: ఏక్ రహస్యా, ఏక్ కహానీ సీరియల్స్‌లో నటించింది. 2017లో చన్నా మేరేయా అనే ఓ పంజాబి చిత్రంలో కథానాయకిగా ప్రధాన పాత్రలో సీని అరంగేట్రం చేసింది ఈ వయ్యారి భామ. 2018లో వీరేకి వెడ్డింగ్ అనే ఓహిందీ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయింది ఈ భామ. 2017లో చన్నా మేరేయా అనే ఓ పంజాబిచిత్రంలో కథానాయకిగా ప్రధానపాత్రలో సీని అరంగేట్రం చేసింది ఈ వయ్యారి భామ.

## 'మజాకా' బ్యాచ్‌లర్ యాంథమ్ రిలీజ్

ఎన్నో చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన పీపుల్స్ స్టార్ సందీప్ కిషన్ కెరీర్‌లో మైల్‌స్టోన్ మూవీ (30వ సినిమా)గా రాబోతున్న చిత్రం 'మజాకా'. 'ధమాకా'తో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టి తన సత్తా చూపించిన డైరెక్టర్ త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రానికి విజయవంతమైన చిత్రాల రచయిత బెజవాడ ప్రసన్నకుమార్ కథ, కథనం, మాటలు అందించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై రాజేష్ దండ, ఉమేష్ కేఆర్ బన్సల్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో రీతూవర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. సీనియర్ నటుడు రావురమేష్‌కు జోడీగా 'మన్మధుడు' ఫేం అన్షు నటిస్తున్న ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలు పెంచేసింది. ముఖ్యంగా రావు రమేష్, సందీప్ కిషన్ మధ్య వచ్చే సీన్స్ థియేటర్లలో ప్రేక్షకులకు పొట్టచెక్కలయ్యేలా ఉన్నాయి. ఫిబ్రవరి 21న రాబోతున్న ఈ సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా సినిమా నుంచి మొదటి పాట బ్యాచ్‌లర్ యాంథమ్‌ను విడుదల చేశారు మేకర్స్. బ్యాచ్‌లర్స్ జీవితంలో ఉండే స్ట్రగుల్స్, జాయ్స్‌ను హైలైట్ చేసేలా ఉన్న ఈ సాంగ్ కుర్రాళ్లకు చార్ట్‌బస్టర్ కానుంది. పాపులర్ రైటర్ రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాట కుర్రాళ్లకు ఎవర్‌గ్రీన్ ఫేవరెట్ కానుంది. ఈ పాటలో బ్యాచ్‌లర్స్ తమ జీవితంలో పడే వంట కష్టాలు, సింగిల్ షాపింగ్ ట్రిప్స్ వంటి వాటిని చాలాబాగా ఎలివేట్ చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను ధనుంజయ్ సీపాన ఎంతో హుషారుగా ఆలపించారు. కుర్రాళ్లందరికీ కనెక్ట్ అయ్యేలా తన గాత్రంతో కట్టిపడేశారు. లియోన్ జేమ్స్ అందించిన సంగీతం పాటకు మరింత ప్లస్ అయింది. రఘు మాస్టర్ అందించిన స్టెప్పులతో ఈ పాట సినిమాలో హైలైట్‌గా నిలవనుంది. ఈ పాటను సందీప్ కిషన్‌రావు రమేష్‌లపై వైజాగ్ బీచ్‌లో చిత్రీకరించారు. తండ్రీకొడుకుల బ్యాచ్‌లర్ జీవితంలో ఎత్తుపల్లాలను కళ్లకు కట్టినట్లు చూపించేలా తీశారు. వారిద్దరి ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను పడిపడినవ్వేలా చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌కు ఈ బ్యాచ్‌లర్ యాంథమ్ బ్లాక్‌బస్టర్ బిగినింగ్‌లా చెప్పొచ్చు. తారాగణం: సందీప్ కిషన్, రీతు వర్మ, రావు రామేష్, అన్షు, సాంకేతిక బృందం: దర్శకుడు: త్రినాధరావు నక్కిన, బ్యానర్స్: ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియో, నిర్మాతలు: రాజేష్ దండ, ఉమేష్ కేఆర్ బన్సల్, కథ, కథనం, డైలాగ్స్: ప్రసన్న కుమార్ బెజవాడ, సహ నిర్మాత: గుట్ట బాలాజీ, లైన్ ప్రొడ్యూసర్: పాపూరి కిరణ్, సంగీతం: లియోన్ జేమ్స్, సినిమాటో గ్రఫీ: నిజార్ షఫి, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మకడలి, స్టంట్స్: పృధ్వీ, పీఆర్వో: వంశీ శేఖర్, డిజిటల్: హ్యాష్‌ట్యాగ్ మీడియా.



# ఏకైక మహిళా కమాండర్ ..

రితికా ఖరేటా... ఢిల్లీలోనే పుట్టి పెరిగిన తను, ఇప్పుడు అదే రోడ్లమీద మార్చ్ కంటింజెంట్ కమాండర్‌గా ఉంటుందని ఊహించలేదు. అదీ అత్యంత టెక్నికల్ నైపుణ్యాలు కలిగిన 146 మంది సైనికులతో కూడిన 'ఆర్మీ కార్ప్స్ సిగ్నల్ టీం'కి నాయకత్వం వహిస్తుంది. అనుకోలేదట. నాన్న ఢిల్లీ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్, అమ్మ టీచర్. తండ్రి ప్రేరణతో ఆర్మీలోకి ప్రవేశించింది రితికా. ఆర్మీనెట్ వర్క్ సైబర్ వెల్ఫేర్, ఎలక్ట్రానిక్ వారేఫేర్... ఈ టీమ్ బాధ్యతలు. 'ఎర్రకోట వద్ద మేము మార్క్ ఫాస్ట్ చేయడం ఇదే మొదటిసారి. కెప్టెన్‌గా నా నాయకత్వాన్ని నమ్మి, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఆర్మీకి కృతజ్ఞతలు. ప్రతి ఒక్క అమ్మాయీ కలలు కనాలి. దానికోసం శ్రమించాలి. మొత్తం పూర్తిగా వినియోగించుకోవాలే కానీ, అసాధ్యమైనది ఏదీ లేదు. భారత ఆర్మీ మహిళలను స్వాగతించడమే కాదు, వాళ్లను సాధికారత వైపు నడిపిస్తోంది అంటూ భావోద్వేగానికి గురైంది రితిక.





సిగ్నల్ ట్రైనింగ్ సెంటర్(ఎస్టీసీ) నుంచి షార్ట్‌స్ట్ అయిన 12మంది ఆఫీసర్లలో రితికకు ఈ అవకాశం దక్కిందంటే, ఈ టీమ్ 146మందిలో ఏకైక మహిళ రితికనే కావడం విశేషం.

# వందేభారత్ రైలు నడిపిన తొలి మహిళ

**ఏటా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా.. రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ఖిఎట్ హోమ్ రిసెప్షన్‌ఖి పేరుతో ప్రత్యేక విందును ఏర్పాటుచేయడం అనవాయితీ రాజకీయ ప్రముఖులతో పాటు దేశవ్యాప్తంగా ఆయా రంగాల్లో రాణిస్తూ గుర్తింపు సంపాదించుకున్న కొద్దిమందిని ఈ విందులో పాల్గొనాల్సిందిగా స్వయంగా రాష్ట్రపతే వారికి ఆహ్వానం పంపుతారు.** అలా ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం రోజున జరగనున్న ఈ ప్రత్యేక విందులో పాల్గొనే అవకాశం దక్కించుకుంది రితికా టిర్కీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా . ప్రారంభించిన ఖివందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ఖి రైలుకు తొలి మహిళా లోకోపైలట్గా ఎంపికై చరిత్ర సృష్టించిందామె. ప్రతిభ, పట్టుదల ఉంటేపురుషాధిపత్యం ఉన్న రంగాల్లోనూ మహిళలు " దూసుకుపోవచ్చని నిరూపించింది. రితిక ఇప్పుడు రాష్ట్రపతి ఆహ్వానం అందుకొని మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ నేపథ్యంలో ఈ గిరి పుత్రిక గురించి కొన్ని ఆసక్తికర విశేషాలు తెలుసుకుందాం..

వందేభారత్ ఎక్స్‌ప్రెస్.. దేశంలోనే అత్యంత వేగవంతమైన రైలుగా గుర్తింపు పొందిందిది. గంటకు గరిష్టంగా 180 కిలో మీటర్ల వేగంతో దూసుకెళ్లే ఈ రైలు నడపాలంటే ఎన్నో ఏళ్ల పూర్వానుభవం ఉండాలి. అయితే లోకో పైలట్ కేవలం ఐదేళ్ల పూర్వానుభవంతోనే ఈ బుల్లెట్ రైలు నడిపే సువర్ణావకాశాన్ని దక్కించుకుంది 27 ఏళ్ల రితిక. గతేడాది టాటానగర్ పాట్నా నగరాల మధ్య ప్రారంభమైన వందభారత్ రైలుకు అసిస్టెంట్ లోకో పైలట్ నియమితురాలైన ఆమె.. ఈ బుల్లెట్ రైలు నడిపిన తొలి మహిళా లోకో పైలట్‌గా చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం ఇదే హోదాలో కొనసాగుతోందీ ఫస్ట్ ఉమన్.

**షంటర్ టు లోకోపైలట్:** జార్ఖండ్‌లోని ఓ గిరిజన తెగకు చెందిన రితిక చిన్నతనం నుంచి చాలా చురుకైన అమ్మాయి. చదువులో, ఇతర వ్యాపకాల్లో ముందుండేది. అందరిలా ఏదో ఒక ఉద్యోగం వస్తే చాలనుకోకుండా.. పురుషాధిపత్యం ఉన్న రంగాల్లోనే కెరీర్‌ను వెతుక్కోవాలని నిర్ణయించుకుందామె, "BIT-Mesra"లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాక.. భారతీయ రైల్వేలో లోకో పైలట్!! 'బిఐటిమేరా'లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాక.. భారతీయ రైల్వేలో లోకోపైలట్‌గా స్థిరపడనుంది. అనుకుంటే 2019లో ఆగ్నేయ రైల్వేకు చెందిన చక్రధర్‌పూర్ డివిజన్‌లో షంటర్ (రైలు నుంచి వేరు చేసిన ఇంజిన్, ప్యాసింజర్ కోచ్‌లను డిపోకు తరలించడం) కెరీర్ ప్రారంభించింది. ఆపై గూడ్స్, ప్యాసింజర్ రైళ్లనూ నడిపింది. ఆమె కోరుకునే లోకో పైలట్‌గా మరిన్ని నైపుణ్యాలు సొంతం చేసుకున్న రితిక.. 2021లో టాటానగర్‌కు బదిలీ అయింది. అక్కడే ఆమెకు సీనియర్ అసిస్టెంట్ లోకో పైలట్‌గా పదోన్నతి కల్పించారు. ఇలా తన ప్రతిభా పాటవాలతో ఐదేళ్లలోనే ఉన్నత స్థాయికి చేరుకున్న రితిక గతేడాది మరో సువర్ణా వకాశం అందుకుంది. సెప్టెంబర్‌లో టాటానగర్‌పాట్నాల మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించింది ప్రభుత్వం. ఇందులో భాగంగానే ఈ రైలుకు అసిస్టెంట్ లోకో పైలట్‌గా బాధ్యతలు స్వీకరించాం. నుండి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నడిపిన తొలి మహిళగా గుర్తింపు సంపాదించుకుంది రితిక.



**ఇదో గొప్ప అనుభూతి!** టాటానగర్‌పాట్నా వందేభారత్ రైలు నడిపిన రితిక పేరు ఆ సమయంలో మార్మోగింది. ప్రస్తుతం ఇదే రైలుకు అసిస్టెంట్ లోకోపైలట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమె.. ఈసారి గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ఆతిథ్యం స్వీకరించారు. 'రిపబ్లిక్ డే'ను పురస్కరించుకొని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన 'ఎట్ హోమ్ రిసెప్షన్' పేరుతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో ఆమె పేరు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఏటా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి పలువురు ప్రముఖులకు ప్రత్యేకంగా విందు ఇస్తారు. రాజకీయ ప్రముఖులతో పాటు ఆయా రంగాల్లో విశేష సేవలందిస్తున్న వారికి ఈ విందులో పాల్గొనేందుకు కొన్ని రోజుల ముందుగానే ఆహ్వాన పత్రిక పంపుతారు. అలా ఈసారి ఈ అవకాశం అందుకోవడం తనకెంతో సంతోషంగా ఉందంటోంది రితిక. మాది మధ్య తరగతి కుటుంబం. ఐదుగురు తోబుట్టువుల్లో నేనే పెద్ద. అయినా అమ్మానాన్న నా ఇష్టాలకు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. నచ్చిన రంగంలో రాణించేలా నన్ను ప్రోత్సహించారు. వందేభారత్ రైలు నడిపే సువర్ణావకాశం రావడం గొప్పగా అనిపిస్తోంది. ఇక ఇప్పుడు రాష్ట్రపతి భవప్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొనడం మరో అనుభూతి నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకున్నప్పుడే మనమేంటో నిరూపించుకోగలుగుతాం.. అంటూ తన మాటలతోనూ నేటి యువతలో స్ఫూర్తి నింపుతోంది.

# విదేశాలకు పల్లె రుచులు !

**పల్లె అమ్మాయి.. ఉరుకులు, పరుగుల జీవితం రుచించలేదు. అందుకే సాఫ్ట్‌వేర్ కొలువును వదిలి కమ్మని వంటకాలపై దృష్టిపెట్టింది. 20 దేశాలకు మన రుచులను పంపుతూ ఆదాయాన్ని అందుకుంటోంది**
చిలువేరు సామిత.



మాది మంచిర్యాల ఏర్పాటు నెన్నెల. నాన్న సత్యనారాయణ చిరువ్యాపారి. బీటెక్ పూర్తయ్యాక హైదరాబాద్ టీసీఎస్‌లో రూ.9 లక్షల ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. రెండేళ్లపాటు చేశా. కోవిడ్‌లో ఇంటి నుంచి పనిచేసేటప్పుడు అమ్మ, అమ్మమ్మ చేసే పచ్చళ్లు, చిరుధాన్యాలతో చేసే లడ్డూల వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశాను. దేశవిదేశాల్లో ఉన్న తెలుగువారు తమకీ కావాలని అడిగేవారు. ప్రస్తుతం నాకు ఉరుకుల పరుగుల జీవితం నచ్చలేదు. దీనితో 2021లో రాజీనామా చేశా. అప్పుడే విదేశాల్లో ఉన్న తెలుగువారు మన రుచులకు దూరమవుతున్నారని గ్రహించి 'తెలుగు ఫ్లేవర్స్' ప్రారంభించారు. 20 రకాల పచ్చళ్లు, స్నాక్స్, స్వీట్స్, పిండివంటలతోపాటు, మసాలాలు తయారు చేయిస్తున్నా. యూకే, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీసహా 20 దేశాల్లో స్థిరపడ్డ తెలుగువారి నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. విదేశాల్లో శుభకార్యాలు చేసుకుంటున్నవారూ మమ్మల్ని సంప్రదిస్తున్నారు. ఆర్డర్లు రావడంతో 10 మంది మహిళలను చేర్చుకున్నా. ఒక్కొక్కరికి రూ.8 వేల నుంచి రూ.10 వేల చొప్పున చెల్లిస్తున్నా. మా ఇల్లే తయారీ కేంద్రం. తయారీ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తారు. వాటితోనూ ఆర్డర్లు వస్తున్నాయి. కలుషితంలేని ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలి. మా సంస్థకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలన్నది నా కోరిక. ముఖ్యంగా చిరుధాన్యాలతో వాటిని ప్రజలకు చేరువ చేయాలన్నది నా ధ్యేయం.

# కాబోయే అమ్మకు జాగ్రత్తలు..

**కడుపులో పెరుగుతోన్న బిడ్డ ఎదుగుదల గురించే అనుక్షణం ఆలోచిస్తుంటుంది. కాబోయే అమ్మ మనసు. ఈ క్రమంలో దగ్గర్నుంచి వ్యాయామాల వరకు.. ప్రతి అంశంలోనూ జాగ్రత్తగా ఉండాల్సిందే అంటున్నారు నిపుణులు.**



గర్భస్థ సమయంలో బిడ్డ ఎదుగుదలకు ప్రొటీన్లు, విటమిన్లతో కూడిన మాంసాహారం తినడం మంచిదే! అయితే వీటిని బాగా ఉడికించుకొని తీసుకోవాలి. అప్పుడే అవి త్వరగా, సులభంగా జీర్ణమవుతాయి.

✦ఆహారం ఏ పూటకు ఆ పూటే వేడి వేడిగా వండుకొని తీసుకోవాలి. ఉదయం వండినవి. సాయంత్రం, రాత్రి వండినవి మరుసటి రోజు వేడి చేసుకొని త్మికపోవడమే మంచిదంటున్నారు నిపుణులు.

✦గర్భస్థ సమయంలో మహిళలు పెరిగే బరువు ఆరోగ్యకరంగా ఉండాలి. నిపుణుల సలహా మేరకు పోషకాహారం తీసుకోవడం మంచిది. అలాగే ఆహారపు కోరికల్ని అదుపులో ఉంచుకుంటూ ఈ సమయంలో జంక్‌ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, చిప్స్, బిస్కట్స్.. వంటి వాటికి దూరంగా ఉండాలి. అలాగే స్వీట్స్ కూడా పూర్తిగానే తీసుకోవాలి.

✦ రోజూ తాగే నీళ్లు కూడా కాచి చల్లార్చినవైతే మరీ మంచిదంటున్నారు నిపుణులు. అలాగే శరీరంలో తేమ స్థాయిలు తగ్గకుండా కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలి. ఫలితంగా ఉమ్మనీరు తగ్గకుండా జాగ్రత్తపడచ్చు. గర్భిణిగా ఉన్న సమయంలో మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి నిపుణుల సలహాలు తీసుకుంటే.. యోగా, నడక వంటి చిన్న చిన్న వ్యాయామాలు చేస్తే శరీరం యాక్టివ్‌గా ఉంటుంది.

# ‘పింక్ ఐ’ అంటే ..


సాధారణంగా మేకప్ వేసుకునే కంటికి సంబంధించిన మేకప్ ఉత్పత్తుల్లోని అవశేషాలు, రసాయనాలు కంటికి అనుకూలంగా పేరుకుపోతాయి. ఇక రాత్రి పూట కూడా దాన్ని తొలగించకుండా అలాగే పడుకోవడం వల్ల ఈ సమస్య మరింత పెరుగుతుంది. ఇది అప్పటికప్పుడు ప్రతికూల ప్రభావం చూపకపోయినా కొన్ని రోజుల తర్వాత కళ్లలో దురద, ఎరుపెక్కడం.. వంటి కంటి ఇన్ఫెక్షన్లకు కారణమవుతుంది. అంతేకాదు.. దీర్ఘకాలంలో ఇది 'పింక్ ఐ' (కంటి చుట్టూ వాపు/ఇన్ఫెక్షన్ రావడం) సమస్యకు దారితీసే ప్రమాదమూ లేకపోలేదంటున్నారు నిపుణులు. కాబట్టి కళ్లకు మేకప్ ఎంత తక్కువగా వేసుకుంటే అంత మంచిదని చెబుతున్నారు. అలాగే పడుకునే ముందు ఐ మేకప్ తొలగించుకోవాలి.



**కళ్లలోకి వెళ్లకుండా.....** కంటికి మేకప్ వేసుకోవడానికే కాదు.. తొలగించడానికీ ప్రస్తుతం మార్కెట్లో విభిన్న సాధనాలు అందుబాటులో ఉన్నాయి. అయితే వీటితో పని లేకుండా ఇంట్లోనే సులభంగా కంటి మేకపన్ను తొలగించుకునేందుకు బోలెడన్ని మార్గాలున్నాయి.

✦ సాధారణ మేకప్ తొలగించుకునేందుకు ఉపయోగించే కొబ్బరి నూనె కంటి మేకప్ తొలగించడానికి ఉపయోగపడుతుంది. ముందు గా కాటన్ ప్యాడ్‌పై కొన్ని చుక్కల కొబ్బరి నూనె వేసి.. దాన్ని కనురెప్పలు, కంటి చుట్టూ చర్మంపై నెమ్మదిగా రుద్దుతూ మేకప్ ను తొలగించు కోవాల్సి ఉంటుంది. ఈ కనురెప్పల వద్ద కాటన్ స్వాబ్ ఉపయోగిస్తే.. మేకప్ కంటి లోపలికి వెళ్లకుండా జాగ్రత్తపడచ్చు.

✦ బెర్/పౌడర్/క్రీమ్ ఆధారిత మేకప్ ఉత్పత్తులను పూర్తిగా తొలగించడంలో పెట్రోలియం జెల్లీ కీలక పాత్ర ఈ కొద్దిగా జెల్లీ కంటి చుట్టూ అప్లై చేసి.. చూపుడు వేలితో గుండ్రంగా రుద్దుతూ మేకప్ తొలగించుకోవాలి. ఆపై గోరువెచ్చటి నీటిలో ముంచిన కాటన్‌తో ఆ ప్రదేశంలో తుడిచేస్తే సరిపోతుంది.



✦ కొద్దిగా బేబీ ఆయిల్ను కాటన్ ప్యాడ్పై వేసి.. దానితో కళ్ల చుట్టూ నెమ్మదిగా, గుండ్రంగా రుద్దుతూ కూడా మేకప్‌ను సులభంగా తొలగించవచ్చు.

✦ కనురెప్పలకు అప్లై చేసుకున్న మస్కారాను తొలగించుకునేలా మరింత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు భావిస్తున్నారు. ఈ కాటన్ స్వాబ్‌గా కొబ్బరి నూనె/ బేబీ ఆయిల్లో ముంచి.. దానితో మస్కారా అప్లైట్లుగా చేసుకున్న కింది నుంచి పై దిశగా మేకప్ను తొలగించుకోవాల్సి ఉంటుంది. ఫలితంగా మస్కారా పూర్తిగా తొలగిపోవడంతో పాటు కంట్లోకి వెళ్లకుండా కూడా ఉంటుంది.

✦ మేకప్ బ్రష్లను శుభ్రం చేయకపోయినా కంటి సంబంధిత ఇన్ఫెక్షన్లు తప్పవంటున్నారు నిపుణులు. అందుకే వాటిని వాడిన ప్రతిసారీ బేబీ వాష్, లిక్విడ్ సోప్తో శుభ్రం చేసి.. పొడిగా ఆరబెట్టాలి. ఇక వాటి బ్రిజిల్స్ పాతబడిపోతే.. వెంటనే మార్చేయడం లేదంటే కొత్త బ్రష్లను కొనడం మంచిది. ముఖానికి పట్టించినట్లే కొందరు కంటికీ దట్టంగా మేకప్ వేస్తుంటారు. దానివల్ల కంటి సమస్యల్ని కోరికోరి కొని తెచ్చుకున్నట్లే కాబట్టి ఐ మేకప్ ఎంత సింపుల్‌గా, తక్కువగా వేసుకుంటే అందం అంతగా ఇనుమడిస్తుంది.. కంటి సమస్యలు రాకుండానూ జాగ్రత్తపడచ్చు. ఒకవేళ ఈ సమస్యలు మరీ తీవ్రమైతే మాత్రం నిపుణులను సంప్రదించడం మర్చిపోవద్దు!

# విడిపోయి కలుస్తున్నారు !

**భార్యా భర్తలన్నాక గొడవలు సహజం.** కానీ వాటిని ఎలా పరిష్కరించు కుంటున్నారు. అన్నదానిపైనే దాంపత్య జీవితం ఆధారపడి ఉంటుంది. కోపంలో ఒకరినొకరు కసురుకున్నా... ఉదయం అయ్యేసరికి పరిస్థితుల్ని చక్కబెట్టుకుంటేనే బంధం బలపడేది. కానీ ఇప్పటి వరకు ఉన్నారు. చిన్నచిన్న విషయాల్ని తెగేదాకా లాగుతున్నారు. అవే చినికిచినికి గాలివానగా మారి విడిపోవడానికి కారణమవుతున్నాయి.. ఇకపై ఇలా కాకూడదంటే తీసుకోమంటున్నారు నిపుణులు. అదేంటంటే...



✦ చెడమడ తిట్టుకుని కలిసి ఒకచోట ఉండాలంటే కోపం మరీ పెరిగిపోతుంది. అందుకే నిద్రపోయేటప్పుడు ఉండ మంటున్నారు నిపుణులు. దీనివల్ల మనసు కుదుటపడి అవతలి వాళ్ల వెర్షన్ని అర్థం చేసుకునే సమయం దొరుకుతుందట. పైగా మంచినిద్ర మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది. రోజును తాజాగా ప్రారంభిం చేందుకు ఇది అందుబాటులోకి వచ్చింది. ✦ చాలామంది మగవాళ్లు ఎంత పెద్ద గొడవైనా, ఏం జరగనట్లు నడుచుకుంటు టారు. ఆడవాళ్లు సుల భంగా దేన్నీ మరచి పోలేరు. అయితే అన్ని సార్లు ఈ పద్ధతి మంచిది కాదు. ఆ కోపం తగ్గాలంటే ఒంటరిగా ఒక రాత్రి గడవడమే మేలట. ✦ గొడవ అయ్యాక చాలామంది బాధపడుతూ కూర్చుంటారు. అవతలి వాళ్లేమో నిద్రపోతుంటారు. అది ఇంకా మనలో ఒత్తిడినీ, కోపాన్నీ పెంచేస్తుంది. అందుకే వాళ్లకి కాస్త దూరంగా ఉంటే వేరే వ్యాపకాలమీదకు మనసు మళ్లుతుందట. చిన్నచిన్న కారణాలతో విడాకులు తీసుకుని జీవితాంతం విడిపోయే బదులు, ఇలా కాస్త ఎడబాటుగా ఉండి ఎవరికి వాళ్ల సమయం ఇచ్చుకోవడం మంచిదేమో కదా. పైగా మిలీనియల్స్ ఈ ట్రెండ్ ఫాలో అవడానికి ఎక్కువ ఆసక్తిని చూపిస్తున్నారట.

# ఎదుటివారి మాట వినండి..

మన పని మనం చేసుకుపోదాం. చాలామంది ఉద్యోగినుల ధోరణి అలాగే ఉంటుంది. అనవసర వివాదాల్లో దూరతామేమో అన్న భయం ఒకటే. పని ముగించుకుంటే త్వరగా బయటపడొచ్చు అన్న ఆలోచన మరొకటిందా. సందేహం అడిగితే ఏమీ తెలియదు అనుకుంటారు. ప్రశ్నిస్తే పొగరుగా బావిస్తారు ఇలా లోలోపలే బోలెడు ఊహించుకుంటారు. కానీ ఈ తీరే వారిని ఎనగకుండా ఆపుతుంది. మీదీ అనే వరసైతే బ్రాండింగ్ తప్పనిసరి అంటే మేకోవర్. దుస్తుల్నీ, హెయిర్‌స్టైల్‌లో మార్చమని కాదు... మీ పూర్తి ఇమేజింగ్ మార్చుకోమని అర్థం. అడగండి... ప్రమోషన్ కానీ, ఫైనాళ్ల మెచ్చుకోలు కానీ రానప్పుడు నిరాశ సహజమే కానీ ఎందుకు రావట్లేదు. అన్న ప్రశ్న వేసుకోండి. అయితే దీనికి మాత్రం మీరే సమాధానం ఇవ్వవద్దు. ఎందుకంటే.. ఫలానా అమ్మాయి నా గురించి చెడుగా చెప్పిందేమో, నేనెక్కడ ఎదిగిపోతానో అని వల్ల ఇలా మనమంటే పడనివారి మీదకే దృష్టి వెళ్తుందట. వాటివల్ల ప్రయోజనం లేకపోగా వర్జం అందుకే మీ పనితీరు తెలిసినవారిని అడగండి వాళ్లైతే మీ లోపాలు కచ్చితంగా చెబుతారు. ఉద్యోగి ఇలాగే చేస్తే ఆమెకేం సలహాలొచ్చాయో తెలుసా! పని చేస్తావు కానీ... అభిప్రాయాలు చెప్పవు ఎప్పుడూ దీనంగా ముఖం పెట్టుకుని ఉంటావు... దీనితో నీతో పని చేయాలని పించదు. వ్యక్తిగత శుభ్రత పాటించు... అంటూ సలహా లొచ్చాయట. అసలీ కోణాలూ మనపై ప్రభావం చూపు ఊహించ గలమా? కొన్ని సార్లు చిన్న అంశాలూ పెద్ద సమస్య అవుతాయనడానికి ఇది ఉదాహరణ కాబట్టి, ఏ మార్పు అవసరమో అడిగి తెలుసుకోండి. చెప్పినవన్నీ మార్చుకోవాలనేం లేదు. కానీ కొన్నింటినైనా ప్రయత్నించొచ్చు. అప్పుడు నెమ్మదిగా మీలో మార్పు మొదలవుతుంది. చుట్టుపక్కల వాళ్లూ దాన్ని గమనిస్తారు. ఒక పరిశోధన ప్రకారం... ఒక పదిని అక్క మగ ఇద్దరూ చేస్తున్నప్పుడు... ఆడవాళ్ల నుంచేఎక్కువ ఫలితం ఆశిస్తారట. మీ సాయి వాళ్లూ అలాగే ఆలోచిస్తుండొచ్చు. కాబట్టి, వాళ్లతోనూ మాట్లాడండి మీ నుంచి ఏమేం ఆశిస్తున్నారో తెలుసుకోండి అయితే వాటిలో సాధ్యా సాధ్యాలు మనిషివి అప్పుడే చెప్పండి. మనకి ఇంటి బాధ్యతలు అదనం. వాటిని గుర్తు చేస్తే ఈ ఆశించడం తగ్గుతుంది అయితే ఒక్కసారి మాట్లాడి ఇబ్బందులన్నీ చెప్పడంతో సమస్య తీరుతుంది. ఎవరికి లేదు. సాధన చేయాలి. నో చెప్పాలి అదంతా నిరంతర ప్రక్రియ, అయితే ఎవరినో అనుసరించొద్దు, అనుకరించొద్దు. గంగలా మాట్లాడలేరా అయితే ఎదుటివారు చెప్పేది వినండి. మీటింగుల్లో కదిలించవ నర్లేదు..కానీ,అవసరమైన సందేహాలు అడగొచ్చు.



# సకల విద్యా దాత్రి

దోర్భిర్యుక్తా చతుర్భిః స్ఫటిక మణిని భైరక్షమాలాందధానా హస్తేనైకేన పద్మం.. అన్నారు వీణాపాణి నాలుగు చేతుల్లో ధరించే వీణ, పుస్తకం, అక్షమాల, పద్మం సైతం మనకు జ్ఞానబోధ చేయగలవు. సరస్వతి వీణ పేరు కచ్చపి అది సృజనాత్మకత, కళలు, భావాలు, భావోద్వేగాలకు ప్రతీక. పుస్తకాలు నాలుగు వేదాలకు సంకేతం. అవి సార్వత్రిక, దైవిక, శాశ్వత, అనువర్తనీయ జ్ఞానాలను సూచిస్తూ అడుగడుగునా మార్గనిర్దేశం చేస్తాయి. అక్షమాల లేదా స్ఫటికమాల ధ్యానాన్ని సూచిస్తుంది. స్వీయ అంతర్దర్శనానికి దారితీసి తద్వారా విచక్షణ కలిగిస్తుంది. అమ్మ చేతిలోని పద్మం దైవత్వాన్ని సూచిస్తుంది. సమస్త విద్యలూ ప్రాప్తింపచేస్తుంది. అమ్మ హంసవాహిని. స్వభావరీత్యా హంస నీటిని వేరుచేసి స్వచ్ఛమైన పాలను గ్రహిస్తుంది. అలాగే బుద్ధిమంతులు చుట్టూ ఉన్న విషయాల్లోంచి మంచిని మాత్రమే గ్రహించాలి. పవిత్ర మాఘ మాసంలో శుద్ధపంచమిన అమ్మ అవతరించిందని వేదోక్తి. అందుకే ఆ రోజు తెలుపు లేదా పసుపు దుస్తులు ధరించి పూజాపీఠంపై పుస్తకాలనుంచాలి. వాటిని అమ్మగా భావించి జ్ఞానప్రాప్తికై షోడశోపచార పూజ చేయాలి. తెల్లటి పూలు, శ్రీగంధంతో అర్చించి క్షీ రాన్నం, రేగుపళ్లు, చెరుకురసాలను నివేదించాలి.మేధ, ఆలోచన, ప్రతిభ, ధారణ, ప్రజ్ఞ, స్ఫురణ శక్తుల స్వరూపమే వాగ్దేవి. అందుకే అమ్మ సన్నిధిలో అక్షరాభ్యాసం చేయిస్తారు. బెంగాల్లో సరస్వతీ పూజను ఘనంగా నిర్వహిస్తారు. మండపంలో నెలకొల్పిన మూర్తిని నాలుగు రోజుల తర్వాత నిమజ్జనం చేస్తారు. రాబోయే వసంత రుతువుకు సూచికగా యువజనం మదనోత్సవాన్ని నిర్వహిస్తారు.

ఆధ్యాత్మికం

# చలిలో నల్లయాలకులు ..

**కొందరికి మెనోపాజ్‌లో భాగంగా చలి ఎక్కువగా అనిపిస్తుంది. అలాంటివాళ్లు నల్లయాలకులు తినండి: మంచి ఉపశమనం లభిస్తుంది అంటున్నారు నిపుణులు...**



రక్తప్రసరణ సవ్యంగా జరగకపోవడమే చలికి ప్రధాన కారణం. నల్లయాలకుల్లో ఉంటే ఫినోలిక్ ఆమ్లం దీన్ని సరిచేస్తుంది. శరీరం మొత్తం రక్తం ప్రవహించేందుకూ, వేడిని ఉత్పత్తి చేయడానికీ నల్లయాలకులు ఉపయోగపడతాయి. అయితే ఘాటు ఎక్కువగా ఉండటంవల్ల వీటిని అందరూ ఇష్టపడతారు. కానీ అత్యవసర సమయాల్లో వీటిని తింటే ఫలితముంటుందట.హారం నేరుగా తినలేనివాళ్లు టీ, ఆహారంలో చేర్చుకోవచ్చు. 'నేషనల్ ఇనిషియల్ ఆఫ్ హెల్త్' 2015 అధ్యయనం ప్రకారం... మెటబాలిక్ సిండ్రోమ్‌ను తిప్పికొట్టే డైటరీ ఫైబర్, కార్బోహైడ్రేట్లు నల్లయాలకు ఎక్కువగా ఉంటాయని నిరూపించారు. అంతేకాదు, అక్కడ ఉండే సినీయోల్, టెరిఫినైన్ జీవక్రియను నియంత్రిస్తాయి. జీర్ణక్రియ మెరుగుపడటానికి ఉపయోగపడతాయి. అధిక బరువును తగ్గిస్తాయి. వీటి సువాసన మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది.

# ఆకుకూరల్లో రారాణి

**ఆకుకూరల్లో బచ్చలి రారాణి అంటే అతిశయం కాదు.** పప్పులో వేసినా, పచ్చిమిర్చి జోడించి పచ్చడి చేసినా, పెరుగు పులుసు చేసినా సూపర్గా ఉంటుంది. ఇది రుచికే కాదు పోషకాల్లోనూ మేటి, ఇ, సి, ఐ, కె విటమిన్లు, క్యాల్షియం, ఫొలెట్, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, సోడియం, మాంగనీస్‌లతో మంచి పోషకాహారం. బచ్చలికూర తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకలు దృఢంగా ఉంటాయి. రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండె జబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది. మధుమేహం నుంచి ఉపశమనం లభిస్తుంది. చర్మానికి కాంతి వస్తుంది. కుదుళ్లు గట్టిపడతాయి, జుట్టు రాలడం తగ్గుతుంది. ఆందోళన తగ్గుతుంది. మెదడు పనితీరు మెరుగవుతుంది.



తరచుగా బచ్చలికూర తినేవారిలో కంటిచూపు బాగుంటుంది. ఇది క్యాన్సర్‌ను సైతం నిరోధిస్తుంది. ఇందులో పీచు విస్తారంగా ఉన్నందున జీర్ణప్రక్రియ సాఫీగా ఉంటుంది. బచ్చలికూరతో చేసే పకోడీలు, బజ్జీలు వంటివి కూడా యమా టేస్టీగా ఉంటాయి.

# అత్యంత చెత్త రికార్డు

## 2 రన్స్‌కే 6 వికెట్లు కోల్పోయిన మేఘాలయ



**ఢిల్లీ:** మేఘాలయ బ్యాటర్లు దారుణ ప్రదర్శన కనబరిచారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ తమ మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 86 పరుగులకే ఆలౌటైంది. ఆరంభంలోనే ముంబై స్టార్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ హ్యాట్రిక్ వికెట్లను పడగొట్టి దెబ్బతీశాడు. అతడి ధాటికి మేఘాలయ కేవలం 2 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో మేఘాలయ అత్యంత చెత్త రికార్డును తమ పేరిట లిఖించుకుంది. 152 ఏళ్ల ఫస్ట్ క్లాస్ క్రికెట్ హిస్టరీ లోనే తొలి ఆరు వికెట్లకు అత్యల్ప స్కోర్ చేసిన రెండో జట్టుగా మేఘాలయ నిలిచింది. ఈ చెత్త రికార్డు సాధించిన జాబితాలో ఎంసీసీ క్రికెట్ క్లబ్ అగ్రస్థానంలో ఉంది. 1872లో లార్డ్స్‌లో సర్రేతో జరిగిన మ్యాచ్‌లో ఎంసీసీ ఖాతా తెరవకుండానే తొలి 6 వికెట్లను కోల్పోయింది. ఈ లిస్ట్‌లో ఎంసీసీ, మేఘాలయ తర్వాతి స్థానాల్లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ (3-6), లీసెస్టర్‌షైర్ (4-6), నార్తాంప్టన్‌షైర్ (4-6) ఉన్నాయి. ఇక ఈ మ్యాచ్ శార్దూల్ ఠాకూర్ హ్యాట్రిక్ వికెట్లతో మెరిశాడు. మేఘాలయ ఇన్నింగ్స్ మూడో ఓవర్ వేసిన లార్డ్ శార్దూల్, బి అనిరుధ్, సుమిత్ కుమార్, జస్కిరత్‌లను వరుస బంతుల్లో ఔట్ చేశాడు. ఓవరాల్‌గా 11 ఓవర్లు బౌలింగ్ చేసిన ఠాకూర్, 43 పరుగులిచ్చి 4 వికెట్లను పడగొట్టాడు. అతడితో పాటు, మోహిత్ అవస్థి 3 వికెట్లు, సిల్వస్టర్ డిసౌజా 2 వికెట్లు, షామ్స్ ములానీ 1 వికెట్‌ను సాధించారు. మేఘాలయ బ్యాట్స్‌లో ఆల్‌రౌండర్ హిమ్మాన్ 28 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

# మాస్టర్స్ చెస్ టోర్నీలో..

# ఆధిక్యంలో గుకేశ్



**ఢిల్లీ:** టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో పదవ రౌండ్ తర్వాత భారత గ్రాండ్ మాస్టర్, ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ 7.5 పాయింట్లతో ఆధిక్యంలో ఉన్నాడు. నెదర్లాండ్స్‌కు చెందిన మాక్స్ వార్మెర్‌డామ్‌తో జరిగిన పదవ రౌండ్ గేమ్‌లో గుకేశ్ 34 ఎత్తుల్లో గెలిచాడు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత గుకేశ్‌కు ఇదే మొదటి టోర్నమెంట్ కావడం గమనార్హం. మరోవైపు ఉజ్బెకిస్తాన్ గ్రాండ్ మాస్టర్ నోడిర్బెక్ అబ్దుసత్తోరోవ్ 7 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. రష్యాకు చెందిన అలెక్సీ సరానాను నోడిర్బెక్ ఓడించాడు. ఇక భారత్‌కే చెందిన గ్రాండ్ మాస్టర్లు ప్రజ్ఞానంద 6.5 పాయింట్లతో మూడో స్థానంలో, ఇరిగేశి అర్జున్ 3 పాయింట్లతో 13వ స్థానంలో ఉన్నారు. 14 మందిమేటి గ్రాండ్ మాస్టర్ల మధ్య 13 రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది.

# ఛాంపియన్స్ ట్రోఫీలో..

# అత్యధిక వికెట్ల హీరోలు

## టాప్ ప్లేస్‌లో కైల్ మిల్స్

**ఢిల్లీ:** క్రికెట్ ఫ్యాన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. ఈసారి ఛాంపియన్ ట్రోఫీకి పాకిస్థాన్, దుబాయ్ ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ట్రోఫీలో మొదటి మ్యాచ్ పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య జరగనుంది. అయితే టీమిండియా ఫిబ్రవరి 20 నుంచి సమరంలోకి దిగుతోంది. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్ జట్టుతో టీమిండియా తలపడనుంది. ఇప్పటికే టీమిండియా స్క్వాడ్ ను బీసీసీఐ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఛాంపియన్స్ ట్రోఫీలో ఇప్పటివరకూ పలువురు బౌలర్లు















అత్యధిక వికెట్లు సాధించి రికార్డు సృష్టించారు. అటువంటి వారిలో కైల్ మిల్స్(28) న్యూజీలాండ్ మాజీ పేసర్ ఈ లిస్ట్ లో టాప్ ప్లేస్ లో ఉన్నాడు. అతడు ఛాంపియన్స్ ట్రోఫీలో అతడు 17 మ్యాచ్‌లు ఆడి 28 వికెట్లు పడగొట్టాడు. అతడి బౌలింగ్ యావరేజ్ 17.25గా ఉంది. 4/30 తన బెస్ట్ పెర్ఫామెన్స్ గా ఉంది. 2013లో ఇంగ్లాండ్ తో జరిగిన మ్యాచ్ లో కైల్ మిల్స్ ఈ ఘనత సాధించాడు. అలాగే లసిత్ మలింగా(25) శ్రీలంక గ్రేటెస్ట్ బౌలర్లలో మలింగ ఒకరు. గత రెండు దశాబ్దాలుగా అతనే అత్యుత్తమ బౌలర్. యార్కర్స్ సంధించడంలో మలింగాకు మంచి పేరుంది. అతడు 16 మ్యాచ్‌ల్లో 25 వికెట్లు పడగొట్టాడు. అతడి అత్యుత్తమం 4/34. ఛాంపియన్స్ ట్రోఫీలో అతడి యావరేజ్ 19.09గా ఉంది. మలింగా 2009లో 4 వికెట్లు, 2013లో 7వికెట్లు, 2017లో 3 వికెట్లు రాబట్టాడు. దీంతో మలింగా ఇప్పటివరకు 25 వికెట్లు సాధించాడు. ఇక శ్రీలంక లెజెండరీ క్రికెటర్ ముత్తయ మురళీధరన్ ఐసీసీ ఛాంపియన్స్ టోర్నీలో ఇప్పటివరకు మొత్తం 17 మ్యాచ్‌లు ఆడి 24 వికెట్లు తీసుకున్నాడు. అంతేకాక మురళీధరన్ బెస్ట్ ఎకానమీ రేటును కలిగి ఉన్నాడు. అతని ఎకానమీ రేటు ఓవర్ కు 2.78 గా ఉంది. ఈ టోర్నమెంట్ లో ముత్తయ ప్రతి 15.10 బాల్స్ కు ఓ వికెట్ సాధించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. చాంఫియన్స్ ట్రోఫీలో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్ల లిస్టులో మురళీధరన్ ఏకైక స్పిన్నర్ కావడం విశేషం. బ్రెట్ లీ (22) ఆస్ట్రేలియా ఫాస్టెస్ట్ బౌలర్ బ్రెట్ లీ కూడా ఈలిస్ట్ లో ఉన్నాడు. మొత్తం 4 టోర్నమెంట్స్ ఆడిన బ్రెట్ లీ మొత్తం 22 వికెట్లు పడగొట్టినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ టోర్నీలో అతడి బెస్ట్ బౌలింగ్ 3/38.. 2002లో న్యూజిలాండ్‌పై సాధించాడు. ఆస్ట్రేలియా లెజెండరీ బౌలర్ గ్లెన్ మెక్ గ్రాత్ (21). ఛాంపియన్స్ ట్రోఫీలో ఐదవ స్థానంలో ఉన్నారు. కేవలం 12 మ్యాచ్‌లు ఆడిన మెక్ గ్రాత్ 21 వికెట్లు పడగొట్టాడు. అతడి బెస్ట్ పెర్ఫామెన్స్ 5/37గా ఉంది. 2002 న్యూజిలాండ్ తో జరిగిన మ్యాచ్ లో మెక్ గ్రాత్ ఈ గణత సాధించాడు. అయితే ఈ ఐదుగురిలో అత్యధిక సార్లు 5 వికెట్లు పడగొట్టిన బౌలర్ గా మెక్ గ్రాత్ నిలిచాడు.

# ఎటిపి టెన్నిస్ ఛాలెంజర్‌లో..

# క్వార్టర్ ఫైనల్స్‌కు అనిరుధ్ జోడీ



**ఢిల్లీ:** బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-75 టెన్నిస్ టోర్నీలో భారత్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ నగరంలో జరుగుతున్న ఈ టోర్నీల్ భాగంగా గురు వారం జరిగిన డబుల్స్ తొలిరౌండ్లో టాప్ సీడ్ అనిరుధ్ (భారత్)-చార్లెస్ బ్రూమ్ (బ్రిటన్) ద్వయం 6-4,6-3తోహేడెన్‌జోన్స్-పావ్లెమారిన్‌కోవ్ (ఆస్ట్రేలియా) జోడీపై విజయం సాధించింది. మరోవైపు ఫ్రాన్స్‌లో జరుగు తున్న

## సహజ, రష్మిక ఓటమి

మాంట్‌పెలి యర్ ఏటీపీ-250 టోరీలో యూకీ బాంబ్రీ (భారత్)- అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో యూకీ- ఒలివెట్టి జంట 7-5, 3-6, 10-8తో జేకబ్ ష్నుయిటర్-మార్క్ వాల్నర్ (జర్మనీ) ద్వయంపై గెలుపొందింది. మరో మ్యాచ్‌లో విజయ్ సుందర్ ప్రశాంత్-జీవన్ నెదుంజెళియన్ (భారత్) జోడీ 1-6, 5-7తో ఫ్లావియో కొల్లి (ఇటలీ)-జొనాథన్ ఎసెరిక్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడిపోయింది. మరోవైపు అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ 75 మహిళల టోర్నమెంట్‌లో భారత నంబర్ వన్ యామలపల్లి సహజ, భారత మూడో ర్యాంకర్, భమిడిపాటి శ్రీవల్లి రష్మిక పోరాటం ముగిసింది.

# థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్‌లో..

# శ్రీకాంత్ తొలి విజయం



**ఢిల్లీ:** కొత్త ఏడాదిలో భారత స్టార్ షట్లర్, ప్రపంచ మాజీ నంబర్ వన్ కిడాంబి శ్రీకాంత్ తొలి విజయం అందుకున్నాడు. థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రపంచ 47వర్యాంకర్ శ్రీకాంత్ శుభారంభం చేశాడు. బ్యాంకాక్‌లో జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 21-13, 21-18తో డానిల్ దుబోవెంకో (ఇజ్రాయెల్)పై గెలుపొంది ప్రిక్వా ర్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 36 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ తొలిగేమ్ ఆరంభంలో వరుసగా 6పాయింట్లు గెలిచి 6-0 తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆతర్వాత ఇదేజోరునుకొనసాగించి గేమును దక్కించుకున్నాడు. రెండో గేమ్‌లో శ్రీకాంత్‌కు ఒకింత ప్రతిఘటన ఎదురైంది.స్కోరు 15-15తో సమమైన దశలో శ్రీకాంత్ ఒక్కసారిగా విజృంభించి వరుసగా4పాయింట్లు నెగ్గి 19-15 తో ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత 3పాయింట్లు కోల్పోయిన శ్రీకాంత్ 2పాయింట్లు గెలిచి గేమ్‌తో పాటు,మ్యాచ్‌ను హస్తగతం చేసుకున్నాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌లో మరో ప్లేయర్ మన్నేపల్లి తరుణ్ 11-21, 15-21తో చికో వార్డోయో (ఇండోనేసియా) చేతిలో, ఆయుశ్ శెట్టి 15-21, 17-21తో జింగ్ హాంగ్ కోక్ (మలేసియా) చేతిలో,మిథున్ మంజునాథ్ 14-21, 13-21తో షోలే ఐదిల్ (మలేసియా) చేతిలో, సతీశ్ కుమార్ 15-21,18-21తో అల్వీఫర్హాన్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయారు. మరో మ్యాచ్‌లో శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ (భారత్) 15-21, 21-15, 21-19తో జూన్ వె చీమ్ (మలేసియా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. కాగా మహిళల సింగిల్స్‌లో రక్షిత శ్రీ ముందంజ వేయగా, తాన్యా హేమంత్, తారా షా, వలిశెట్టి శ్రియాన్షి తొలి రౌండ్లో ఓడిపోయారు. రక్షిత శ్రీ 21-19, 21-16తో లుయో యువు (చైనా)పై గెలుపొందగా, తాన్యా 21-15, 11-21, 13-21తో కిసోనా సెల్వదురయ్ (మలేసియా) చేతిలో, తారా షా 15-21, 16-21తో థమనోవన్ నితిత్‌క్రాయ్ (థాయ్‌లాండ్) చేతిలో, శ్రియాన్షి 17-21, 13-21తో పిచమోన్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం పాలయ్యారు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో గద్దె రుత్విక శివాని ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. తొలి రౌండ్‌లో రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్) జంట 21-8, 21-16తో వీరాఫట్-సరారట్ (థాయ్‌లాండ్) జోడీపైవిజయం సాధించింది.

## ముందంజలో రక్షిత



# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జనవరి 30:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల మధ్య ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు కాసేపు ఒత్తిడికి లోనయ్యాయి. ఆ తర్వాత ఐటి షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో రాణించిన సూచీలు చివరికి లాభాల్లో ముగిసాయి. సెన్సెక్స్ ఉదయం 76,598.84 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. కాసేపు లాభ నష్టాల మధ్య కొనసాగిన సూచి ఇంట్రాడేలో 76,401.13 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. ఫార్మా షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో రాణించిన సూచి 76,962.88 పాయింట్ల వద్ద గరిష్టానికి చేరింది. చివరికి సెన్సెక్స్ 226 పాయింట్లు లాభపడి 76,759 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 86పాయింట్లు లాభపడి 23,249 పాయింట్ల వద్ద నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, ఏసియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి షేర్లు లాభపడ్డాయి. టాటామోటార్స్, ఐటిసిహోటల్స్, బజాజ్‌ఫిన్‌సర్వ్, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, జొమాటో, కోటాక్ మహీంద్రా బ్యాంకు షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 76.05 డాలర్ల వద్ద ట్రేడయింది.





# బడ్జెట్‌పైనే ఆరోగ్య రంగం ఫోకస్

**న్యూఢిల్లీ, జనవరి 30:** ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 8వ బడ్జెట్‌ను 1 ఫిబ్రవరి 2025న ప్రవేశపెట్టనున్నారు. నిజానికి బడ్జెట్‌పై ప్రతి రంగానికి అంచనాలు ఉంటాయి. అయితే ఈ సారి బడ్జెట్‌లో తమ డిమాండ్లను నెరవేర్చాలని ఆరోగ్య శాఖ కోరుతోంది. వీటిలో ఆరోగ్య సంరక్షణలో పన్ను సంస్కరణలతో పాటు ఆవిష్కరణలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది. వాస్తవానికి హెల్త్ కేర్ ప్రొవైడర్స్ ఇంకా మెడ్-టెక్ వ్యాపారాలు ఈ రంగాన్ని పునర్నిర్మించగల అలాగే ఆవిష్కరణలు ఇంకా ఆరోగ్య సేవలకు యాక్సెస్ పరంగా దేశాన్ని ప్రపంచ లీడర్‌గా స్థాపించగల సంస్కరణల కోసం ఒత్తిడి చేస్తున్నాయి. వైద్య పరికరాలపై దిగుమతి సుంకాన్ని తగ్గించడానికి, అధునాతన సాంకేతికతలో పరిశోధన అలాగే అభివృద్ధిలో ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలని ఆరోగ్య సంరక్షణ రంగం అభ్యర్థిస్తోంది. అలాగే స్థానిక తయారీ, గ్రామీణ ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించే విధానాలు కోరుతుంది. జీరో డ్యూటీ మినహాయింపు నోటిఫికేషన్‌లను తొలగించాల్సిన అవసరం ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గత బడ్జెట్ ప్రసంగంలో హామీ ఇచ్చారని రాజీవ్ నాథ్ చెప్పారు. అందువల్ల ఎఐఎంఇడి రాయితీ డ్యూటీ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని కోరింది. ఇది సుంకాన్ని 0-7.5శాతానికి తగ్గిస్తుంది. అలాగే వైద్య పరికరాల దిగుమతులపై 5శాతం నుంచి 15శాతం సుంకాన్ని విధించాలని కోరింది.




# 10 నెలల్లో సొంత ఎఐ మోడల్: అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ, జనవరి 30:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విషయంలో అమెరికా, చైనాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్న వేళ కేంద్ర ఐటి శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. రాబోయే కొన్ని నెలల్లో భారత్ సొంత జనరేటివ్ ఎఐ మోడల్‌ను అభివృద్ధి చేసుకోబోతోందని వెల్లడించారు. ఉత్కర్ష్ ఒడిశా కాన్‌క్లేవ్‌లో ఈ మేరకు ఆయన ఈ ప్రకటన చేశారు. భారత దేశ అవసరాలను దృష్టిలో పెట్టుకొన్ని ఈ ఎఐ మోడల్‌ను తీర్చిదిద్దనున్నట్లు అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ ఎఐ మోడల్ పూర్తిగా ఇండియా ఎఐ కంప్యూటర్ సామర్థ్యంతో రూపొందనుందని తెలిపారు. మన దేశంలోని భాషా, సాంస్కృతిక వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకొని అతితక్కువ ఖర్చుతో ఈ ఎఐ మోడల్‌ను రూపొందించనున్నట్లు తెలిపారు. దేశీయ అవసరాల కోసం రూపొందించనున్న ఈ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ అభివృద్ధికి సుమారు 19వేల జిపియులు అవసరమవుతాయన్నారు. ఇందులో 15 వేల జిపియులు హైఎండ్‌వి అని తెలిపారు. ఇప్పటి వరకు ఆరుగురు డెవలపర్లను గుర్తించామని, రాబోయే 8-10 నెలల్లో ఎఐ మోడల్‌ను సిద్ధం చేసే అవకాశం ఉందని చెప్పారు. ఇదే జరిగితే ఎఐ రంగంలో దూసుకెళుతున్న అమెరికా, చైనాల సరసన భారత్ నిలవనుందన్నారు.

# పాపులర్ ప్లాన్లను తొలగించిన జియో

**ముంబై, జనవరి 30:** ప్రముఖ టెలికం సంస్థ రిలయన్స్ జియో రెండు ప్రీపెయిడ్ ప్లాన్లను తొలగించింది. వాయిస్, ఎస్సెమ్మెస్‌ల కోసం ప్రత్యేకంగా ప్యాకేజీలు తీసుకురావాలని టెలికం కంపెనీలకు ట్రాయ్ ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో కొత్త ప్లాన్లను పరిచయం చేసిన జియో, అదే సమయంలో పాత ప్లాన్లను తీసేసింది. ఇప్పటి వరకు అందిస్తున్న రూ.189, రూ.479 రీఛార్జీ ప్లాన్లను తన వెబ్‌సైట్ నుంచి పూర్తిగా తొలగించింది. తక్కువ డేటా, ఎక్కువ రోజుల వ్యాలిడిటీతో రీఛార్జి ప్లాన్లు కావాలనుకొనే యూజర్ల కోసం జియో గతంలో రూ.189 ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు అందించేది. 2జిబి డేటా కూడా లభించేది. దీని వ్యాలిడిటీ 28 రోజులు. దీంతో పాటు 84 రోజుల వ్యాలిడిటీతో రూ.479 ప్లాన్ అందుబాటులో ఉండేది. అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 1000 ఎస్సెమ్మెస్‌లు, 6జిబి డేటా వంటి ప్రయోజనాలు లభించేవి. వాల్యూ ప్లాన్స్‌గా వీటిని వ్యవహరించేవారు. ట్రాయ్ ఆదేశాలకు అనుగుణంగా రెండు వాయిస్ ఓన్లీ ప్లాన్లను ఇటీవల జియో ప్రవేశపెట్టింది. 84 రోజుల వ్యాలిడిటీతో రూ.458 ప్లాన్, 365 రోజుల వ్యాలిడిటీతో రూ.1958 ప్లాన్ తీసుకొచ్చింది. ఈ ప్లాన్లపై జియో టివి, సినిమా, క్లౌడ్ సబ్‌స్క్రిప్షన్ సదుపాయాలు జోడించింది. ధరలు ఎక్కువగా ఉన్నాయంటూ ట్రాయ్ పేర్కొన్న నేపథ్యంలో ఈ ప్రయోజనాలు అలాగే ఉంచుతూ ప్లాన్ల ధరలినన తగ్గించింది. రూ.458 ప్లాన్‌ను రూ.448కు, రూ.1958 ప్లాన్‌ను రూ.1748కు తగ్గించింది. వాల్యూ ప్లాన్లను తొలగించింది.




# భారత్‌కు వస్తున్న ఓపెన్‌ఎఐ సిఇఒ!

**వాషింగ్టన్, జనవరి 30:** చాట్‌జిపిటి మాతృసంస్థ ఓపెన్ ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్ త్వరలో భారత్‌కు రానున్నారు. వచ్చే వారంలో భారత్‌లో పర్యటించి ఇక్కడి అధికారులతో భేటీ అవుతారని తెలిసింది. భారత్‌లో ఓపెన్ ఎఐ న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటోంది. మరోవైపు చైనా ఎఐ డీప్‌సీక్ రాకతో ఈ విభాగంలో గట్టి పోటీ నెలకొంది. ఈ తరుణంలో ఆల్ట్‌మన్ పర్యటన చేపట్టనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఫిబ్రవరి 5న ఢిల్లీకి వచ్చే అవకాశం ఉందని, అయితే షెడ్యూల్‌లో మార్పు ఉండొచ్చని తెలుస్తోంది. ఆల్ట్‌మన్ చివరిసారిగా 2023లో భారత్‌ను సందర్శించి ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. భారత్‌లో సాంకేతిక వ్యవస్థను పెంచడంలో కృత్రిమ మేధ సామర్థ్యాన్ని వివరించారు. కృత్రిమ మేధ సాంకేతికతతో ఓపెన్‌ఎఐ తీసుకొచ్చిన చాట్‌బాట్‌ను వినియోగిస్తున్న వారిలో అమెరికా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉందని పేర్కొన్నారు. ఓపెన్ ఎఐకు భారత్ అతిపెద్ద మార్కెట్ అని అభి వర్ణించారు. మరోవైపు ఓపెన్ ఎఐ భారత్‌లో న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటోంది. కాపీరైట్ ఉల్లంఘనలకు పాల్పడుతోందంటూ దేశీయ వార్త సంస్థ ఎఎన్ఐ గతేడాదిలోనే దావా వేసింది. దీంతో పాటు పలు మీడియా సంస్థలు కూడా ఈ కేసులో చేరాయి. దీనిపై ఓపెన్ ఎఐ స్పందించింది. నిబంధనలకు లోబడి కేవలం బహిరంగంగా అందుబాటులో ఉన్న డేటాను మాత్రమే ఉపయోగిస్తుందని తెలిపింది.



# వాణిజ్యం

## అమెజాన్‌లో మరోసారి లేఆఫ్‌లు

**వాషింగ్టన్, జనవరి 30:** ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి పెద్ద ఎత్తున ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధమైంది. తాజా రౌండ్ తొలగింపులో కమ్యూనికేషన్ విభాగానికి చెందిన ఉద్యోగులను ఇంటికి పంపనుంది. కార్యకలాపాలను క్రమబద్ధీకరించడంతో పాటు ఖర్చుల్ని తగ్గించేందుకు అమెజాన్ సిద్ధమవుతోంది. అందులో భాగంగా తాజా తొలగింపులు చేపట్టనుంది. కంపెనీ సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు కంపెనీ విస్తృత వ్యూహంలో భాగంగా ఈ చర్యలు చేపడుతోంది. అమెజాన్ కార్యకలాపాలు చురుగ్గా సాగడానికి 'లే ఆఫ్'లు దోహదపడతాయని కంపెనీ పేర్కొంది. లేఆఫ్‌లపై కంపెనీ ప్రతినిధి బ్రాడ్ గ్లాసర్ స్పందించారు. ఉద్యోగుల తొలగింపు నిజమైనది పేర్కొన్న ఆయన ఈ నిర్ణయం సులభమైనది కాదన్నారు. కస్టమర్లను




మరింత చేరువయ్యేందుకు, ఉనికిని బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయం సాయపడుతుందన్నారు. లేఆఫ్‌ల కారణంగా ప్రభావం ఎదుర్కొనున్న ఉద్యోగులకు తాము సాయం అందిస్తామని ఆయన తెలిపారు. అమెజాన్ సిఇఒగా ఆండీ జస్సీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కంపెనీ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా లేఆఫ్‌లను ప్రటకిస్తూనే వచ్చారు. కార్యకలాపాలను విస్తృతంచేసే కఠిన చర్యల్లో భాగంగా వరుసగా ఉద్యోగులను ఇంటికి పంపుతున్నారు. 2022 లో ఏకంగా 27వేల మంది ఉద్యోగులను అమెజాన్ తొలగించింది. తాజాగా కమ్యూనికేషన్ విభాగంలోని ఉద్యోగులపై ఈ వేటు పడింది. అయితే ఎంత మందిపై ఈ ప్రభావం పడనుందనే విషయాన్నిమాత్రం కంపెనీ వెల్లడించలేదు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.